Dwaraka

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

బుధవారం 17-1-2018

సంపుటి : 4 సంచిక : 19 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | W O W | 12 + 16 పేజీలు వెల : 5.00

మహిళలకు..



'భారతీయ పురాణాల్లో మహిళలు శక్తి అవతారులు. వారిని దేవతలుగా కొలుస్తారు. మేం మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యతనిస్తాం.. దేశాభివృద్ధికి ఇది చాలా ముఖ్యమని నమ్ముతున్నాం'

- డిసెంబర్ 28, 2017 జీఈఎస్ సదస్సులో ప్రధాని మోడీ

అందని పౌష్టికం


ప్రధాని మోడీ పాలనలో వివక్ష ప్రభావం

మహిళలకు సరైన పౌష్టికాహారం అందటంలేదని, దేశ అభివృద్ధికి ముఖ్యమైన వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతామని.. ప్రధాని మోడీ అధికారం చేపట్టిన నాటి నుంచి వల్లె వేస్తూనే ఉన్నారు. కాగా పుష్టికరమైన ఆహారం సమకూర్చడంలో కూడా దేశంలోని మహిళలు వివక్షకు గురవుతున్నారు. ఈ వాస్తవాన్ని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే వెల్లడించింది. దేశంలో 53 శాతం మంది అబలలకు సమతుల్యమైన ఆహారం అందడంలేదన్న కఠోరవాస్తవాలను కేంద్ర సంస్థ బహిర్గతం చేసింది.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2015-16 నివేదిక



న్యూఢిల్లీ : పుష్టికరమైన ఆహారం సమకూర్చడంలో కూడా దేశంలోని మహిళలు వివక్షకు గురవుతున్నారు. దాదాపు సగం మందికి సమతుల్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారం లభించటం లేదని 2015-16 సంవత్సరానికి సిద్ధం చేసిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తెలియజేస్తోంది. దాదాపు 47 శాతం మంది స్త్రీలకు మాత్రమే రోజూ ఆకు కూరలు, తాజా కూరగాయలు అందుబాటులో ఉంటున్నాయి. ఇక సుమారుగా 38 శాతం మంది మహిళలకు వారానికి ఒక్కసారి మాత్రమే ఇలాంటి పోషక ఆహారం లభిస్తోంది. ఆహారంలో తగినంత ప్రోటీన్లు, ఫాట్స్, కార్బొహైడ్రేట్స్, విటమిన్స్ ఇంకా ఇతర మినరల్స్ ఉంటేనే మహిళలకు అనేక రకాలైన ఆరోగ్య సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది. ముఖ్యంగా డయాబిటీస్, స్థూల దేహం, లివర్ వ్యాధులు, క్యాన్సర్ వంటి వ్యాధులు సోకకుండా ఉండాలంటే ఆహారంలో సమృద్ధిగా ఆకు పచ్చని కూరలు, పండ్లు, తాజా కూరలు, పాలు, మాంసం, గ్రుడ్లు, పెరుగు వంటివి తగుపాళ్లలో ఉండాల్సిన అవసరం ఉందని డయాబిటీస్, ఇతర మెటబాలిక్ వ్యాధుల అధ్యయన కేంద్రం చైర్మెన్ అనూప్ మిశ్రా తెలిపారు. పప్పు ధాన్యాలు ప్రతి రోజూ తీసుకునే వారు 45 శాతం ఉంటున్నారు. దాదాపు అదే సంఖ్యలో మహిళలు వారానికి ఒకసారి మాత్రమే ఆ తరహా ఆహారం తీసుకుంటున్నారు. ఇక పాలు, పెరుగు వంటివి రోజూ తీసుకుంటున్న మహిళల శాతం 45 మాత్రమే కాగా, వారానికి మాత్రమే తీసుకుంటున్న వారు 23 శాతం వరకు ఉంటున్నారు. మహిళలకు సరైన ఆహారం అందకపోవడానికి పేదరికం కొంత వరకు కారణం అయినా, మహిళలకు అవసరమైన ఆహారంలో పోషకాల ప్రాధాన్యతను కుటుంబాలు గుర్తించకపోవడంతో పాటు వారి పట్ల ఉన్న చిన్న చూపు ప్రధాన కారణమని సెంటర్ ఫర్ సోషల్ రీసెర్చి డైరెక్టర్ రంజన కుమారి తెలిపారు. తక్కువ మోతాదులో ఆహారం, పోషక సమృద్ధి లేని ఆహారం మహిళలకు సర్వసాధారణంగా మారిందని ఆమె చెప్పారు. ఇక దాదాపు 54 శాతం మంది మహిళలు వారానికి ఒక్కసారి కూడా పండ్లు తీసుకోరు. చాలా కొద్ది మంది మాత్రమే రోజూ గుడ్డు ...9లో



హజ్ సబ్సిడీ రద్దు

- 2022 దాకా దశలవారీగా సబ్సిడీ తొలగించమన్న సుప్రీం
- 2012లో 836 కోట్ల సబ్సిడీ..2018లో జీరో
- ఖజానాకు భారమన్న బీజేపీ సర్కార్
- నరేంద్ర మోడీ ప్రభుత్వ మరో వివాదాస్పద నిర్ణయం

వివరాలు 9లో

నాగోబా జాతర ఆరంభం

అర్ధరాత్రి పూజలు నిర్వహించి ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ



నీళ్లు తీసుకొస్తున్న గిరిజన మహిళలు

నవతెలంగాణ - ఇంద్రవెల్లి

రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా జాతర మంగళవారం అర్ధరాత్రి ఆరంభమైంది. కలెక్టర్ డి.దివ్యతోపాటు ఎస్పీ విష్ణు వారియార్, ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఐటీడీఏ చైర్మెన్ కనక లక్కేరావు, మెస్రం వంశీయులు పూజలు చేశారు. జాతర ఆరు ...9లో

రాష్ట్రంలో మరో నాలుగు వేల

పంచాయతీలు

ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు సీఎం కేసీఆర్ యోచన!



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రస్తుతమున్న గ్రామ పంచాయతీలకు అదనంగా మరో నాలుగువేల పంచాయతీల ఏర్పాటు చేసే అవకాశముందని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. అన్నింటికీ కలిపి ఫిబ్రవరిలో ఎన్నికలు జరిపేందుకు యోచిస్తున్నామని చెప్పారు. ఇందుకుగల అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. పంచాయతీల ఏర్పాటుకు వీలుగా జిల్లా పంచాయతీ అధికారులు పంపిన ప్రతిపాదనల ప్రకారం హద్దులను ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించారు. రాజ్యాంగం ఇదే విషయాన్ని చెబుతున్నదని ఆయన గుర్తుచేశారు. న్యాయస్థానాల లిటిగేషన్లకు తావు లేకుండా వీటిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శాసన ప్రక్రియ ద్వారా పంచాయతీలను ఏర్పాటు చేయబోతున్నామని సీఎం తెలిపారు.

మంగళవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ల సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, భూ రికార్డుల ప్రక్షాళన, పంచాయతీ ఎన్నికలు, అందుకోసం ...9లో

ఎస్సారెస్పీ ట్రాన్స్‌ఫార్మర్లకు

విద్యుత్ తొలగింపు

- నిరసనగా రైతుల రాస్తారోకో.. మద్దతు తెలిపిన ఎమ్మెల్యే
- సాగు నీటికోసం పండుగ పూట పెద్దపల్లి ఎమ్మెల్యే ఘెరావ్



రాస్తారోకోకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ- జగిత్యాల/కాల్వశ్రీరాంపూర్

ఎస్సారెస్పీ కాల్వ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయడాన్ని నిరసిస్తూ జగిత్యాల జిల్లాలో రైతులు మంగళవారం రాస్తారోకో చేశారు. 24 గంటల విద్యుత్ అని చెప్పి ఇప్పుడు విద్యుత్ సరఫరా నిలిపేయడమేంటని ప్రశ్నించారు. వారి ఆందోళనకు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, టీఆర్ఎస్ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సంజయ్‌కుమార్ మద్దతు తెలిపారు. అధికారులు విద్యుత్‌ను వెంటనే పునరుద్ధరించడంతో ...9లో



విద్యాభివృద్ధిపై కేంద్రానికి

చిత్తశుద్ధి లేదు

- కడియం విమర్శలు

వివరాలు 3లో

డిజిటలైజేషన్‌కు

యువత దూరం

- ఇంటర్నెట్ వాడుతున్నది 28శాతం మందే
- టీవీలు చూసేది 85శాతం, పేపర్లు చదివేది 58శాతం
- 14-18 ఏండ్ల విద్యార్థుల స్థితి: 'ప్రథమ్' సర్వేలో వెల్లడి

వివరాలు 9లో

మార్చి 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మార్చి 12 నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలను నిర్వహిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక కమిషన్‌కు రూ.2 వేల కోట్ల నిధులు కేటాయిస్తామని చెప్పారు. పంచాయతీ రాజ్ చట్ట సవరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెడతామని.. ఆ సందర్భంగా పంచాయతీ ఎన్నికల విధి విధానాలను ఆ బిల్లులో పొందుపరుస్తామని తెలిపారు. 500 వరకు జనాభా ఉన్న చిన్న ...9లో




నేను యాడికెళ్లినా..

గోమూత్రంతో శుద్ధి చేస్తారా?

బీజేపీ యువ మోర్చా కార్యకర్తలపై ప్రకాశ్‌రాజ్ ఆగ్రహం

కర్నాటక: సిర్సిలోని రాఘవేంద్ర మఠంలో వామపక్ష మేధావులు ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ హాజరయ్యారు. 'మన రాజ్యాంగం- మన హోదా' పేరుతో జరిగిన ఈ సమావేశం అనంతరం ఆయన కేంద్ర మంత్రి అనంతకుమార్ హెగ్డేపై విమర్శలు చేశారు. ఆ తర్వాత ఆ సమావేశ ప్రాంగణాన్ని బీజేపీ యువ మోర్చా కార్యకర్తలు సంక్రాంతి పండుగ రోజు గో మూత్రంతో శుద్ధి చేశారు. తమ పుణ్యక్షేత్రాన్ని అపవిత్రం ...9లో



మళ్లీ పెట్రోలు, డీజిల్ వాత

- 2014 తర్వాత గరిష్ట స్థాయికి ధరలు

వివరాలు 9లో



మరి నోట్ల కరువు, గోరక్షణ పేరుతో జనాన్ని సంపడం ఎప్పుడైనా సుసినావా..?..!!

వెల్‌నెస్.. ఇది ఉద్యోగికి హెల్దీనెస్!

ఉద్యోగుల బాగోగులను గాలికొదిలేసిన 52% కంపెనీలు

- వెల్ నెస్ కార్యక్రమాలకు పలు సంస్థలు తిలోదకాలు
- ఉద్యోగుల గైర్హాజరు ఒక్క శాతం తగ్గించినా.. 128వేల కోట్లు లాభమే!
- ఉద్యోగి శారీరక, మానసిక ఆరోగ్యం.. సంస్థ ప్రగతికి కీలకం: నిపుణులు
- అసోచాం అధ్యయనంలో వెల్లడి

వృత్తి - జీవితం ఈ రెండూ నేటి ఆధునిక ప్రపంచంలో మనిషికి రెండు కండ్లు లాంటివని చెప్పొచ్చు. వీటిలో ఏ ఒక్కటి పరిపూర్ణం కాకపోయినా.. మనిషి కుంగిపోవడం ఖాయం! అందుకే, వర్క్- లైఫ్ ను బ్యాలెన్స్ చేయడం ప్రస్తుతం చాలా అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఐతే, వృత్తే జీవితంగా భావిస్తూ.. సంస్థల ఉన్నతికి పాటుపడుతోన్న ఉద్యోగుల బాగోగులను కొన్ని కంపెనీలు అస్సలు పట్టించుకోవట్లేదని తాజా అధ్యయనంలో తేలింది. ఈ నేపథ్యంపై నవతెలంగాణ ప్రత్యేక కథనం..

వివరాలు 9లో



ఏబీవీపీ, విశ్వ సనాతన్ సంఘ్

కార్యకర్తల రభస

- కళాశాలలో ప్రవేశించి మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు కుట్ర
- అడ్డుకున్న పోలీసులు

వివరాలు 2లో



భారత్-ఇజ్రాయిల్ మధ్య 9 ఒప్పందాలు


- తాజ్‌మహల్‌ను సందర్శించిన ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు
- పర్యటనను వ్యతిరేకించిన ముస్లిం మత పెద్దలు

న్యూఢిల్లీ/ఆగ్రా: ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భారత్‌లో పర్యటన సందర్భంగా ఇరు దేశాలు తొమ్మిది అవగాహనా ఒప్పందాలపై(ఎంవోయూలు) సంతకాలు చేశాయి. ఇంధన (చమురు,గ్యాస్), రోదసి,రక్షణ, సైబర్ భద్రత, శాస్త్ర-సాంకేతిక సహకారంతోపాటు వ్యవసాయం, ఇతర రంగాలలో ఈ ఒప్పందాలు జరిగాయి. సోమవారం భారత్-ఇజ్రాయిల్ అధికారులు అవగాహనా ఒప్పందాలపై సంతకాలు చేశారు. భారత్‌లో ఆరు రోజుల(ఈ నెల 14 నుంచి 19 వరకు) పర్యటన కోసం నెతన్యాహు ఆదివారమే భారత్ చేరుకున్నారు. ఆయన వెంట ఆ దేశానికి చెందిన 130మంది ప్రతినిధుల బృందం భారత్ చేరుకున్నది. వారిలో వివిధ రంగాలకు చెందిన అధికారులున్నారు. పదహేను సంవత్సరాల తర్వాత ఇజ్రాయిల్ ప్రధాని భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 2003లో అప్పటి ఇజ్రాయిల్ ప్రధాని ఏరియల్‌షెరాన్ భారత్‌లో పర్యటించారు. ఆ సమయంలోనూ కేంద్రంలో వాజ్‌పేయి నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వమే అధికారంలో ఉన్నది. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తన భార్య సారాతో కలిసి మంగళవారం తాజ్‌మహల్‌ను సందర్శించారు. తాజ్‌మహల్‌ను చూడటానికి ఆగ్రా వెళ్లిన నెతన్యాహు దంపతులకు ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వాగతం పలికారు. తన భార్య ముంతాజ్‌బేగమ్ పట్ల ప్రేమకు గుర్తుగా షాజహాన్ 17వ శతాబ్దంలో తాజ్‌మహల్‌ను నిర్మించారు. వీవీఐపీల రాకతో తాజ్‌ను చూడటానికి వచ్చిన సందర్శకులను రెండుగంటలపాటు అధికారులు అనుమతించలేదు. తాజ్‌మహల్ వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేశారు.

ఆగ్రాలోని ముస్లిం మత పెద్దలు నెతన్యాహు పర్యటన పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. పాలస్తీనా ప్రజల పట్ల ఇజ్రాయిల్ సాగిస్తున్న జాత్యహంకార దాడులకు నిరసనగా తాము నెతన్యాహు పర్యటనను వ్యతిరేకిస్తున్నట్టు తంజీమ్ ఉలేమా-ఏ-అహల్-ఏ-సున్నాత్ అధ్యక్షుడు ముఫ్తీముదస్సార్ అలీఖాన్ ఖాద్రీ తెలిపారు. ఇజ్రాయిల్‌ను ముస్లింలకు శత్రువుగా ఆయన అభివర్ణించారు. పాలస్తీనీయులకు వారి సొంత గడ్డపైనే హక్కులు లేకుండా ఇజ్రాయిల్ అణచి వేస్తున్నదని ఆయన అన్నారు. ఆగ్రాలో ఇజ్రాయిల్ భాగస్వామ్యంతో యూపీ ప్రభుత్వం నిర్లవణీకరణ నీటి ప్లాంట్‌ను ఇప్పటికే ఏర్పాటు చేసింది. రూ.14కోట్ల 42 లక్షల ఖర్చుతో మురికినీటిని శుద్ధి చేయడం కోసం ఈ ప్లాంట్ ఏర్పాటైంది. 2016లో ఆగ్రాలో పర్యటన సందర్భంగా ఇజ్రాయిల్ అధ్యక్షుడు రెవూవెన్ రెవ్లిన్ ఆ ప్లాంట్‌ను పరిశీలించారు. స్థానిక అధికారుల సూచన మేరకు నెతన్యాహు ఆ ప్లాంట్ దగ్గరికి వెళ్లకుండానే ఆగ్రా నుంచి వెనుతిరిగారు.

మా రాష్ట్రంలోనూ విడుదల కానివ్వం..

- 'పద్మావత్' నిలిపివేస్తాం : హర్యానా



చండీగఢ్/రాట్లమ్ : సంజయ్ లీలా భన్సాలి ప్రతిష్టాత్మక 'పద్మావత్' సినిమాకు సెన్సార్‌బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా.. బీజేపీ పాలిత రాష్ట్రాల నుంచి అడ్డంకులు మాత్రం తొలగడంలేదు. ఒకదాని తర్వాత ఒకటి మా రాష్ట్రంలో సినిమాను విడుదల కానివ్వబోమని ప్రకటిస్తూనే ఉన్నాయి. తాజాగా హర్యానా ప్రభుత్వం కూడా ఈ నిర్ణయం తీసుకుంది. కాగా.. ఇది సినిమాను అడ్డుకుంటున్న బీజేపీ పాలిత ఆరో రాష్ట్రం కావడం గమనార్హం. పద్మావత్‌ను మా రాష్ట్రంలో నిషేధిస్తున్నామని హర్యానా ఆరోగ్య మంత్రి అనిల్ విజ్ ట్వీట్ చేశాడు. క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. కొన్ని కత్తెరలు, పద్మావతిని పద్మావత్‌గా మార్చిన తర్వాత విడుదలకు సెన్సార్ బోర్డు అంగీకారం తెలిపిన తర్వాత ఇప్పటివరకూ గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్‌లు ఆయా రాష్ట్రాల్లో నిషేధం విధిస్తూ ప్రకటనలు చేశాయి.

పద్మావత్ పాటకు నృత్యం చేస్తున్న విద్యార్థులపై దాడి

: పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా పద్మావత్ సినిమాలోని ఘూమర్ పాటకు నృత్యం చేస్తున్న వారిపై పలువురు దాడి చేసిన సంఘటన మధ్యప్రదేశ్‌లో చోటు చేసుకుంది. స్థానిక రాట్లామ్‌లో సెయింట్ పాల్స్ కాన్వెంట్ వార్షికోవంలో ఈ పాటకు పలువురు విద్యార్థులు నృత్యం చేస్తుండగా, భగత్ సింగ్ పీజీ కాలేజి విద్యార్థులు కొందరు రాజ్‌పుత్ కర్ణిసేన సభ్యులుగా చెప్పుకుంటూ సెయింట్ పాల్స్ కాన్వెంట్లోకి చొరబడ్డారు. నృత్యం చేస్తున్న విద్యార్థుల పట్ల అనుచితంగా ప్రవర్తించారని, అడ్డువచ్చిన తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యంపై కూడా దాడి చేశారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కుర్చీలను, స్టేజీని, మ్యూజిక్ సిస్టమ్‌ను నాశనం చేశారు. దాడికి పాల్పడిన నలుగురు యువకులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని, వారిపై కేసు నమోదు చేశారు.

'జల్లికట్టు'కు నలుగురి బలి

చెన్నై : తమిళనాట జల్లికట్టు 'జూలు విదిల్చింది. ఇది హింసాత్మకం అంటూ జంతు ప్రేమికులు గొడవ చేస్తున్నా, సుప్రీంకోర్టు అడ్డుపడుతున్నా లెక్కచేయని వీరాభిమానులు బరిలోకి దిగి ప్రాణాలు కోల్పోతున్నారు. మధురైలో జరిగిన జల్లికట్టు 'ఉత్సవానికి' ముఖ్యమంత్రి పళనిసామి, ఉప ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం హాజరై విజేతలకు ఏకంగా బహుమతులు ప్రకటించడం విశేషం. సోమ, మంగళవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన జట్టుకట్టు కార్యక్రమంలో నలుగురి మృతిచెందారు. మధురై, శివనాగాంలలో సోమవారం జల్లికట్టుకు హాజరైన ఇద్దరు యువకులను పోట్ల గిత్తల దాడిలో మృతి చెందారు. మంగళవారం మరో ఇద్దరు మృతిచెందినట్టు అధికారులు తెలిపారు. జల్లికట్టు జరిగే ప్రాంతమంతా ఏఐఏడీఎంకే నాయకులతో, మాజీ ముఖ్యమంత్రి జయలలిత స్టిక్కర్లతో నిండిపోయింది. కాగా జల్లికట్లుపై పెద్దఎత్తున నిరసన వ్యక్తమవడంతో సుప్రీం కోర్టు గతంలో దీన్ని నిషేధించింది. పన్నీరు సెల్వం ముఖ్యమంత్రిగా ఉండగా జల్లికట్లు నిర్వహణకు ప్రత్యేక ఉత్తర్వులు జారీచేశారు. పశువైద్యులు ఉత్ప్రేరకాలు వాడకుండా ఉన్న వాటిని మాత్రమే ఎంపిక చేశారని అధికారులు పేర్కొంటున్నారు.

లైంగికదాడి అవమానంతో.. మైనరు ఆత్మహత్య

- కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్న బాలిక
- ఉత్తరప్రదేశ్‌లో దారుణ ఘటన

లక్నో : తనపై జరిగిన లైంగికదాడి ఘటనతో అవమానంగా భావించిన మైనరు బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఒంటిపై కిరోసిన్‌పోసుకుని నిప్పటించుకుని సజీవ దహనమైంది. ఉత్తరప్రదేశ్‌లోని మజ్జగా ప్రాంతంలో ఈ దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. కథ గ్రామంలో ఆదివారం ఇద్దరు అన్నదమ్ములు ఆ మైనరు బాలికపై లైంగికదాడికి పాల్పడ్డారని పోలీసు సూపరింటెండెంట్ దినేశ్ కుమార్ చెప్పారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై ఆ ఊరి గ్రామస్తులు ఇద్దరూ దారుణానికి పాల్పడ్డారన్నారు. 'తీవ్ర మనస్థాపానికి గురైన ఆ బాలిక మంగళవారం ఉయదం ఒంటిపై కిరోసిన్‌పోసుకుని నిప్పటించుకుంది. తీవ్ర కాలిన గాయాలైన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది' అని ఎస్పీ చెప్పారు. నిందితుల్లో ఒకరిని అరెస్టు చేశామనీ, పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నామని అన్నారు.

ఏబీవీపీ, విశ్వ సనాతన్ సంఘ్ కార్యకర్తల రభస

కళాశాలలో ప్రవేశించి మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు కుట్ర



భోపాల్ : బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లోని క్రిస్టియన్ కళాశాల వద్ద ఏబీవీపీ, విశ్వ సనాతన్ సంఘ్ కార్యకర్తల వీరంగం సృష్టించారు. ఓ కళాశాలలో ప్రవేశించి 'భారత్ మాతా హారతి' పేరుతో కార్యక్రమం నిర్వహించడం ద్వారా మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు ఏబీవీపీ, విశ్వసనాతన్ సంఘ్ కార్యకర్తలు ప్రయత్నించారు. విదీషాలోని సెయింట్ మేరీ పీజీ కళాశాలలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన హిందుత్వ కార్యకర్తలను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున తోపులాట కూడా చోటుచేసుకుంది. ఈ నెల 4న ఏబీవీపీ కార్యకర్తలు అనేక పాఠశాలలు, కళాశాలల్లో 'హారతి' కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా, సెంట్ మేరీ కళాశాల యాజమాన్యం వారిని అడ్డుకుంది. మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా ఉన్న ఈ కార్యక్రమాన్ని నిలిపివేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కాగా బలవంతంగా లోపలికి ప్రవేశించిన సంఘ్ కార్యకర్తలు కళాశాలలో విధ్వంసం సృష్టించారు. ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో రంగప్రవేశం చేసిన పోలీసులు వారిని బయటకు పంపారు. కాగా, వారు తిరిగి 'భారత్ మాతా హారతి' పేరుతో మంగళవారం మరోసారి కళాశాలలో ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని కళాశాలల నుంచి మంగళవారం జరిగే ఈ కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. కాగా, సుమారు 30 మంది కళాశాల వద్ద గుమికూడి విధ్వంసం సృష్టించేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. 'దాదాపు 25 మంది కళాశాలలో బలవంతంగా ప్రవేశించేందుకు ప్రయత్నించారు. రక్షణ కల్పిస్తామని కోర్టుకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వారందరినీ అదుపులోకి తీసుకున్నాం' అని విదీషా జిల్లా ఎస్పీ చెప్పారు. తమ విద్యా సంస్థలకు ఏబీవీపీ నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ క్యాథలిక్ స్కూల్ అసోసియేషన్ ఇటీవల మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించింది. కాగా, ఈ కేసు విచారణ సందర్భంగా ఆయా కళాశాలలకు రక్షణ కల్పించాల్సిందిగా పోలీసులను కోర్టు ఆదేశించింది. దీంతో క్రిస్టియన్ కళాశాలలు, కాలేజీల వద్ద ముందు జాగ్రత్త చర్యగా పోలీసు బలగాలను ఏర్పాటుచేశారు

సోషల్ అడ్డా



ఆకలి తట్టుకోలేక ప్రసాదం కోసం గుళ్లోకెళ్లారని దళిత పిల్లలను ఇలా సగం గుండు గీసి చెట్టుకు కట్టి కొట్టిన వారిని మనుషులంటారా!!

జస్టిస్ లోయా మృతిపై ఎన్నో అనుమానాలు

ప్రణాళిక ప్రకారమే హత్య చేశారంటున్న లోయా స్నేహితుడు

- నిందితుడిగా ఉన్న అమిత్ షా కేసుకు.. దీనికి ఏదో సంబంధముంది..



ముంబయి : జస్టిస్ లోయా గుండెపోటుతో మరణించటం వెనుక ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయనతోపాటు లా డిగ్రీ చదువుకున్న స్నేహితుడు ఉదయ్ గారే కూడా, "లోయాది సహజ మరణం కాదు, పక్కా ప్రణాళికతో జరిగిన హత్య"గా అనుమానిస్తున్నాడు. పలు ప్రజాసంఘాలు, ఆల్ ఇండియా పీపుల్స్ ఫోరం, వివిధ రాజకీయ గ్రూపులు ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఉదయ్ గారే పై సంచలన వ్యాఖ్యలు చేశారు. లాతూర్ బార్ అసోసియేషన్ సభ్యుడిగా గారే న్యాయవాద వృత్తిలో ఉన్నారు. కార్యనిర్వాహక వ్యవస్థ (మోడీ సర్కార్)...న్యాయవ్యవస్థలో కలుగజేసుకోవటం వల్లే జస్టిస్ లోయా చనిపోవడానికి దారితీసిందన్న అనుమానాన్ని ఉదయ్ గారే వ్యక్తం చేశారు. జస్టిస్ లోయా మరణం తర్వాత చోటుచేసుకున్న పరిణామాలే తన అనుమానాల్ని బలపర్చేలా ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఇంకా ఆయన ఏమన్నారంటే..."న్యాయవ్యవస్థ మేల్కోవాలి. లేదంటే దేశాన్నే అమ్మేస్తారు. జస్టిస్ లోయా, నేను ఇద్దరం మంచి మిత్రులం. ఒకేసారి లా డిగ్రీ పూర్తిచేశాం. న్యాయమూర్తిగా లోయా నిష్పాక్షిక తీర్పులు ఇచ్చారు. ఒక మామూలు కుటుంబం నుంచి వచ్చిన లోయా ఎంతో ఎత్తుకు ఎదిగారు. కానీ హఠాత్తుగా అందరికీ దూరమయ్యారు. పక్కా ప్రణాళిక ప్రకారమే ఆయన్ని హత్య చేశారన్న ఆగ్రహం అనేకమంది ఇతర న్యాయమూర్తులు వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ దెబ్బతింటే, ప్రజాస్వామ్యం మనుగడసాగించ లేదు" అని చెప్పారు.

సోహ్రబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసును ప్రస్తావిస్తూ, "జస్టిస్ లోయా 2014, డిసెంబరు 1న మరణించారు. ఆయన స్థానంలో కేసు విచారణను చేపట్టడానికి న్యాయమూర్తి ఎంబీ గోసావీ వచ్చారు. సీబీఐ దాఖలుచేసిన 10 వేల పేజీల ఛార్జ్‌షీట్‌ను కేవలం 15 రోజుల్లో చదివిన న్యాయమూర్తి ఎంబీ గోసావీ కీలక తీర్పు చెప్పేశారు. ఈ కేసులో నిందితుడుగా ఉన్న బీజేపీ చీఫ్ అమిత్ షాను నిర్దోషిగా తేల్చేశారు. 2005 నుంచి 9 ఏండ్లుగా నడుస్తున్న ఈకేసును కేవలం 15 రోజుల్లోనే న్యాయమూర్తి తేల్చేయటం ఆశ్చర్యపర్చింది"అని అన్నారు.

ఏ విషయమూ దాచాల్సిన అవసరం లేదు

జస్టిస్ లోయా మృతి కేసుపై విచారణ చేపట్టిన సుప్రీం

దస్త్రాల్లో రహస్య సమాచారం, బహిర్గతం చేయవద్దన్న మహారాష్ట్ర

న్యూఢిల్లీ: సీబీఐ జడ్జి జస్టిస్ బీహెచ్ లోయా మృతిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు 'అందరికీ అన్ని విషయాలు తెలియాలి. దాచాల్సిన అవసరం లేదు' అని వ్యాఖ్యానించింది. సోహ్రబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసు విచారణ జరుపుతున్న లోయా 2014లో మరణించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఏ విషయమూ దాచి ఉంచాల్సిన అవసరం లేదని జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం మంగళవారం విచారణలో వెల్లడించింది. ఈ కేసుపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని కోరుతున్న పిటిషనర్లకు.. లోయా మృతికి సంబంధించిన దస్త్రాలను అందజేయాలని కోర్టు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని తాజాగా ఆదేశించింది.

ఈ విచారణలో మహారాష్ట్ర ప్రభుత్వం లోయా పోస్ట్‌మార్టం నివేదికతో పాటు కేసుకు సంబంధించి అన్ని దస్త్రాలను సీల్డ్ కవర్‌లో సుప్రీంకోర్టులో అందజేసింది. దస్త్రాల్లో రహస్య సమాచారం ఉందని.. పిటిషనర్లకు, బయటి ప్రజలకు తెలియకూడదని మహారాష్ట్ర ప్రభుత్వం తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే కోర్టును కోరారు. అయితే తమకు కేసుపై వాదించడానికి దస్త్రాల్లో సమాచారం తెలియాలని పిటిషనర్ల తరపు కౌన్సిల్ ధర్మాసనాన్ని కోరింది. దీంతో కోర్టు అన్ని విషయాలు అందరికీ తెలియాలని, దస్త్రాలను పిటిషనర్లకు అందజేయాలని ఆదేశించింది.

దస్త్రాలను పిటిషనర్ల కౌన్సిల్‌కు ఇస్తాము, కానీ ప్రజలకు బహిర్గతం చేయొద్దని హరీష్ సాల్వే కోరారు. దీంతో వారంలోగా పిటిషనర్లకు సదరు దస్త్రాలను అందించాలని కోర్టు ఆదేశించింది. తాము కూడా దస్త్రాలను బహిర్గతం చేయబోమని పిటిషనర్ల కౌన్సిల్ హామీ ఇచ్చింది. లోయా మృతిపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని దాఖలైన రెండు పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరుపుతోంది. మంగళవారంనాటి వాదనల అనంతరం విచారణ తేదీ వెల్లడించకుండా కేసును సుప్రీం వాయిదా వేసింది.

'ఆ నలుగుర్ని' పక్కకు పెట్టి...

మిగతా న్యాయమూర్తులకు కేసుల విచారణ

- 8 కీలక కేసుల విచారణపై సీజేఐ నేతృత్వంలో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు
- ఇంకా కొనసాగుతున్న జడ్జీల వివాదం !



న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు, ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాకు మధ్య ఇంకా కోల్డ్‌వార్ కొనసాగుతోందన్న వార్తలు వెలువడుతున్నాయి. బుధవారం నుండి 8 కీలక కేసుల విచారణ సుప్రీంకోర్టు ముందుకు రానున్నాయి. వీటికి సంబంధించి కేసులను విచారించేందుకు దీపక్ మిశ్రా ఆధ్వర్యాన ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని సుప్రీంకోర్టు మంగళవారం ప్రకటించింది. ఈ ధర్మాసనంలో సీనియర్ న్యామూర్తులైన జస్టిస్ చలమేశ్వర్, రంజన్ గొగోయ్, కురియన్ జోసఫ్, మదన్ లోకుర్‌లలో ఒక్కరు కూడా లేరు. ఈ నలుగురు న్యాయమూర్తులే చరిత్రలో మొట్టమొదటి సారిగా గత శుక్రవారం పత్రికా విలేకరుల ముందుకు వచ్చి సీజేఐ దీపక్ మిశ్రా తీరును ఆక్షేపించిన విషయం తెల్సిందే.

ఈ 8 కీలక కేసుల్లో ఆధార్ ఒకటికాగా, స్వలింగ సంపర్కులకు శిక్ష విధించే భారతీయ శిక్షాస్మృతిలోని 377వ సెక్షన్ చెల్లుతుందా ? అన్నది రెండవ కేసు. ఐపీసీలోని అక్రమ సంబంధం సెక్షన్ ఇప్పటికీ చెల్లుతుందా? అన్నది మూడో కేసుకాగా, శబరిమల ఆలయంలోకి మహిళలను అనుమతించాలా, వద్దా ? అన్నది నాలుగో కేసు. ఇవి కాకుండా మరో నాలుగు కేసులు ముఖ్యమైనవి ఉన్నాయి. దీపక్ మిశ్రా నాయకత్వాన ఏర్పాటైన జస్టిస్ ఏకే.సిక్రి, ఏఎం.ఖాన్‌వికార్, డీవై.చంద్రచూడ్, అశోక్‌భూషణ్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరపనున్నది.

సుప్రీంకోర్టు పరిపాలనా వ్యవస్థ సక్రమంగా లేదని, కీలకమైన కేసుల విచారణకు బెంచీలను ఏర్పాటు చేయడంలో సీనియర్ జడ్జీలను కాదని భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా తన ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారంటూ నలుగురు సీనియర్ జడ్జీలు పత్రికాముఖంగా దేశ ప్రజలకు స్పష్టం చేసి అప్పుడే నాలుగు రోజులు గడిచిపోయాయి. వారి ఆరోపణల్లోని నిజానిజాలను నిగ్గు తేల్చేందుకు సుప్రీం కోర్టు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలకు ఉపక్రమించలేదు. కీలకమైన కేసులను సీనియర్ జడ్జీలకు ఇవ్వకుండా తన ఇష్టానుసారం ఇస్తున్నారని, ఇతర బెంచీల ముందున్న కేసులను అనుచితంగా లాక్కుంటున్నారని ఆరోపించారు.

న్యాయమూర్తులతో సీజేఐ భేటీ

ఇదిలా ఉండగా, మంగళవారం ఉదయం సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ చలమేశ్వర్, రంజన్ గొగోయ్, కురియన్ జోసఫ్, మదన్ లోకుర్‌లతో సీజేఐ దీపక్ మిశ్రా భేటీ అయ్యారు. సుప్రీంకోర్టు పాలనావ్యవహారాలపై వారు వ్యక్తం చేసిన అభ్యంతరాలపై మిశ్రాతో చర్చ జరిగినట్టు తెలిసింది. గత శుక్రవారంనాటి విలేకర్ల సమావేశం తర్వాత సీజేఐతో జరిగిన మొదటి సమావేశం ఇది. ఈ సమావేశంలో 'లోయా' హత్యపై దాఖలైన పిటీషన్లను సుప్రీం స్వీకరించటం ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. బుధవారం కూడా మరోమారు వీరంతా సీజేఐతో చర్చలు జరపనున్నారు.

సీజేఐ తీరుపై మళ్లీ అసంతృప్తి

తాము బహిరంగంగా లేవనెత్తిన అంశాలను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, పూర్తి భిన్నంగా వ్యవహరించడం పట్ల నలుగురు సీనియర్ జడ్జీలు తీవ్ర అసంతప్తి వ్యక్తం చేసినట్టు వారి సన్నిహితులు తెలియజేశారు. ఈ వివాదాన్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించుకోవడం మంచిదని భారత బార్ కౌన్సిల్ ఛైర్మన్ మానన్ కుమార్ మిశ్రా, అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ వ్యాఖ్యానించారు. అయితే ఇది అంత తొందరగా సమసిపోయే సమస్యగా కనిపించడం లేదని నలుగురు జడ్జీల కార్యాలయ వర్గాలు అంటున్నాయి. వీరికి అండగా మరింతమంది సుప్రీంకోర్టు జడ్జీలు ముందుకు వస్తే వివాదం పరిష్కారం కావచ్చని ఆ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

కులాంతర వివాహాలు చేసుకున్న వారిపై దాడులు

కచ్చితంగా చట్టవిరుద్ధమే

- వారిని ప్రశ్నించే హక్కు కాప్ పంచాయితీలకు లేదు : సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ : కులాంతర వివాహాలు చేసుకునే ప్రేమికులను భయ భ్రాంతులకు గురిచేస్తున్న కాప్ పంచాయితీలు, గ్రామ పెద్దలకు సుప్రీంకోర్టు హెచ్చరించింది. వయోజనులైన యువతీ, యువకులు కులాంతర వివాహం చేసుకుంటే, వారిని అడ్డుకునే అధికారంకానీ, ప్రశ్నించే అధికారంకానీ కాప్ పంచాయితీలు, గ్రామ పెద్దలు, వ్యక్తులు, సమాజానికి లేదని స్పష్టంచేసింది. ఇలాంటి చర్యలను చట్టవిరుద్ధంగా పరిగణించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. కులాంతర వివాహాలు చేసుకునే వారిపై దాడులు, పరువు హత్యలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అమికస్ క్యూరీ రాజు రామచంద్రన్ చేసిన సలహాలు, సూచనలపై తన అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వం తెలియచేయాలని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఫిబ్రవరి ఐదో తేదీకి వాయిదావేసింది. కులాంతర వివాహాలు చేసుకున్న వధూవరులను వేరు చేయడమేకాకుండా, వారిపై దాడులకు పాల్పడిన ఘటనలూ గతంలో వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో వారిపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం పై హెచ్చరికలు చేసింది.

ఎయిరిండియాలో పెట్టుబడుల ఉపసంహారణకు 'నో'

రసాభాసగా ముగిసిన పార్లమెంటరీ కమిటీ సమావేశం

- హాజరు కాని కమిటీ అధ్యక్షుడు
- ముసాయిదాపై 16 మంది అసమ్మతి
- ముగ్గురు సభ్యుల వాకౌట్



న్యూఢిల్లీ : ఎయిరిండియాలో పెట్టుబడుల ఉప సంహరణ ప్రతిపాదనకు పార్లమెంటరీ కమిటీ 'గండి' కొట్టింది. మంగళవారం ఇక్కడ సమావేశమైన రవాణా, పర్యాటకం, సంస్కృతి వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఎయిరిండియాలో పెట్టుబడుల ఉప సంహరణకు సంబంధించిన వివాదాస్పద ముసాయిదా బిల్లును ఉపసంహరించాలని నిర్ణయించింది. ఈ సమావేశంలో పలువురు సభ్యులు నిరసన గళం విప్పారు. దీనికి సంబంధించి రూపొందించిన ముసాయిదా నివేదికను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మరికొందరు ప్రతిపక్ష నేతలు తమ నిరసనను తెలుపుతూ సమావేశం నుండి వాకౌట్ చేశారు. ఈ కమిటీ ఛైర్మెన్‌గా వున్న తృణమూల్ కాంగ్రెస్ నేత డిరెక్ ఓబ్రియన్ ఈ సమావేశానికి హాజరు కాలేదు. దీంతో బీజేపీ సభ్యుడు రాకేష్ సింగ్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఎయిరిండియాలో పెట్టుబడుల ఉప సంహరణకు ఇది తగిన సమయం కాదని, సంస్థ పునరుద్ధరణకు కనీసం ఐదేళ్ళు గడువివ్వాలని కమిటీ పేర్కొంది. మొత్తం 31 మంది సభ్యులున్న ఈ కమిటీలో 16 మంది ముసాయిదా నివేదికను వ్యతిరేకిస్తూ లిఖితపూర్వకంగా తన అసమ్మతిని తెలిపారు. ఎయిరిండియాలో ప్రభుత్వ వాటాలు అమ్మడానికి సానుకూలత వ్యక్తం చేసిన వారిలో అత్యధికులు అధికార బీజేపీ సభ్యులే కావడం విశేషం. నివేదిక ఉప సంహరణపై తీవ్ర అభ్యంతరాలు తెలుపుతూ ప్రతిపక్ష సభ్యులు కాంగ్రెస్‌కు చెందిన కుమారి షెల్జా, తృణమూల్‌కు చెందిన అర్పిత ఘోష్, రీటాబ్రాత బెనర్జీలు సమావేశాన్ని బహిష్కరించారు. తాత్కాలిక అధ్యక్షులు నియంతలా వ్యవహరిస్తున్నారని, పూర్తి స్థాయి అధ్యక్షునికి మాత్రమే నివేదికను ఉపసంహరించే అధికారం ఉందని అన్నారు. ఈ కమిటీలోని మొత్తం 31 మంది సభ్యులకుగాను 15 మంది బీజేపీకి చెందిన వారు కాగా, .కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్‌లకు చెందిన ముగ్గురేసి సభ్యులతోపాటు సీపీఐ(ఎం). టీడీపీ, అప్నా దళ్, ఆర్‌ఎల్‌ఎస్‌పీ, ఎస్‌పీ, వైఎస్సార్ కాంగ్రెస్, ఆర్‌జేడీ, ఎన్‌సీపీ, బీజేడీ, ఏఐఏడీఎంకేలకు చెందిన ఒక్కొక్కరు సభ్యులుగా ఉన్నారు.

బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ ఎన్నికల వ్యూహ సమావేశంలో అజిత్ దోవల్!

ఆందోళన వ్యక్తం చేసిన సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొన్నట్టు వస్తున్న వార్తలపై సీపీఐ(ఎం)ఆందోళన వ్యక్తం చేసింది. ' ఈ వార్త నిజమైనది అయితే ఇది తీవ్రమైన నిబంధనల ఉల్లంఘన, దుష్ప్రవర్తన' అని సీపీఐ(ఎం) ఒక ప్రకటనలో తెలిపింది. 'ప్రభుత్వ కీలక శాఖ ఎన్‌సీఏకు చెందిన సీనియర్ అధికారి బీజేపీ ఎన్నికల వ్యూహ సమావేశాల్లో ఎలా పాల్గొంటారు' అని ప్రశ్నించింది. ఈ వివాదంపై కేంద్ర హోం మంత్రి వివరణ ఇవ్వాలని కోరింది. త్వరలో జరిగే త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాల గురించి చర్చించేందుకు ఇటీవల కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాసంలో బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అజిత్ దోవల్ పాల్గొన్నారని మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ విషయంపై ముఖ్య ఎన్నికల కమిషనర్ ఎకె జోటికి సీపీఐ(ఎం) త్రిపుర రాష్ట్ర కార్యదర్శి బిజన్ థార్ లేఖ కూడా రాశారు.

పెట్టుబడుల ఉపసంహరణతో దుష్పరిణామాలు

- మోడీని హెచ్చరించిన సీపీఐ నేత డి రాజా

న్యూఢిల్లీ : ఎయిరిండియాలో పెట్టుబడుల ఉపసంహరణ వల్ల దీర్ఘకాలంలో దుష్పరి ణామాలను ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరిస్తూ ఈ ప్రతిపాదనలపై చర్చ జరపాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి సీపీఐ నేత డి.రాజా మంగళవారం లేఖ రాశారు. వేగవంతమైన ఆర్థిక విధానాల వల్ల దేశం ప్రతికూల ఫలితాలు ఎదుర్కొంటున్నదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. గంభీరమైన ఆర్థిక విధానాలు, ఇతర దురదృష్టకరమైన ఆలోచనల దుష్పరిణామాలను ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. ఎయిరిండియాలో పెట్టుబడుల ఉప సంహరణ ప్రతిపాదనపై పూర్తిగా చర్చించడమే కాకుండా, ప్రజల అభిప్రాయాన్ని కూడా తెలుసుకోవాలని అని రాజా తన లేఖలో పేర్కొన్నారు.

రాజ్యాధికారమే ధ్యేయంగా ముందుకెళ్తాం



మాట్లాడుతున్న సూర్య ప్రకాష్

25న హైదరాబాద్‌లో 'బీఎల్‌ఎఫ్' ఆవిర్భావ సభ

- హాజరుకానున్న సీతారాం ఏచూరి, ప్రకాష్ అంబేద్కర్, గౌస్, గద్దర్
- విలేకరుల సమావేశంలో సూర్య ప్రకాష్

నవతెలంగాణ- ఖమ్మం/విలేకరులు

రాయితీలు కాదు.. రాజ్యాధికారమే ధ్యేయంగా బీఎల్ఎఫ్‌తో ముందుకు పోతామని నల్లా సూర్యప్రకాష్ అన్నారు. మంగళవారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో, కొత్తగూడెం, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, కరీంనగర్ జిల్లాల్లో విలేకరుల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఫ్రంట్ ఆవిర్భావ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఖమ్మం, కొత్తగూడెంలో సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా 28పార్టీలతో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్)ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. జనాభా 50శాతం ఉన్న మహిళలకు కేసీఆర్ మంత్రివర్గంలో చోటులేకుండా పోయిందన్నారు. సమస్యలపై పోరాడుతున్న కమ్యూనిస్టులను అణచివేస్తురని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 40వేల ఓట్లు ఉన్న వెలమ సామాజికవర్గానికి సీఎం, నాలుగు మంత్రి పదవులా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనే సాగుతోందని విమర్శించారు. కాంగ్రెస్‌వి సైతం అన్ని బూటకపు వాగ్దానాలే అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేక విలవిల్లాడుతున్నారన్నారు. 24గంటల విద్యుత్ ప్రజలపై అధిక భారం వేసేందుకే అన్నారు. విద్య, వైద్యం అంతా వ్యాపారమయమే అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకప్పుడు విలువలతో కూడిన రాజకీయాలకు పేరున్న ఖమ్మం జిల్లాలోనూ కలుషితమయ్యాయని అన్నారు. ఈ వ్యవస్థను రూపుమాపేందుకే ఈనెల 25న హైదరాబాద్‌లో 28పార్టీలతో 'బీఎల్ఎఫ్' ఆవిర్భావ సభ జరగనుందని తెలిపారు. దీనికి సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సామాజిక ఉద్యమ జాతీయ నేత, అంబేద్కర్ మనువడు ప్రకాష్ అంబేద్కర్, ఎంసీపీఐ(యూ) జాతీయ కార్యదర్శి ఎండీ.గౌస్, ప్రజాగాయకులు గద్దర్, సామాజిక ఉద్యమ నాయకులు కంచ ఐలయ్య, ఎంబీటీ రాష్ట్ర అధ్యక్షులు మజీదుల్లా ఖాన్ హాజరవుతారని అన్నారు.

మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. మూడో ప్రత్యామ్నాయం కోసమే ప్రజల్లోకి వెళ్తున్నామని అన్నారు. దోపిడీకి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు మాట్లాడుతూ.. బీఎల్ఎఫ్‌తో నూతన అధ్యాయానికి తెరతీశామన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బత్తుల హైమావతి, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

18న లెఫ్ట్‌ఫ్రంట్ జిల్లా సన్నాహక సమావేశం

నిజామాబాద్ నగరంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో బీఎల్ఎఫ్‌పై వామపక్ష పార్టీల నాయకులు సమావేశమయ్యారు. ఈనెల 18న నాందేవాడలో బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్టు ప్రకటించారు.

టీఆర్ఎస్, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీఎల్ఎఫ్

ఆప్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్ రావు

రాష్ట్రంలో టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీకి ప్రత్యామ్నాయంగా బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బిఎల్ఎఫ్) నిలుస్తుందని ఆమాద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిలింభవన్‌లో టీ-మాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'తెలంగాణ సామాజిక న్యాయం- సమగ్రాభివృద్ధి' కోసం లెఫ్ట్‌ఫ్రంట్ ఆవిర్భవించనున్నట్టు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీవర్గాల అభివృద్ధి, రాజకీయ ఎదుగుదలకు ఇది వేదికగా నిలువనుందన్నారు.

ఫ్రంట్ ఆవిర్భావ పోస్టర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో బీఎల్ఎఫ్ (బహుజన లెఫ్ట్ ఫ్రంట్) ఆవిర్భావ సభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.రాములు, నవతెలంగాణ ప్రజాపార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదవ్ మాట్లాడారు. రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎల్ఎఫ్ రాష్ట్రంలో కొత్త చరిత్రను సృష్టించనుందన్నారు. సమావేశంలో సోషల్‌జస్టిస్ ప్రధాన కార్యదర్శి డా॥ రాంనర్సయ్య, ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యులు అశోక్ ఓంకార్, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు సాయిబాబు, బండారు రవికుమార్, భిక్షమయ్య, టీమాస్ ఫోరం జిల్లాల కన్వీనర్లు బండి దత్తాత్రి, కిషన్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామ విత్తనోత్పత్తి పథకంపై ప్రభుత్వ సంస్కరణలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామ విత్తనోత్పత్తి పథకాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయనున్నది. నాణ్యమైన విత్తనాలను రైతు స్థాయిలోనే ఉత్పత్తి చేయాలని ఉద్దేశంతో కేంద్రం ఐదేండ్ల క్రితం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. పథకాన్ని రాష్ట్రాల వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడంలేదు. ఎంత మొత్తంలో..ఎన్ని ఎకరాల్లో విత్తనోత్పత్తి జరుగుతున్నదో నేటికీ సరైన గణాంకాలు లేవు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకంపై ప్రత్యేక దృష్టిసారించింది. ఇందులో భాగంగా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సంబంధిత అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. పార్థసారథి మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఈ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ముఖ్యంగా గ్రామస్థాయిలో ఎక్కువగా డిమాండ్ ఉన్నందున పంట రకాల ఫౌండేషన్ సీడ్‌ను రైతులకు సరఫరా చేయాలని అన్నారు. అంతేకాకుండా మూలవిత్తనం సరఫరా కూడా నోడల్ ఏజన్సీల ద్వారానే సరఫరా చేయాలని, ఈ విధంగా విత్తనం రైతులకు సరఫరా అయిన తరువాత విత్తనోత్పత్తి పథకం కింద రైతు ఉత్పత్తి చేసిన విత్తనాన్ని నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆ విత్తనాలను తిరిగి పంటకాలంలో వ్యవసాయశాఖ ద్వారా సరఫరా చేసే విధంగా పటిష్టమైన విధివిధానాల రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు పరిమితిని పెంచాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కందుల కొనుగోళ్ల పరిమితిని పెంచాలని కోరుతూ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి హరీష్‌రావు కేంద్రాన్ని కోరనున్నారు. ఇందులో భాగంగా విషయాన్ని బుధవారం కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నారని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సీజన్‌లో కందులు లక్షా యాభైవేల మెట్రిక్ టన్నులకుపైగా దిగుబడి రానుందని అంచనా. అయితే, 33 వేల మెట్రిక్ టన్నులు కొనేందుకు మాత్రమే కేంద్రం సుముఖత చూపింది. ఇప్పటి వరకు 26,200 మెట్రిక్ టన్నుల కందులు మార్కెట్‌కు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

విద్యపై సర్కారుకు చిత్తశుద్ధి లేదు

రావుల విమర్శ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వానికి విద్యపై చిత్తశుద్ధి లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. కేజీ టూ పీజీ ఉచిత విద్యను అందిస్తామన్న ప్రభుత్వం, విద్యార్థుల్లేరంటూ ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తున్నదని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. దేశంలో అమలవుతున్న విద్యావిధానంలో ఉన్న లోపాలు, సౌకర్యాలు, అసౌకర్యాలపై 65వ జాతీయ సదస్సు జరుగుతున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కొన్ని సలహాలు, సూచనలతో వెళ్లడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జీవో 99లో ఆటో ఛార్జీలు ఇస్తామని ప్రకటించిందని, అది అమలుకావడం లేదన్నారు. ఉన్న స్కూళ్లను మూసివేసి పక్క గ్రామానికి వెళ్లి చదువుకోమనడం దారుణమని వ్యాఖ్యానించారు. విద్యను నిర్లక్ష్యంచేయంతోపాటు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. ప్రాథమిక విద్యను నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ సర్కారు మూడేండ్ల పరిపాలనలో 10 లక్షల మంది పిల్లలు బడిమానేశారని తెలిపారు. దీనికి కారణం సర్కారు విద్యావిధానమేనని విమర్శించారు. 4200 పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవన్నారు. జాతీయ సదస్సులో గొప్పలకు పోకుండా వాస్తవాలు చెప్పాలని, ఆ మేరకు దిద్దుబాటుకు వీలు ఉంటుందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రతి కిలోమీటర్‌కు ఒక ప్రాథమిక పాఠశాల, ఐదు కిలోమీటర్లకు ఒక ప్రాథమికోన్నత పాఠశాల, 10 కిలోమీటర్లకు ఒక ఉన్నత పాఠశాల, మండలానికో జూనియర్ కాలేజీ, డివిజన్‌కో ఇంజినీరింగ్ కాలేజీ, జిల్లాకో మెడికల్ కాలేజీ కట్టించారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రయివేటు కాలేజీలను ప్రోత్సహిస్తున్నదన్నారు.

గూడెం ఎత్తిపోతల మరమ్మతుల్లో యువకుడి మృతి

- ప్రొక్లెయిన్ తాకి తీవ్ర గాయం..
- రహదారిపై బంధువుల రాస్తారోకో



నవతెలంగాణ-దండేపల్లి

పండుగ సెలవులకు ఇంటికొచ్చిన యువకుడు కూలీపనికెళ్లి ప్రాణం కోల్పోయాడు. గూడెం ఎత్తిపోతల పథకం పైపులైను మరమ్మతు పనులు నిర్వహిస్తుండగా ప్రొక్లెయిన్ తగిలి మృతిచెందాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. గూడెం గ్రామానికి చెందిన అంకతి సాయికుమార్(18) ఇటీవల డిప్లొమా పూర్తి చేశాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చాడు. ఎత్తిపోతల పథకం పైపు లైన్ లీకేజీ కావడంతో అక్కడ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. సాయికుమార్ మరికొందరితో కలిసి కూలీపనికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రొక్లెయిన్ మట్టి తీస్తుండగా దాని బకెట్ సాయికుమార్‌కు తగిలింది. అతడి ఛాతికి తీవ్ర గాయం కావడంతో తోటి కూలీలు వెంటనే లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసత్రికి తరలించారు. అయితే, అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దాంతో సాయికుమార్ బంధువులు మతదేహంతో లక్షెట్టిపేటలో ఆందోళన చేశారు. మంచిర్యాల ఏసీపీ గౌస్‌బాబా బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీనివ్వడంతో ఆందోళన విరమించారు. సాయికుమార్ తండ్రి అంకతి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'మిషన్' పనులకు టార్గెట్

ఫిబ్రవరి 3 లోగా పనులను ప్రారంభించాలి: నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశం

- సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్


మాట్లాడుతున్న హరీశ్‌రావు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

మిషన్ కాకతీయ నాలుగవ దశ పనులకు ఫిబ్రవరి 3 లోగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించాలని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. ఈ దశ పనుల్లో ఫీడర్ చానల్స్ నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన ఆదేశించారు. మిషన్ కాకతీయ 4 వ దశ పై మంగళవారం సచివాలయం నుంచి ఆయన వీడియో కానారేన్స్ నిర్వహించారు.ఏ రోజుకారోజు విధిగా వాట్సప్ లో పనుల ఫొటోలు పెట్టాలని కోరారు. ఫిబ్రవరి 3 వ తేదీన మళ్లీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని మంత్రి ప్రకటించారు. ఎట్టి పరిస్థితులలోనూ నిర్ణీత గడువులోగా పనులను ప్రారంభించాలన్నారు. మిషన్ నాలుగో దశ చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆయన ఆదేశించారు.మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను, వ్యవసాయ అధికారులను భాగస్వాములు చేయాలని ఆయన సూచించారు. నాలుగవ దశలో 5703 చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని 4 వ చేపడుతున్నట్టు చెప్పారు.

మిషన్ కాకతీయ కింద చేపట్టనున్న పనులలో సాగునీటి వనరుల ఆయకట్టును స్థిరీకరణకు, అదనపు ఆయకట్టుకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ఎస్ఈ, ఈఈలు క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యటించాలని ఆదేశించారు.4 వ దశ లో చేపట్టనున్న చెరువుల జాబితాను ముందుగానే వ్యవసాయ అధికారులకు అందిస్తున్నందున పూడిక మట్టిని రైతులు వాడుకునే ముందు తప్పనిసరిగా పరీక్షించాలని ఆదేశించారు. గతంలో తెలంగాణలో కేవలం భూసార పరీక్ష కేంద్రాలు 9 మాత్రమే ఉండేవని ఇరిగేషన్ మంత్రి చెప్పారు. ఇప్పుడు ప్రతి మూడు గ్రామ పంచాయతీ లకు కలిపి ఒక సాయిల్ టెస్ట్ ల్యాబ్ ఉందన్నారు. మొత్తం 2,500 సాయిల్ టెస్ట్ ల్యాబ్‌లున్నట్టు తెలిపారు. పూడికతీత మట్టిలో ఉండే పోషకాలపై ప్రజలు,రైతుల్లో చైతన్యం, అవగాహన తీసుకు రావాలనికోరారు. విలేకరుల సమావేశాలు జరిపి ప్రచారం చేయాలనికోరారు. వ్యవసాయ, ఇరిగేషన్ శాఖలఅధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రతిష్టాత్మక మిషన్ కాకతీయలో ఇంకా సమర్థంగా పని చేయాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. పరిపాలనపరంగా ఆమోదించిన పనులకు సాంకేతిక అనుమతులిచ్చి వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. మిషన్ కాకతీయ రెండు, మూడో దశలలో చేపట్టిన పనులు ఇంకా పూర్తి కాకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు పూర్తయిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులలో జాప్యం చేయరాదన్నారు.

పాడి రైతులకు ప్రోత్సాహక బకాయిలు ఇవ్వాలి: తెలంగాణ రైతుసంఘం


నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పాడి రైతులకు నాలుగు రూపాయల ప్రోత్సహక బకాయిలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. విజయడైరీ, నార్ముల్ డైరీ, కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ, ముల్కనూరు మహిళా డైరీలకు ప్రోత్సాహకంగా లీటరుకు నాలుగు రూపాయలు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారనీ, రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్న నమ్మకంతో ఆయా కంపెనీలు రైతులకు ప్రోత్సాహకాలు చెల్లించాయని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి పి జంగారెడ్డి, టి సాగర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికీ నిధులు విడుదల చేయకపోవడంతో కంపెనీలు , రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కంపెనీలు రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీని ఆపి వేశాయన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని వారు హెచ్చరించారు.

కంది రైతులకు డబ్బులు చెల్లించాలి

రాష్ట్రంలో రైతుల నుండి సేకరించిన కందులకు వెంటనే డబ్బులు చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి జంగారెడ్డి, టి సాగర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్, హకాల ఆధ్వర్యంలో వికారాబాద్, తాండూర్, మహబూబ్ నగర్, నారాయణపేట్, దామరగిద్ద, మద్దూర్ ధన్వాడ తదితర కేంద్రాల్లో కందులు సేకరిస్తున్నారని తెలిపారు. సేకరించిన కందులకు డబ్బులు వెంటనే చెల్లించకపోవడం వల్ల రైతులు ప్రయివేట్ వ్యాపారుస్తులకు అమ్ముకుంటు న్నారని చెప్పారు. దీంతో రైతులు క్వింటాలుకు రూ 1500 నుండి రూ 2000 వరకు నష్టపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్ శాఖలు జోక్యం చేసుకొని రైతులకు డబ్బులు ఇప్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా రైతులకు డబ్బులు చెల్లించాలని, కేంద్రం నిధులు విడుదల చేసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జమ చేసుకోవాలని వారు కోరారు.

విద్యాభివృద్ధిపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఉపముఖ్యమంత్రి కడియం విమర్శలు

విద్యాభివృద్ధిపై కేంద్ర సర్కారుకు చిత్తశుద్ధిలేదని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, బాలికల విద్యాభివృద్ధి సబ్‌కమిటీ చైర్మెన్ కడియం శ్రీహరి విమర్శలు చేశారు. ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో రెండు రోజుల పాటు 65వ కేంద్ర విద్యా సలహా సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశాలకు కడియం శ్రీహరి హాజరయ్యారు. కాగా సలహా సంఘం సమావేశాలను తూతూమంత్రంగా నిర్వహించారని కడియం పెదవి విరిచారు. ప్రాథమిక, ఉన్నత విద్యా ప్రమాణాల అభివృద్ధిపై ఉపసంఘాలు ఇచ్చిన ప్రతిపాదనలపై కేంద్రం ఎలాంటి నిర్ణయమూ తీసుకోవడం లేదని విమర్శించారు. విద్యాప్రమాణాలు పెంచేందుకు కేంద్రం ఏర్పాటు చేస్తున్న కేబ్ సమావేశాలు ఉపయోగపడటం లేదని అన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించడం, విద్యాప్రమాణాలు పెంచడంపై కేంద్రం చర్యలు చేపట్టడం లేదని అన్నారు. పైగా బాలికా విద్యాభివృద్ధిపై సబ్‌కమిటీ చైర్మెన్‌గా తాను సమర్పించిన మధ్యంతర నివేదికపై సైతం ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని చెప్పారు. ఫిబ్రవరి చివరినాటికి పూర్తి నివేదికను అందజేస్తామని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన సలహా సంఘం సమావేశాల్లో భారత్‌లో బాలికల విద్యా నిష్పత్తిపై కడియం శ్రీహరి ప్రజంటేషన్ ఇచ్చారు. అయితే విభజన చట్టంలో పొందుపరిచిన గిరిజన యూనివర్సిటీలో ఏర్పాటులో జాప్యం జరుగుతోందని చెప్పారు. పైగా తెలంగాణపై కేంద్రం పక్షపాత ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. గడిచిన మూడున్నరేండ్లలో తెలంగాణకు ఒక్క విద్యాసంస్థనూ కేటాయించలేదని అన్నారు.

జీవితంలో ఏదైనా కోల్పోవడానికి క్షణం పట్టదు. కానీ ఏదైనా సాధించాలంటే దశాబ్దం పట్టవచ్చు. -నెపోలియన్

సంపాదకీయం

'నగదు' హంగామా

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఆర్థిక సహాయం గురించి హంగామా చేస్తున్నది. వ్యవసాయరంగాన్ని సంక్షోభం నుండి కాపాడటమా? లేక ఉపశమన చర్యలా అన్నదే అసలు సమస్య. ఉరితాడు బారిన పడకుండా రైతును కాపాడటమా? లేక జీవగంజి పోయటమా? తేల్చుకోవాల్సిన సమయమిది. కష్టాల్లో ఉన్నవాడికి రూపాయి ఇచ్చినా సంతోషమే! అందువల్ల ఎకరానికి 8వేలు ఉపయోగమే. వేడినీళ్ళకు చన్నీళ్ళలాగా తోడ్పడతాయి. మంచిదే. రుణమాఫీ అన్నా... ఆర్థిక సహాయం అన్నా అంతే. కానీ అవే సమస్యకు పరిష్కారం కాదన్న విషయాన్ని చర్చకు రాకుండా చేయటంలో పాలకులు జయప్రదమవుతున్నారు. ఈ మాత్రపు సహాయాలకు కూడా కౌలు రైతులు నోచుకోలేదు. కాంగ్రెసు, టీడీపీల పాలనలో కౌలురైతులను పొమ్మనకుండా పొగబెట్టారు. టీఆర్ఎస్ పాలనలో బహిరంగంగానే కౌలు రైతుల బాధ్యత తమది కాదని ప్రకటించారు. స్వంత దారులైన పేద, మధ్యతరగతి రైతులకు అందే ప్రయోజనం కూడా పరిమితమే. 14శాతం ఉన్న ధనిక రైతుల చేతుల్లో 68లక్షల ఎకరాల భూమి ఉండగా, 86శాతం రైతుల చేతుల్లో 84లక్షల ఎకరాల భూమి మాత్రమే ఉన్నది. అంటే ఆర్థిక సాయం పేరుతో ప్రభుత్వం ఖర్చు చేసే రూ.7వేల కోట్లలో దాదాపు సగం, కొద్దిమంది ధనికులకే. ఎకరం రైతుకు ఎనిమిది వేలు ఇస్తే, వంద ఎకరాల భూస్వామికి ఎనిమిది లక్షలు దక్కుతాయి.

ఎగవేతదారులైన కార్పొరేట్లను రక్షించేందుకు డిపాజిటర్లను బలిచేసే చట్టం రూపొందిస్తున్నారు. రైతు కష్టాలు మాత్రం ఎవరికీ పట్టలేదు. అయితే... ఈ పార్టీలూ, పాలకులూ ఒక విషయం గుర్తుంచుకోవాలి. అందరినీ, అన్ని సందర్భాలలోనూ మోసం చేయటంలో సఫలం కాలేరు.

బాధిత రైతులను ఆదుకోవటమా? లేక వాడుకోవటమా అన్నదే అసలు సమస్య. నాడు కాంగ్రెసూ, టీడీపీలైనా... నేడు టీఆర్ఎస్ అయినా... చేస్తున్నది వాడుకోవటమే. టీడీపీ పాలనలో రైతుమిత్ర లేదా కాంగ్రెసు పాలనలో ఆదర్శరైతు అన్నా... ఇప్పుడు టీఆర్ఎస్ పాలనలో రైతు సమన్వయ సమితులు అన్నా... అదే జరుగుతున్నది. ఓట్ల వేటకు పూనుకోవటమే! రైతుకు కావల్సింది రుణసదుపాయం, పంటకు గిట్టుబాటుధర, నాణ్యమైన విత్తనాలు, శాస్త్రీయమైన సూచనలు, కరువు, వరదల వంటి ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా ఆదుకోవటం. వీటి గురించి మాట్లాడకుండా... కేవలం రుణమాఫీ లేదా ఆర్థిక సహాయం చుట్టూ తిప్పటమంటేనే, పాలకుల నిజాయితీ నేతి బీరకాయలో నెయ్యి వంటిదేనని స్పష్టమవుతున్నది. రూ.11 లక్షల కోట్లు ఎగవేసిన బడా కార్పొరేట్ సంస్థలకే మళ్ళీ మళ్ళీ మాఫీలూ... మరిన్ని రుణాలు అందజేస్తున్న పాలకులు, రైతులకు మాత్రం సాధ్యం కాదంటున్నారు. ప్రయివేటు వడ్డీ వ్యాపారులకు బలిపెడుతున్నారు.



ఉత్పత్తిఖర్చుకు 50శాతం అదనంగా కలిపి ధాన్యం ధర నిర్ణయించాలని స్వామినాథన్ కమిషన్ సిఫారుసు చేసింది. ఎన్నికల బహిరంగ సభలలో స్వామినాథన్ జపం చేసిన మోడీ, ఈ మూడున్నర ఏండ్లలో మళ్ళీ ఆ ఊసే ఎత్తలేదు. రాష్ట్రంలో పంటలకు ధర గ్యారంటీ చేయలేని ప్రభుత్వం ఇది. రేపు నిజంగానే సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి కోటి ఎకరాలకు నీళ్ళిస్తే... ఆ పంట ఎవరు కొనుగోలు చేయాలి? ఈ ప్రశ్నకు పాలకుల దగ్గర సూటిగా సమాధానం లేదు. పత్తివేస్తే ధర రాదనీ, పంట మార్చాలనీ రాష్ట్ర పాలకుల సూచనలను నమ్మిన రైతులు పంటలు మార్చారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి పత్తికి మాత్రమే ధర పలికింది. మిర్చి రైతు చేతికి మాత్రం సంకెళ్ళు పడ్డాయి. ఈ సీజన్‌లో పత్తి రైతుకు దిక్కులేదు. వ్యాపారులు, సీసీఐ అధికారులు చేతులు కలిపారు. పత్తిరైతు వెన్ను విరిచారు. పాలకులు తమాషా చూస్తున్నారు. మార్కెట్ శక్తుల చేతుల్లో రైతు విలవిల్లాడుతున్నాడు.

వరి వద్దనీ, వాణిజ్యపంటలే ముద్దు అనీ... రైతును ఆ వైపు నెట్టింది పాలకులే. పెరిగిన పెట్టుబడి ఖర్చులకు బాధ్యత పాలకులదే. ఇప్పుడు ఎకరానికి నలభైవేలు పెట్టుబడి ఖర్చుకు, నాలుగువేల సహాయంతో సంబురపడాలంటున్నారు. అప్పు సౌకర్యానికీ, గిట్టుబాటు ధరకూ తమకు సంబంధం లేదంటున్నారు.

కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కారూ, రాష్ట్రంలో టీఆర్ఎస్ పాలకులదీ ఒకే దారి. గతంలో కాంగ్రెసు, టీడీపీ పాలకులు చేసిందే ఇప్పుడు తెలంగాణ పాలకులూ చేస్తున్నారు. మోసపోతున్నది మాత్రం రైతులే. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ బ్యాంకుల ద్వారా సాధారణ రైతులకు అందే పరిమిత రుణ సదుపాయానికి కూడా మరిన్ని ఆంక్షలు విధించారు. విత్తనచట్టం చేయవల్సిన రాష్ట్ర ప్రభుత్వం చేయదు. తామే చేస్తామని చెప్పిన కేంద్రం ఇప్పుడా ఊసే ఎత్తదు. రైతులు మాత్రం ప్రయివేటు సంస్థల నకిలీ విత్తనాలతో నిలువునా దగా పడుతున్నారు. ఈ పాలకులు మాటల్లో ఏమి చెప్పినా... ఆచరణలో పేద, మధ్య తరగతి రైతులను వ్యవసాయరంగం నుండి బయటకు తోసి, కార్పొరేట్ శక్తులను ప్రోత్సహించటమే లక్ష్యంగా పెట్టుకున్నారు. టీడీపీ పాలనలో ఇజ్రాయిల్ జపం చేస్తూ కుప్పం తరహా వ్యవసాయం అన్నారు. కాంగ్రెసు పాలనలో కంపెనీ వ్యవసాయానికి ప్రయత్నించారు. ఇప్పుడు తెలంగాణ పాలకులు మరోసారి ఇజ్రాయిల్ పాట పాడుతున్నారు. కేంద్రంలో నాటి కాంగ్రెసు పాలకులు ఉద్దీపన పథకాల పేరుతో బడా కార్పొరేట్లకు లక్షల కోట్లు కట్టబెట్టారు. ఇప్పుడు బీజేపీ పాలకులు రుణాలు మాఫీ చేసారు. ఎగవేతదారులైన కార్పొరేట్లను రక్షించేందుకు డిపాజిటర్లను బలిచేసే చట్టం రూపొందిస్తున్నారు. రైతు కష్టాలు మాత్రం ఎవరికీ పట్టలేదు. అయితే... ఈ పార్టీలూ, పాలకులూ ఒక విషయం గుర్తుంచుకోవాలి. అందరినీ, అన్ని సందర్భాలలోనూ మోసం చేయటంలో సఫలం కాలేరు.

ప్రజావాణి

ఉపాధ్యాయులంటే అంత అలుసా...

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల సెలవు మంజూరు విషయంలో విద్యాశాఖ ఇటీవల తీసుకొచ్చిన కొత్త నిబంధనలు ప్రధానోపాధ్యాయులను కించపరిచే విధంగా ఉంది. ఇప్పటివరకు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు తమ పాఠశాల ఉపాధ్యాయుడికి సెలవు పత్రం అందించి అనుమతి పొందుతున్నారు. కానీ విద్యాశాఖ ఇటీవల జారీ చేసిన నిబంధనల ప్రకారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పాటు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం, మండల విద్యాధికారి వద్ద కూడా టీచర్లు అనుమతి పొందాలి. ఇది చాలా అసమంజస నిర్ణయం. ఈ ప్రక్రియ వలన ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల హక్కులను కాలరాసే విధంగా కొత్త నిబంధన ఉంది. ఇప్పటికే స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షిస్తూ తీవ్ర పనిభారంతో సతమతమవుతున్నారు. దీనికి తోడు ఉపాధ్యాయుల సెలవుపత్రాలను మండల విద్యాధికారులకు అందజేసే బాధ్యతలను అప్పగిస్తే వారు మరింత మానసిక ఒత్తిడికి గురవుతారు. దూర ప్రాంతాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు సెలవు అనుమతి కోసం సెలవు పత్రం యివ్వడానికి స్కూల్ కాంప్లెక్స్‌కు వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడతారు. ఇప్పటికైనా విద్యాశాఖ తీసుకొచ్చిన కొత్త నిబంధనలను రద్దుచేయాలి. జీఓ 70 ప్రకారం ఉపాధ్యాయులకు ఆకస్మిక సెలవు మంజూరు చేసే అధికారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకే కల్పించాలి. పాత నిబంధనలే కొనసాగించాలి.


బి. ప్రేమ్‌లాల్, నిజామాబాద్.

రైతు విలువ పెంచాలి

రైతే ఈ దేశానికి వెన్నెముక. రైతు మన దేశం కోసం రాత్రనకా, పగలనకా కష్టపడి పంట పండిస్తాడు. తన రక్తం చెమటగా చేసి కష్టపడుతున్నాడు. కానీ వాళ్లకు మనం, మన ప్రభుత్వం ఏమిచ్చాయి. మరికొన్ని కష్టాలు తప్ప. పొలాల్లో భవంతులు కట్టడం వల్ల వ్యవసాయ భూములు తగ్గిపోతున్నాయి. మరోపక్క ప్రభుత్వాలు రైతుకు సరైన విత్తనాలు అందించక, పంటకు గిట్టుబాటు ధర లేక అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడు. సకాలంలో వానలు కురవక, పొలానికి నీటి సరఫరా లేక పొలాలు ఎండిపోతున్నాయి. కొన్నిసార్లు వర్షాలు విపరీతంగా కురిసి పంటలు నాశనమవుతాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకునే నాథుడే కరువవుతున్నాడు. ఈ పరిస్థితుల్లో రోజురోజుకూ రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. కానీ రైతు ఐదువేళ్లు మట్టిలోకి వెళ్తేనే మన ఐదువేళ్లూ నోట్లోకి వెళ్తాయన్న సంగతిని ఈ ప్రభుత్వాలు ఎప్పుడో మర్చిపోయాయి. అందుకే ఈ కాలం యువతీ యువకులంతా నేను ఇంజనీర్ అవుతా, డాక్టర్ అవుతానంటున్నారే.. కానీ, నేను రైతు అవుతానని అనడం లేదు. రైతు విలువ పెంచే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. వారి శ్రమను గుర్తించాలి.

- సారిక, హైదరాబాద్.

ఎలెక్టోరల్ బాండ్స్ నిజస్వరూపం



ప్రభాత్ పట్నాయక్

గతేడాది ఫిబ్రవరి2వ తేదీనాడు ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్ గురించి తన బడ్జెట్ ఉపన్యాసంలో అరుణ్ జైట్లీ ప్రస్తావించారు. 11నెలల తరువాత ఇప్పుడు జనవరి2న ఆ స్కీమ్‌కు సంబంధించిన వివరాలను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ద్వారా వెల్లడించారు. ఈ విడుదలతోపాటు స్కీమ్‌కు అనుకూలంగా జైట్లీ రాసిన వివరణలు కూడా ఉన్నాయి. వీటితో స్పష్టమైన విషయం ఏమంటే ఎన్నికల్లో ఖర్చు చేయటానికి పెద్ద ఎత్తున చేస్తున్న కార్పొరేట్ విరాళాల కారణంగా ప్రజాస్వామ్యానికి కలిగే చేటును నిలువరించే మాట అటుంచి కనీసం ఆ ప్రస్తావన కూడా లేదు. పైగా ఈ స్కీమ్ అమలుచేయటం జరిగితే అది ప్రజాస్వామ్యానికి ఏర్పడిన ప్రమాదాన్ని మరింతగా పెంచుతుంది.

అంతేకాకుండా జైట్లీ తనకు తానుగా ప్రతిపాదించిన ఎన్నికల ప్రచారానికి నిధులను సమకూర్చటానికి సంబంధించిన సమాచారం విషయంలో 'పారదర్శకత' ఉండాలనే లక్ష్యాన్ని కూడా ఈ పథకం చేరలేదు. అందుకు

> **చెక్కులు, ఆన్‌లైన్ చెల్లింపులు లేక ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలు తీసుకోవటంతో ఈ గోప్యత పోయి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలకు విరాళాలు అందకుండా చేస్తుంది. వేరే మాటల్లో చెప్పాలంటే ఈ ప్రతిపాదిత చర్యవల్ల రాజకీయ వ్యవస్థ ఆరోగ్యం మెరుగవటం అటుంచి అది బీజేపీ ప్రభుత్వ నియంతృత్వం బలోపేతం కావటానికి సాధనంగా ఉపయోగపడుతుంది.**

బదులుగా ఈ పథకంతో కేంద్రప్రభుత్వ అధికారాలు అపరిమితంగా పెరుగుతాయి. దానితో భారతదేశంలో ప్రజాస్వామ్యం మరింతగా నియంతృత్వ ప్రమాదంలో పడుతుంది.

ఎన్నికల వ్యయానికి నిధులను సమకూర్చటం అనే సమస్యను ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్నారు. రాజకీయ పార్టీలు కార్పొరేట్ కంపెనీలు సమకూర్చే నిధులపై ఆధారపడుతుండటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకారిగా మారింది. ప్రజామోదం కోసం రాజకీయ పార్టీల మధ్య ఏర్పడిన పోటీ తీవ్రం కావటంతో ఎన్నికల వ్యయం బాగా పెరిగింది. ఈ వ్యయాన్ని తట్టుకోవటానికి రాజకీయ పార్టీలు కార్పొరేట్ కంపెనీలు ఇచ్చే నిధుల కోసం వెంపర్లాడుతున్నాయి. ఉదాహరణకు అమెరికాలో కార్పొరేట్ కంపెనీల కేంద్ర స్థానం వాల్‌స్ట్రీట్ రాజకీయ పార్టీల నిధులకు ప్రధాన వనరుగా మారింది. చిన్నచిన్న మొత్తాలను అనేక వేలమంది నుంచి సమీకరించానని చెప్పుకున్న ఒబామా కూడా తన ఎన్నికల ప్రచారానికి వాల్‌స్ట్రీట్‌పై ఆధారపడ్డాడనే అనుమానాలున్నాయి.

కార్పొరేట్ కంపెనీలు ఎన్నికలకు నిధులను సమకూర్చటం వాటి దానశీలత తెలియజేయదు. అవి అందుకు బదులుగా తమ ప్రయోజనాలను నెరవేర్చాలని కోరతాయి. రాజకీయ పార్టీలకు నిధులను సమకూర్చటమంటే కార్పొరేట్ కంపెనీలు వాటిలో పెట్టుబడి పెట్టటంగా ఉంటుంది. అంటే ఎన్నికల్లో గెలిచిన పార్టీ ఏదో ఒక రూపంలో కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలను నెరవేర్చాల్సి ఉంటుంది.

అనంతంగా పెరిగిన ఎన్నికల వ్యయాన్ని కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా లేని రాజకీయ పార్టీలు భరించలేవు. దానితో అవి పోటీలో నిలువలేవు. మరోవైపు కార్పొరేట్ అనుకూల పార్టీలు విజేతలుగా ఆవిర్భవిస్తాయి. కాబట్టి ఎన్నికల వ్యయాన్ని కార్పొరేట్ కంపెనీలు భరించటంతో రాజకీయాలు కార్పొరేట్ కంపెనీల ఆధీనమవుతాయి. ఇటువంటి పర్యవసానం ప్రజాస్వామ్యానికి ప్రతికూలంగా మారుతుంది. ఈ ధోరణిని ఎదుర్కోవటానికి అనేక మార్గాలున్నాయి. ఎన్నికల వ్యయాన్ని చట్టపరంగా నియంత్రించటం, ప్రభుత్వమే ఎన్నికలకు నిధులను అందించటం, రాజకీయ పార్టీలకు అందే కార్పొరేట్ నిధులపై పరిమితి విధించటం వంటి మార్గాలు ఈ ధోరణిని ఎదుర్కోవటానికి అందుబాటులో ఉన్నాయి. అయితే ప్రజాస్వామ్యానికి దాపురించిన ఈ ప్రమాదాన్ని గురించి జైట్లీ పట్టించుకోవటం లేదు. ఎన్నికల నిధులను నగదు రూపంలో తీసుకోకుండా చెక్కులు లేక ఆన్‌లైన్ చెల్లింపులు లేక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన కొన్ని బ్రాంచీలు జారీ చేసే ఎలక్టోరల్ బాండ్ల రూపంలో తీసుకోవాలనే దానిపైనే ఆయన తన దృష్టి కేంద్రీకరిస్తున్నాడు. ఇలా జారీచేసిన బాండ్లను 15రోజుల్లో నగదుగా మార్చుకోవాల్సి ఉంటుంది. వేరే మాటల్లో చెప్పాలంటే ఆయన ఆందోళనంతా కార్పొరేట్ కంపెనీల విరాళాల(మరే ఇతర విరాళాల) పరిమాణం మీద కాకుండా అవి నగదుగా మారే ప్రక్రియ మీదే ఉన్నది. అంటే ఈ రకమైన విరాళం ఒక చిన్న పరిమాణం తరువాత నగదు రూపంలో ఉండకూడదు.

రాజకీయ పార్టీలకు కార్పొరేట్ కంపెనీలు ఇచ్చే విరాళాల పరిమాణాన్ని పట్టించుకొనకపోవటమే కాకుండా అటువంటి విరాళాల పరిమాణం మీద పరిమితులు ఉండనక్కరలేదని ఆయన ప్రతిపాదిస్తున్నారు. ఆయన ఎలెక్టోరల్ బాండ్ల స్కీమ్ తర్కం అంతకుముందు చేసిన నోట్లరద్దు పర్యవసానంగా వచ్చిన 'నగదు రహిత' భావనను పోలివున్నది.
అయితే ప్రస్తుత పద్ధతికంటే నగదురహిత విరాళాలు ఏవిధంగా అభిలషణీయమైనవి? అనే ప్రశ్నకు సమాధానంగా అవి 'పారదర్శకం'గా ఉంటాయని ఆయన అంటారు. ఇప్పటివలే 'గుర్తింపులేని వనరుల నుంచి వచ్చే మురికి నగదు'కు బదులుగా మనకు 'శుభ్రమైన నగదు' అందుతుంది. అంటే బహుశా 'నల్ల డబ్బు' కాని నగదు బ్యాంకుల ద్వారా విరాళాలుగా వస్తుందని ఆయన ఉద్దేశం కావచ్చు. రాజకీయాలపై కార్పొరేట్ నియంత్రణతో దీనికి ఏమాత్రం సంబంధం లేదని మరోసారి నేను చెప్పదలిచాను. అయినప్పటికీ దీనితో వాస్తవంలో 'పారదర్శకత' వస్తుందా? అనే ప్రశ్న ఉదయిస్తుంది.

రాజకీయ పార్టీలకు ఇచ్చే కార్పొరేట్ విరాళాలకు సంబంధించినంత వరకూ ప్రతిపాదిత స్కీమ్‌తో ఏమాత్రం 'పారదర్శకత' వచ్చే ప్రశ్నే లేదు. ప్రపంచంలో ఎక్కడైతే కార్పొరేట్ విరాళాలు ఉన్నాయో అక్కడ ప్రజాస్వామ్య పరిరక్షణకు చేయాల్సిన కనీస డిమాండ్ ఏమంటే సదరు విరాళాల గురించి ప్రజలకు తెలియాలి. అప్పుడే వాటిని నియంత్రించటం కుదురుతుంది. ఇక్కడ స్పష్టమయ్యేదేమంటే జైట్లీ చెబుతున్న పారదర్శకతకు ప్రజాస్వామ్య పరిరక్షణతో ఎటువంటి సంబంధం లేదు. ఉదాహరణకు రాజకీయ విరాళాలను ఇచ్చింది ఎవరైనా ఒక పరిధి దాటిన తరువాత సమాచార హక్కు కింద వాటిని పరిశీలించవచ్చు. అప్పుడే పారదర్శకత ఉంటుందనటంలో ఎంతోకొంత అర్థం ఉంటుంది. అయితే జైట్లీ మాట్లాడుతున్నది దాని గురించి కాదు. కార్పొరేట్ కంపెనీలు తమకు టాక్స్ రిబేట్ రావటం కోసం తమ విరాళాలను అకౌంట్లలో వ్యయంగా చూపవలసి ఉంటుంది కాబట్టి వాటి సమాచారం ప్రజలకు తెలుస్తుందని ఎవరైనా అనుకోవచ్చు. అయితే ఇక్కడ కూడా విరాళం ఎంత ఇచ్చారో తెలుస్తుంది కానీ ఎవరికి ఎంత ఇచ్చిందీ తెలియదు. దీనివల్ల యేయే కంపెనీలు యేయే పార్టీలకు ఎంత విరాళాలు ఇచ్చాయో, అధికారంలోకి వచ్చాక ఎవరి ప్రయోజనాలకు అనుగుణంగా ఎటువంటి నిర్ణయాలు తీసుకోవటం జరిగిందో స్పష్టం కాదు గనుక వాటిపై ప్రజల నియంత్రణ పోతుంది.

అయితే తమకు నిధులను సమకూర్చినవారికి అనుకూలంగా వ్యవహరించేందుకు బీజేపీ ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడదనుకోండి. ఈ విషయం అమిత్ షా కొడుకు అక్రమ సంపాదనను అనేకమంది కేంద్ర మంత్రులు సమర్థించటంలో కనపడుతుంది. అయితే ఇక్కడ విషయం ఏమంటే జైట్లీ 'పారదర్శకత'కు అర్థం ప్రజల ముందు పారదర్శకంగా ఉండాలని కాదు. అయినప్పటికీ జైట్లీ స్కీమ్‌కి రెండు అంశాలు అనుకూలంగా ఉంటాయి. మొదటిది, ఒకవేళ నగదు రూపంలో లేని విరాళాలకు సంబంధించిన



సమాచారం నిర్దిష్టంగా అందుబాటులోకి వస్తే ఎన్నికల సంఘం ఎన్నికల వ్యయ పరిమితిని మరింతగా అమలు చేయగలదు. కానీ వ్యయ పరిమితికి సంబంధించిన వ్యయాలనన్నింటినీ ఎన్నికల సంఘానికి తెలియజేయరనేది అందరికీ తెలిసిందే. పరిమితికి మించి ఎన్నికల వ్యయం ఉండేదానికి చాలా అవకాశం ఉంటుంది. కాబట్టి ఎన్నికల ప్రచారానికి సంబంధించి మరింత నిర్దిష్ట సమాచారం అందుబాటులోకి వచ్చినప్పటికీ ప్రయోజనం ఏమీ ఉండదు.

రెండవది, ఎలెక్టోరల్ బాండ్లు ఎన్నికల ప్రచారంలో కనీసం 'నల్ల ధనం' ఉపయోగాన్ని తగ్గిస్తాయని వాదించవచ్చు. వేరే మాటల్లో చెప్పాలంటే రాజకీయాలపై కార్పొరేట్ల నియంత్రణను నివారించటంలో జైట్లీ పథకం ఏమాత్రం ఉపయోగపడదు. దానికి 'నల్ల ధనం' అయినా 'తెల్ల ధనం' అయినా తేడా ఏమీ ఉండదు. ఈ వాదనను అనుసరించి ఎన్నికల్లో 'నల్ల' ధనాన్ని ఉపయోగించే విస్తృతి తగ్గుతుంది. కాబట్టి దానితో పాటుగా 'నల్ల ఆర్థిక వ్యవస్థ' పరిమాణం తగ్గుతుంది. అయితే ఈ వాదన కూడా నిజం కాదు. 2016 నవంబరులో ఇటువంటి తప్పుడు అవగాహనతోనే దేశంలో చలామణీలోవున్న 86శాతం నగదు రద్దు చేశారు. ఆ అవగాహన ప్రకారం నోట్లను రద్దు చేస్తే 'నల్ల ఆర్థిక వ్యవస్థ' పరిమాణం తగ్గుతుంది. ఇదే అవగాహనను ఈ విషయంలో కూడా పునఃచ్చరణ చేస్తున్నారు.

ఏ పెట్టుబడిదారులైతే 'తెల్ల కార్యకలాపాల'లో నిమగ్నమౌతారో అదే పెట్టుబడిదారులు అప్రకటితంగా చేసే కార్యకలాపాల సమాహారమే 'నల్ల ఆర్థిక వ్యవస్థ'. ఎన్నికల ప్రచారానికి విరాళం ఇవ్వకముందు ఒక కార్పొరేట్ సామ్రాజ్యంలో 'తెల్ల', 'నల్ల' విభాగాలకు చెందిన మొత్తం నగదు 200రూపాయలు ఉందని అనుకుందాం. దానిలో వంద నగదు, 100 రూపాయలు బ్యాంకు డిపాజిట్ రూపంలో ఉందనుకుందాం. సదరు కార్పొరేట్ కంపెనీ ఎన్నికల ప్రచారానికి 50రూపాయలు విరాళంగా ఇస్తున్నది అనుకుందాం. ఈ విరాళం గతంలో నగదు రూపంలోను, ప్రస్తుతం చెక్ రూపంలోను ఉన్నప్పుడు సదరు కంపెనీ డిపాజిట్‌లో 50రూపాయలు తగ్గుతుంది. అంటే ఆ కంపెనీకున్న బ్యాంకు డిపాజిట్ కంటే 50రూపాయల నగదు అధికంగా ఉంటుంది.


నోట్ల రద్దు జరిగినప్పుడు కూడా వ్యక్తపరచిన బీజేపీ ప్రభుత్వ ఊహను అనుసరించి 'నల్ల'లావాదేవీలు నగదుతో జరుగుతాయి. అంటే ఎన్నికల విరాళాలకు సంబంధించిన నియమాలు మారకుండా ఉన్నట్టయితే అటువంటి లావాదేవీలు విస్తృతమయ్యేవే. ఈ విషయంలో నిజానికి 'నల్ల'లావాదేవీలకు ఉపయోగించదలచిన నగదును పరిమాణం తగ్గిన బ్యాంకు డిపాజిట్‌తో చేయదలచిన 'తెల్ల'లావాదేవీలకు ఉపయోగించటం జరుగుతుంది. ఇక్కడ చెప్పదలచిందేమంటే ఎన్నికల విరాళాల రూపాన్ని మార్చినంత మాత్రాన నల్ల ఆర్థిక వ్యవస్థను నియంత్రించగలమనే ఆలోచన పరీక్షకు నిలబడదు.

అయితే ఈ ప్రతిపాదనకు మరో పార్శ్వం ఉన్నది. దీనిని తెలియజేయాల్సిన అవసరం ఉన్నది. ఎన్నికల ప్రచారానికి విరాళంగా ఎవరు ఏ పార్టీకి ఎంత ఇచ్చారనే విషయాన్ని తెలుసుకునే అవకాశం ప్రజలకు ఉండదు. కానీ ప్రభుత్వ యాజమాన్యంలోని బ్యాంకుల ద్వారా ఆ విషయం ప్రభుత్వానికి తెలుస్తుంది. ప్రతిపక్ష పార్టీలకు విరాళాలు ఇస్తున్న వారిని బెదిరించటానికి ప్రభుత్వం ఈ సమాచారాన్ని ఉపయోగిస్తుంది. జైట్లీ అభ్యంతరపెడుతున్న నగదు విరాళాల గోప్యతతో కనీసం ప్రతిపక్ష పార్టీలకు విరాళాలు ఇచ్చేవారికి ప్రభుత్వం నుంచి ఇబ్బందులు ఎదురవకుండా ఉంటాయి. చెక్కులు, ఆన్‌లైన్ చెల్లింపులు లేక ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలు తీసుకోవటంతో ఈ గోప్యత పోయి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలకు విరాళాలు అందకుండా చేస్తుంది. వేరే మాటల్లో చెప్పాలంటే ఈ ప్రతిపాదిత చర్యవల్ల రాజకీయ వ్యవస్థ ఆరోగ్యం మెరుగవటం అటుంచి అది బీజేపీ ప్రభుత్వ నియంతృత్వం బలోపేతం కావటానికి సాధనంగా ఉపయోగపడుతుంది.

నిజానికి అన్నింటికీ మించి నగదు విరాళాలకు బదులుగా ఎలక్టోరల్ బాండ్లను పెట్టటం వెనుక ఈ కారణమే ఉండవచ్చు. హిందూత్వ ప్రభుత్వం చేతుల్లో అధికారం మరింతగా కేంద్రీకరింపబడటానికి, ప్రతిపక్షాన్ని అణగదొక్కటానికి ఇది బలమైన అదనపు ఆయుధంగా ఉపయోపడుతుంది. అందుకే దీనిని గట్టిగా ప్రతిఘటించాలి.

అనువాదం: నెల్లూరు నరసింహారావు
సెల్ : 8886396999


హిందూ దేవాలయాల కూల్చివేత అర్ధసత్యాలకు సమాధానం



కె.ఎల్. కాంతారావు

ఇటీవల సోషల్‌మీడియాలో ముస్లింలచే అనేక దేవాలయాలు కూల్చివేయబడ్డాయనే విషయం పదే పదే పోస్ట్ చేయబడుతోంది. ఈ విషయం అర్థసత్యం మాత్రమే. మధ్యయుగాలలో రాజకీయ కారణాలతోనూ, దేవాలయాలలో దాచిపెట్టిన సంపదను కొల్లగొట్టడం కోసమో అనేకమంది హిందూ రాజులు సహితం దేవాలయాలను కొల్లగొట్టారు. విగ్రహాలను పెకలించి తీసుకు వెళ్లారు. అది మధ్యయుగాల నాటి ఆటవిక నీతి. ఆ వివరాలు ఇప్పుడు పరిశీలిద్దాం.

* 10వ శతాబ్ది తొలికాలంలో రాష్ట్ర కూటరాజు మూడవ ఇంద్రుడు ప్రతిహార్‌లను ఓడించినప్పుడు, 'కల్ప'లోని ప్రతీహార దేవాలయాన్ని నాశనం చేశాడు. ('భారతదేశ చరిత్ర' రచన: ప్రొ॥ రొమిల్లా థాపర్. 509 పేజీ)
* కాశ్మీర్ చరిత్రకారుడు కల్హాణుడు తన 'రాజ తరంగిణి'లో కాశ్మీర పాలకులు దేవాలయాలను కొల్లగొట్టారనీ, వారిలో ఒకడైన హర్షదేవుడు దేవాలయ విధ్వంసాన్ని పర్యవేక్షించడానికి అధికారులను నియమించాడనీ రాశాడు. (పై పుస్తకం, అదే పేజీ)
* 9వ శతాబ్ది మొదటి భాగంలో పాండ్యరాజు శ్రీమార శ్రీవల్లభుడు శ్రీలంకపై దాడిచేసి మొదటి సేన అనే రాజును ఓడించాడు. బౌద్ధ సన్యాసీ, చరిత్రకారుడూ అయిన ధర్మకొట్టి, ఆ యుద్ధాన్ని గూర్చి ఇలా రాశాడు. "అతడు అనేక విలువైన వస్తువులను తొలగించాడు. ఆభరణాల భవంతిలో ఉన్న బంగారు బుద్ధ విగ్రహాన్ని, బుద్ధమఠాలలో ఉన్న బంగారు విగ్రహాలను తరలించుకు పోయాడు." మొదటి సేనుడి తర్వాత రాజ్యానికి వచ్చిన రెండవ సేనుడు, పాండ్య రాజధానియైన మధురైపై దాడిచేసి, పాండ్యరాజును ఓడించి, బంగారు విగ్రహాన్ని మరల తన దేశానికి తరలించుకు పోయాడు. (7వ తరగతి సోషల్‌స్టడీస్ టెక్స్టుబుక్ నుండి, సంపాదకురాలు ప్రొ॥ఐ.లక్ష్మి. పేజీ 210)
* 11వ శతాబ్ది మొదట్లో చోళరాజు ఒకటవ రాజేంద్రుడు తన రాజధానిలో ఒక శివాలయం కట్టించాడు. దాని పునాదులను, తాను ఓడించిన రాజుల వద్ద నుండి తరలించుకు వచ్చిన దైవ విగ్రహాలతో నింపాడు. వానిలో కొన్ని చాళుక్యుల నుండి తెచ్చిన సూర్యవిగ్రహ పీఠము, గణేశ విగ్రహము, అనేక దుర్గ విగ్రహాలు, తూర్పు చాళుక్యుల నుంచి తెచ్చిన నంది విగ్రహం, ఒరిస్సాలోని కళింగుల నుండి తెచ్చిన భైరవుడు (శివునికి మరోరూపం), భైరవి విగ్రహాలు, బెంగాల్‌లోని పాలరాజుల నుండి తెచ్చిన కాళీ విగ్రహం. (పై పుస్తకం, అదే పేజీ)
* మూడవ మైసూరు యుద్ధం సందర్భంలో 1791లో మహారాష్ట్ర సర్దారు రఘునాథరావు పట్వర్ధన్ మైసూరు రాజ్యభాగమైన షిమోగా మీదికి దండెత్తి, పనిలో పనిగా ఆ సమీపంలో ఉన్న శృంగేరీ మఠంపైనా దాడిచేశాడు. మఠాన్ని కొల్లగొట్టి, పలువురు బ్రాహ్మణులను చంపి, శారదాలయంలో నగా నట్రా దోచుకొని, అమ్మవారి పవిత్రమూర్తిని సైతం పెకలించి, మరాఠా దండు నానా ఆగం చేసింది. వారి పీడకు తాళలేక, జగద్గురువు సచ్చిదానంద భారతి మహాస్వామి, మఠం విడిచిపోయి వేరే ఊళ్ళో తలదాచుకొని,



టిప్పుసుల్తానుకు సందేశం పంపాడు. విషయం తెలిసి టిప్పు చాలా బాధపడ్డాడు. అంతటి పవిత్రస్థలం మీద అలాంటి అకృత్యానికి ఒడిగట్టిన వాళ్ళు పాప ఫలితం అనుభవించి తీరుతారని స్వామి జాబుకు జవాబులో అతడన్నాడు. వెంటనే, మఠానికి కావలసిన డబ్బు ఇచ్చి, పునర్నిర్మాణానికి అవసరపడే వస్తువులు అందించి, ఆలయ పునరుద్ధరణ, సంప్రోక్షణాదులకు సాయపడ వలసిందిగా బేదనూరులోని తన అధికారిని సుల్తాన్ ఆదేశించాడు. విగ్రహ పునఃప్రతిష్ఠ జరిగాక, మఠం వారు కృతజ్ఞతాపూర్వకంగా పంపిన శాలువనూ, ప్రసాదాన్ని అందుకున్నాడు. తిరిగి అమ్మవారికి వస్త్రాలు, కానుకలూ పంపాడు. మైసూరు స్టేట్ ఆర్కియాలజీ డైరక్టరుగా ఉన్న దివాన్ బహదూర్ నరసింహాచారికి 1913లో శృంగేరీ మఠంలో లభ్యమైన చారిత్రాత్మక లేఖల్లో 1791-93 మధ్య సుల్తాన్‌కు, మఠానికీ మధ్య నడిచిన ఉత్తర ప్రత్యుత్తరాలు బయటపడి ఈ సంగతులు లోకానికి వెల్లడయ్యాయి. ("ఇదీ చరిత్ర" నుండి, రచన: ఎమ్.వి.ఆర్.శాస్త్రి, పేజీ 206)
* చోళులు, పాండ్యులు నిరంతరం పరస్పరం కలహించుకోవడం, ఆలయాన్ని కూడా వదలకుండా పట్టణాలను కొల్లగొట్టడం వల్ల, ఈ రాజ్యాలు బలహీనమైనాయి. ('మధ్యయుగాల భారతదేశం' నుండి, రచన: ప్రొ॥ సతీష్‌చంద్ర, పేజీ 27 అండ్ 28)
* ఇబ్రహీం ఆదిల్షా-2 అనే దేవాలయాలను పోషించాడు. పంధాపూర్ విఠోబా దేవాలయానికి జాగీరును మంజూరు చేశాడు. (పై పుస్తకం, పేజీ 245)
* గుంటూరు జిల్లాలో క్రీ.శ. 12, 13 శతాబ్దాల నాటి, తెనాలి కైఫీయతు ననుసరించి, త్రిలోచన పల్లవుడు, తెనాలిలో జైన వసదిని నిర్మూలించి, ఆ ప్రదేశంలో ముక్కంటి రామలింగేశ్వర ఆలయాన్ని నిర్మించాడు. నేటి రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో వర్ధమాన మహావీరుని ప్రతిమ దొరకడం కైఫీయత్‌లోని అంశాన్ని బలపరుస్తున్నది. ("ఆంధ్రదేశంలో జైన, బౌద్ధ మతాలు" గ్రంథం నుండి, రచన ప్రొ॥బి.ఎస్.ఎల్. హనుమంతరావు, పేజీ 145)
* ముస్లింలు కాని స్థానిక పాలకులు కూడా బలవంతంగా సోమనాథ్ ఆలయ సంపదను లాక్కున్నారని స్థానిక శాసనాలు తెలుపుతున్నాయి. ("భారతదేశ చరిత్ర" నుండి, రచన ప్రొ: రొమిల్లాథాపర్, పేజీ 510)

ప్రముఖ చరిత్ర కారులూ, ప్రొఫెసర్లూ దశాబ్దాల తరబడి శ్రమించి, వేలాది పత్రాలను పరిశోధించి ఇలాంటి వాస్తవాలను వెలువరిస్తున్నారు. కాని కొందరు వ్యక్తులు ఏ పరిశోధనా లేకుండా, చారిత్రక విషయాలు అంటూ అసత్యాలను సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఉదాహరణకు సోషల్ మీడియా పోస్టింగులో "28.2.1528 రోజున అక్బరు 35,000 మంది హిందువులను నరికి చంపాడు" అని చెప్పడం జరిగింది. కాని అక్బరు 1556లో అధికారంలోకి వచ్చాడు. అలాంటిది 1528లో ఆయన హిందువులను చంపడం అనే ప్రశ్నరాదు గదా? విచిత్రం ఏమిటంటే అదే పోస్టింగులో "28.2.1528"న ఖిల్జీ చేతిలో శీలం పోగొట్టుకోవడం ఇష్టం లేక రాణీ పద్మిని చితిలో దూకి ఆత్మహత్య చేసుకున్న రోజు" అని రాశారు. కాని అల్లాఉద్దీన్ ఛిత్తోడ్‌ను ఆక్రమించింది 1303లో. ఇలా చరిత్రను తమకిష్టమొచ్చిన రీతిలో వక్రీకరిస్తూ, మత సామరస్యాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిని దేశభక్తులందరూ గమనించి మత సామరస్యాన్ని, దేశ సమైక్యతనూ విచ్ఛిన్నం చేసే శక్తుల పట్ల జాగరూకులై ఉండాలి. మధ్యయుగాల ఆటవిక నీతి, రీతి నేటి ప్రజాస్వామ్య యుగంలో చెల్లదని ఎలుగెత్తి చాటడమే దేశభక్తుల నేటి కర్తవ్యం. ■



వాస్తవిక సంఘటనలకు కొంత కల్పన జతచేసి ఆకట్టుకునేలా సంభాషణలను రచించే నేర్పు మణి వడ్లమాని సొంతం. 'జీవితం ప్రవాహం', 'కాశీపట్నం చూడరా బాబు' నవలలో ఆమె ఎంచుకున్న శైలి, శిల్పం పాఠకులను ఆసాంతం అక్షరాల వెంట పరుగులు పెట్టిస్తాయి. పౌరాణిక పాత్రలను తీసుకుని కొంత ఫిక్షన్ జతచేసి ఆమె రాసిన మొదటి కథ 'కృష్ణం వందే జగద్గురుం' ఆమెలోని రచనాతృష్ణకు, సృజనాత్మక శైలికి నిదర్శనం. శరీరం పెరగడానికి ఆహారం ఎంత అవసరమో.. మనసు ఎదగడానికి పుస్తకపఠనం అంతే అవసరం అని భావించే ఆమె చిన్నతనంలోనే పుస్తక పఠనం ఆరంభించి ఆలస్యంగా రచయితగా మారారు. వైవిధ్యభరితమైన ఇతివృత్తాలతో, ఆకట్టుకునే పదాల అల్లికతో కథలు, నవలలు రాస్తూ పాఠకులను అలరిస్తున్న ఆమె మానవితో పంచుకున్న సాహితీప్రయాణ విశేషాలు..



సంస్కారానికి సాహిత్యమే సోపానం

నేను మద్రాసులో పుట్టాను. అమ్మ ప్రభావతి. నాన్న ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాలో రాజమండ్రిలో పనిచేసేవారు. డిగ్రీవరకు అక్కడే చదువుకున్నాను. నాన్న సాహిత్య ప్రియులు. పాలగుమ్మి పద్మరాజు గారి శిష్యులు. దేవులపల్లి కృష్ణశాస్త్రి అభిమానులు. బాగా పుస్తకాలు చదివేవారు. అందుకే ఇంట్లో చాలా పుస్తకాలు ఉండేవి. అన్నం తింటూ కూడా పుస్తకం చదివేదాన్ని. ఇప్పటికీ అంతే ఒకచేతిలో పుస్తకం.. మరో చేతిలో అన్నం పళ్ళెం ఉంటుంది. పుస్తకాలు చదవడమంటే అందరూ పిచ్చి అనుకునేంత ఇష్టం. స్కూలులో చదువుతున్నప్పుడే చిన్నపిల్లల కథలతో పాటు యద్దనపూడి సులోచనరాణి, ద్వివేదుల విశాలక్షి గారి కథలు, రచనలు ఎన్నో చదివాను. దాదాపు స్కూలు లైబ్రరీలో ఉండే జీవిత చరిత్రలన్నీ చదివేశాను. ఆ తర్వాత కాలేజీలో చేరిన తర్వాత కథల స్థానాన్ని నవలలు ఆక్రమించాయి. ప్రముఖ రచయితలందరీ నవలలు, సీరియల్స్ బాగా చదివేదాన్ని. రాజమండ్రి ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ అయిన తర్వాత హైదరాబాద్‌లో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌లో పనిచేసే మూర్తితో పెండ్లి నిశ్చయం చేశారు.


పుస్తకాలతో బంధం బలపడింది..

పెండ్లి చూపుల్లోనే ఆయన నన్ను పుస్తకాలు చదువుతారా? అని అడిగాను. నేను చదివిన పుస్తకాల గురించి ఇద్దరం మాట్లాడున్నాం. ఆయన ఎక్కువగా ఇంగ్లీష్ సాహిత్యం చదివేవారు. మా పెండ్లి అయిన తర్వాత మేమిద్దరం ఎన్నో పుస్తకాలపై మాట్లాడు కుంటునే ఉన్నాం. మా అత్తవారింటి సమీపంలోనే శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్రభాషా నిలయం ఉండేది. ఎన్నో అమూల్యమైన గ్రంథాలను, ప్రముఖుల పుస్తకాలు చదివే అవకాశం నాకు ఈ గ్రంథాలం రూపంలో మళ్లీ లభించింది. అంతే కాకుండా మార్కెటులోకి వచ్చిన కొత్త పుస్తకాలను తప్పక కొనేవాళ్లం. ప్రతి సంవత్సరం హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు ఇద్దరం కలిసి వెళ్లేవాళ్లం. పుస్తకాలతో మా వివాహబంధం మరింత బలపడింది. ఆయన సహకారంతోనే ఇంటి బాధ్యతలను సక్రమంగా నిర్వహించడంతో పాటు ఉద్యోగ నిర్వహణలోనూ ఎలాంటి సమస్యలు ఎదురుకాలేదు.



చిన్నిచిన్ని కవితలతో..

ఆదిత్య గ్రూప్ సంస్థలో హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్‌లో 2010 వరకు ఉద్యోగం చేశాను. మా ఇద్దరు అమ్మాయిల చదువులు పూర్తయిన తర్వాత వాలెంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాను. ఖాళీ సమయం ఎక్కువగా ఉండటంతో మాకు ఇష్టమైన పుస్తకాలు కొంటూ.. చదువుతూ చదువుతూ ఉండగా చిన్నచిన్న కవితలు రాయడం ప్రారంభించాను. అవి ఫేస్‌బుక్‌లో పెట్టడం ఫ్రెండ్స్ బాగున్నాయి అంటూ కామెంట్ చేయడంతో పఠనావ్యాసాంగం నుంచి రచనావ్యాసాంగం వైపు మనసు మళ్లింది. ఆ తర్వాత స్నేహితుల సూచనతో 'జీవితం' బ్లాగ్ ఏర్పాటుచేసి బ్లాగ్ వాల్‌పై కవితలు, వివిధ అంశాలు రాసేదాన్ని. ఆ తర్వాత ఇతర వెబ్‌సైట్లకు రాయడం ప్రారంభమైంది. 'శబ్ద కదంబం' వెబ్‌సైట్‌లో పాత కథలు చదివేదాన్ని. పాలగుమ్మి, అడవి బాపిరాజు, శరత్‌చంద్రచటర్జీ కథలు చదివాను. అలా..అలా ప్రముఖుల కథలు మళ్లీ చదువుతున్నప్పుడే ఎన్నో ఆలోచనలు వచ్చేది. చిన్నప్పుడు చదివిన పురాణాలను, గ్రంథాలను మరోసారి మననం చేసుకునేదాన్ని. అప్పుడు 'కృష్ణం వందే జగద్గురం' రాశాను. ఇది నేను రాసిన మొదటికథ. రామాయణ, మహాభారతంలోని పౌరాణిక పాత్రలతో ఫిక్షన్‌గా సాగే కథ అది. ఆ కథను కిరణ్‌ప్రభగారికి పంపిస్తే.. 'కౌముది' వెబ్‌మ్యాగజైన్‌లో ప్రచురించారు. ఆ కథకు వచ్చిన స్పందన మరిన్ని కథలు రాయడానికి ప్రేరణ అయ్యింది. దాంతో మరింత ఉత్సాహంగా కలం కదిలించాను. ఆ తర్వాత నేను రాసిన మరో రెండు కథలు ఆంధ్రభూమి వారపత్రికలో వచ్చాయి. 'బాగానే రాస్తున్నాను' అన్న నమ్మకం వచ్చిన తర్వాత కొన్ని కథల పోటీలకు నేను రాసిన కథలను పంపించాను. పోటీల్లోనూ నా కథలకు బహుమతులు వచ్చాయి. అంతేకాదు తెలుగువెలుగు, విపుల, స్వాతి, నవ్య పత్రికల్లోనూ నేను రాసిన కథలు వచ్చాయి. ఇప్పటివరకు దాదాపు 40కథలు ప్రచురితమయ్యాయి. వాటిలో 24కథలతో 'వాత్సల్య గోదావరి' కథాసంపుటి తీసుకువచ్చాం. ఈ ఏడాది హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఈ పుస్తకం అందుబాటులో ఉంటుంది. చిన్నతనంలో నాతో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచిన యద్దనపూడి సులోచనరాణి గారికి ఆ పుస్తకం అందించడం నా సాహితీప్రయాణంలో మధురఘట్టంగా భావిస్తాను. నాకు ప్రేరణనిచ్చిన ఎంతో మంది సాహిత్యవేత్తలను ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై కలవడం, వారితో సాహిత్యభాషణం చేయడం నేను మరిచిపోలేని సంఘటనలు.



పట్టు.. విడుపు ఉండాలి..

నేటి మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఎంతో పట్టుదలగా తాము కోరిన కెరీర్‌లో కొనసాగుతున్నారు. ఆర్థిక స్వేచ్ఛ నేటి తరం మహిళలకు చాలా అవసరం. ఆత్మవిశ్వాసంతో బతుకుతున్నారు. ఉద్యోగాలు చేసే మహిళలు ఇంట్లో, ఉద్యోగంలో ఎప్పటికప్పుడు తమను తాము నిరూపించుకోవల్సి వస్తుంది. అయితే కొన్నిసార్లు పట్టుదలకు పోయి జీవితాన్ని అల్లకల్లోలం చేసుకుంటారు. కొంత కాలం గడిచిన తర్వాత 'నేను అలా చేసి ఉండాల్సింది కాదు. ఇలాంటి పరిణామాలు ఎదురవుతాయని నాకు ఎవరైనా చెబితే బాగుండేది' అన్న ఆత్మవిమర్శ మొదలైతుంది. ముఖ్యంగా వివాహబంధాల్లో ఇలాంటి పరిస్థితి ఎదురవుతుంది. అందుకే పట్టు.. విడుపు ఇద్దరిలోనూ ఉండాలి. అప్పుడే జీవితం సాఫీగా సాగుతుంది. ఒకరి అభిరుచులను మరొకరు అర్థం చేసుకున్నప్పుడే వైవాహికజీవితం ఆనందమయం అవుతుంది.

సాహిత్యాన్ని పరిచయం చేయాలి..

ఇప్పుడు వస్తున్న యువ ఔత్సాహిక రచయితలు ఎన్నో క్లిష్టమైన అంశాలను తీసుకుని సరళమైనశైలిలో రచనలు చేస్తున్నారు. అయితే తెలుగు మీడియంలో చదివే పిల్లల సంఖ్య తగ్గిపోవడంతో మన సాహిత్యంలోని అపురూపమైన గ్రంథాలను, పుస్తకాలను వారు చదవలేకపోతున్నారు. తెలుగు సాహిత్యాన్ని పిల్లలకు పరిచయం చేయాలి. సాహిత్యం చదివితేనే సంస్కారం అలవడుతుంది. అని మనుషున్ని సరైన మార్గంలో పెడుతుంది. అప్పుడే రేపటితరంలోనూ చరిత్రలో గుర్తుండిపోయే తెలుగు సాహిత్యవేత్తలు మన మధ్యన ఉంటారు.

✍ వి. యశోద

విజయ సాధనకు మౌలిక సూత్రాలు

విజయం సాధించడానికి మూలసూత్రాలలో ఒకటి... చేస్తున్న పనికి సంబంధించింది. విజయం సాధించాలంటే ఏం చేస్తున్నామో తెలియాలి. చేస్తున్న పనిని ఇష్టపడాలి. అలాగే ఆ పనిని విశ్వసించాలి. ఈ మూడూ కలిసినప్పుడు విజయ సాధనకు మార్గం సుగమవుతుంది.



చాలా మందికి తాము ఏమి చేస్తున్నామో వారికే తెలియదు. ఏది తోస్తే అది చేస్తుంటారు. ఒక గమ్యం అంటూ ఉండదు. అలాగే చేస్తున్న పనిని ఇష్టపడటం చాలా మందిలో ఉండదు. పొద్దున లేచిన దగ్గర నుంచి చేస్తున్న పనిని తిట్టుకుంటూ గడుపుతుంటారు. తమకు తగని పని, తమకు సరిపోని పని చేస్తు న్నామన్న భావన వీరిలో ప్రతిక్షణం కన్పిస్తుంటుంది. ఇక చేస్తున్న పనిని విశ్వసించని వారే మనలో ఎక్కువ. ఒక లక్ష్యాన్ని, ఫలితాన్ని ఆశించి పని చేస్తుంటారు. కానీ అది సాధించగలమన్న విశ్వాసం మాత్రం ఏ కోశానా ఉండదు. అదే నిర్వేదం వారిలో ఎప్పుడూ కన్పిస్తుంటుంది. ఏదో తప్పక చేస్తున్నాముగాని అది జరుగుతుందా అన్న అపనమ్మకం మాత్రం నిలువెల్లా వ్యక్తం చేస్తుంటారు.

విజయసాధనకు ఈ మూడు అంశాలూ అవసరమే. చేస్తున్న పనిపట్ల అవగాహన, దానిని ఇష్టపూర్వకంగా చేయడం, అలాగే అనుకున్న ఫలితం సాధించగలమని నమ్మడం. విజయ శిఖరాలను అధిరోహించిన వారు ఈ మూడింటినీ పాటించినవారే. ఎవరైనా చేస్తున్న పనిని, కృషిని ప్రాణప్రదంగా భావించాలి. లక్ష్యాన్ని చేరగలమని చివరి వరకూ విశ్వసించాలి. ఈ రహస్యాన్ని తెలుసుకున్న వారెవరైనా కోరుకున్న విజయాలు సాధించగలరు.

పచ్చదనంతో స్వచ్ఛమైన గాలి

స్వచ్ఛమైన గాలిని అందించే ఇండోర్ ప్లాంట్స్ పెంచుకుంటే ఇంటికి సరికొత్త అందం రావడమే కాకుండా ఇంట్లో మంచి ఆహ్లాదపూరిత వాతావరణం నెలకొంటుంది. ముఖ్యంగా ఇంట్లో గుబురు మొక్కలు ఏర్పాటు చేసుకుంటే కలిగే ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు. స్వచ్ఛమైన గాలిని అందించడటంలో వీటిదే కీలక పాత్ర అని చెప్పుకోవచ్చు.

గుబురు మొక్కలు 24 గంటల్లోనే గాలిలోని 87 శాతం కాలుష్యాన్ని తొలగిస్తాయి. ఇండోర్ ప్లాంట్స్‌లో పెంచే మొక్కలకు నేరుగా సూర్యరశ్మి పెద్దగా అవసరం ఉండదు. అలాగే వాటి గురించి ప్రతి రోజూ శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం కూడా ఉండదు. అయితే చూసేందుకు మాత్రం ఆ మొక్కలు ఎంతో అందంగా ఉంటాయి. ఇంటి డిజైనింగ్‌లను బట్టి, స్థలాన్ని బట్టి రకరకాల డిజైనర్ కుండీలలో మొక్కలను పెంచితే ఆ ఇల్లు పచ్చదనంతో కళకళ లాడుతుంది.

పామ్, పెరోమియా, మనీప్లాంట్ వంటి మొక్కలకు తక్కువ సూర్యరశ్మి సరిపోతుంది. పామ్ మొక్కను చిన్న కుండీలో నాటి, కావాల్సిన ఎత్తు పెరిగాక కత్తిరిస్తుండాలి. ఇక మనీప్లాంట్స్ బంగారు వర్ణం, ఆకుపచ్చ, ఫిలో డెండ్రాన్... అనే మూడు రకాలు లభిస్తుంటాయి. వీటిలో ఏరకం అయినా తెచ్చి పెంచుకోవచ్చు.

స్థలం కొంచెం ఎక్కువగా ఉన్నట్లయితే వెడల్పాటి కుండీలో వేర్వేరు రకాలకు చెందిన ఐదారు మొక్కలను నాటుకోవడం మంచిది. మీరు మొక్కలు పెంచబోయే కుండీలలో రంగు రంగుల గోళీలు, చిన్న సైజు బొమ్మల వంటివి కూడా పెడితే చూసేందుకు ఎంతో అందంగా, ఆకర్షణీయంగా ఉంటాయి.



మొక్కల పెంపకంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అవేంటంటే... మొక్కల్ని ఎప్పుడూ ఒకే చోట, ఒకే కోణం లో ఉంచకూడదు. ఒకటి, రెండు వారాల కోసారి వాటిని తిప్పుతూ ఉండాలి. కొని ఇళ్లల్లో ఇండోర్ ప్లాంట్స్ ఆకులు రాలిపోతూ ఇంటి యజమానులకు తెగ చికాకును తెప్పిస్తాయి. మొక్కలకు నీరు ఎక్కువైనా తక్కువైనా ఇలాంటి ఇబ్బందులు ఎదురవు తాయి. కాబట్టి నీటి విషయంలో సమతుల్యం అవసరమని గుర్తుంచుకోవాల్సి ఉంటుంది.



మహిళలకు క్యాల్షియం

శరీర సౌష్టవానికి ప్రధానమైన కారణం క్యాల్షియం. అందుకే ప్రతి ఒక్కరూ క్యాల్షియంతో స్నేహం చేయాలంటున్నారు వైద్యులు. ముఖ్యంగా మహిళలకు క్యాల్షియం ఎంతో అవసరం. సాధారణంగా మనం తీసుకునే ఆహారంలో క్యాల్షియం ఏయే పదార్థాల నుంచి మన శరీరానికి అందుతోందనేది తెలుసుకోవాలి. పిల్లలకు చిన్నప్పటి నుంచే తల్లులు రోజుకు రెండు మూడుసార్లు పాలు త్రాగిస్తుంటారు. పిల్లలకు పాలను ఇవ్వడం వలన వారి ఎదుగుదలకు దోహదపడుతుంది.

గతంలో చదువుకోలేని గ్రామీణ సాధారణ మహిళలు కూడా పిల్లవానికి పాలనిచ్చేందుకు తహతహలాడేవారు. ఎందుకంటే పాలతో పిల్లలలకు ఆరోగ్యం, ఎదుగుదల ఆధారపడి ఉంటాయి. పాలలో లభించే పోషకపదార్థాలు శరీరానికి ఎంతో అవసరం అంటున్నారు వైద్యులు. ఇందులో క్యాల్షియం ఎక్కువగా ఉంది. ఇది పిల్లల్లోని ఎముకలు, దంతాల స్వరూపం, వారి శరీర సౌష్టవం, ఆరోగ్యం తదితరాలను మెరుగుపరిచేందుకు తోడ్పాటునిస్తుందంటున్నారు ఆరోగ్యనిపుణులు.

పాలలోని క్యాల్షియం శరీరాన్ని బలపరచడమే గాకుండా గుండెజబ్బుల బారిన పడకుండా ఉండేందుకు దోహదపడుతుంది. అలాగే పాలు కిడ్నీలోని రాళ్ళను కూడా కరిగించేస్తుంది. అలాగే మహిళల నెలసరి రుతుక్రమంలోను పాలు ఎంతో దోహదపడుతుంది.



కమ్మని నిద్రకు...

మనం ఆరోగ్యంగా ఉండాలంటే నిద్ర కంటే మించినది మరొకటి లేదు. శరీర పెరుగుదల, మెదడులోని కణాలు కమ్యూనికేషన్ కోసం నిర్మాణాత్మకమైన మార్పులతో పాటు నిద్ర వల్ల ఇంకా చాలానే లాభాలు ఉన్నాయి. ఇక చిన్న పిల్లల ఎదుగుదలకు నిద్ర చాలా ముఖ్యమైనది. తగినంత నిద్ర వున్న పిల్లలు కొత్త విషయాల పట్ల ప్రత్యేక శ్రద్ధను కలిగి ఉంటారు. అయితే నేటి జీవన శైలితో పెద్దల న ఉంచి పిల్లలకు వరకు మంచి నిద్ర కరువయింది. పిల్లలు తినే ఆహారంలో కొన్ని ప్రత్యేకమైన పదార్థాలను పెట్టగలిగితే వారు హాయిగా నిద్రపోతారు. అవేంటో తెలుసుకుందాం...

అరటి పండు: భోజనం తర్వాత అందరూ సాధారణంగా వాడే పండు అరటి. ఇందులో మెగ్నీషియం చాలా ఎక్కువగా ఉంటుంది. అయితే మరి ఈ పండు పిల్లల నిద్రకు ఎలా సహాయ పడగలదని అనుకుంటున్నారు ? మెగ్నీషియం అనేది కండరాలను సడలించేదిగా పనిచేస్తుంది. తద్వారా మొత్తం శరీరాన్ని విశ్రాంతి చెందేలా చేస్తుంది. ఇంకా అరటి నిద్రను ప్రేరేపించే హార్మోన్లు మెలటోనిన్, సెరోటోనిన్లను కలిగి ఉంటుంది. అందుకే పడుకునే ముందు పిల్లలకు ఓ అరటి పండు పెడితే చక్కగా నిద్రపోతారు.

సాల్మన్: సాల్మన్ అనే సముద్రపు చేప నిద్రను ప్రేరేపించడంలో చాలా ఉత్తమమైనదిగా పనిచేస్తుంది. ఆహారంగా సాల్మన్ చేప తీసుకున్నప్పుడు మానవ శరీరంలో మెలటోనిన్, సెరోటోనిన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. దీనివల్ల మంచి నిద్ర పడుతుంది. అంతేకాక సాల్మన్ చేపను తినటం వల్ల సన్నగా, బలహీనంగా ఉండే పిల్లలు బరువు పెరుగటానికి కూడా ఉపయోగపడుతుంది.

ఓట్స్: ఓట్స్ నాడీ వ్యవస్థను బలోపేతం చేసే విటమిన్లను, ఖనిజాలను కలిగి ఉంటుంది. అంతేకాదు ఇవి బాగా నిద్రపోయేలా చేసే మెలటోనిన్ హార్మోన్ అధిక సాంద్రతను కలిగి ఉంటాయి. అలాగే ఓట్స్ కార్బోహైడ్రేట్లను కూడా ఎక్కువగా కలిగి ఉంటాయి. దాంతో త్వరగా కడుపు నింపుతాయి. దాంతో నిద్ర బాగా పడుతుంది.

బచ్చలికూర: పిల్లలకు ఇచ్చే ఆహారంలో బచ్చలికూర ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది శరీరానికి అవసరమైన అన్ని రకాల విటమిన్లను, ఖనిజాలను గొప్ప మోతాదులో కలిగి ఉండడమే కాకుండా, ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లమును కూడా ఎక్కువ మోతాదులో కలిగి ఉంటుంది. పిల్లలు నిద్రపోయే ముందు దీన్ని జ్యూస్‌లలో కూడా దీని రసాన్ని కలిపి ఇవ్వొచ్చు.

అన్నం: పిల్లలతో నిద్రలేమి సమస్యలను ఎదుర్కొంటున్నట్లయితే, వారి డిన్నర్ ప్లేట్లలో అన్నంను చేర్చడానికి వెనుకాడకండి. బియ్యం నిద్రను ప్రేరేపించే గ్లైసెమిక్‌ను అతి త్వరగా ఉత్పత్తి చేస్తుంది. శరీరం బాగా అలసటగా వున్నప్పుడు కడుపు నిండా భోజనం చేస్తే నిద్ర బాగా పడుతుంది.

వాల్నట్ : బ్రెయిన్–ఆకారంలో ఉండే అక్రోట్లు మెదడుకు చాలా మంచిదని చెబుతారు. ఇది బరువును తగ్గించడానికి సహాయపడుతుంది. కానీ అక్కడితో దీని ప్రయోజనాలు ముగియలేదు. వాల్నట్లలో ట్రిప్టోఫాన్ భారీ మొత్తంలో ఉన్నది. పిల్లలు నిద్రపోవడానికి ముందు తీపి పదార్థాలలో వీటిని జోడించి పెట్టవచ్చు.

అనాస పండు: పైనాపిల్ మెలటోనిన్ను గొప్ప స్థాయిలో పెంచుతుంది. ఈ విషయం చాలామందికి తెలియదు. ఓట్స్, అరటి కన్నా అనాస పండులో మెలటోనిన్ను ఎక్కువగా ఉంటుంది. పైనాపిల్ ముక్కలను భోజనం తర్వాత తినడం వల్ల జీర్ణక్రియకు బాగా సహాయపడుతుంది.


ద్రాక్ష: నిద్రను రెగ్యులేటింగ్ చేసే మెలటోనిన్ హార్మోన్ ద్రాక్షలో కూడా ఉంటుంది. ద్రాక్ష రసం ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ఫ్రూట్ సలాడ్లో ద్రాక్షలను కలిపి తీసుకున్నా మంచి ఫలితం ఉంటుంది.

ఎక్కువ కార్బోహైడ్రేట్లు, తక్కువ ప్రోటీన్లను కలిగి ఉన్న ఆహారం: ఎక్కువ కార్బోహైడ్రేట్లు, తక్కువ ప్రోటీన్లను కలిగి ఉన్న ఆహారం ప్రశాంతమైన నిద్రకు దారితీస్తుందని డాక్టర్లు సూచిస్తున్నారు.

అలనాటి శశిరేఖ

Women of the day

శాంతకుమారి(17మే, 1920 - 17 జనవరి, 2006)




తెలుగు చిత్ర పరిశ్రమ ఆప్యాయంగా 'అమ్మ' అని పిలుచుకునే నటి శాంతకుమారి. 'శశిరేఖా పరిణయం' సినిమాతో నట జీవితం ప్రారంభించారు. ప్రముఖ సినీ దర్శకుడు సి.పుల్లయ్యతో పెండ్లి తర్వాత ఆమె నటనను కొనసాగించి దాదాపు వందకు పైగా సినిమాల్లో నటించి 1999లో 'రఘుపతి వెంకయ్య అవార్డు'ను అందుకున్నారు.

శాంతకుమారి అసలు పేరు వెల్లాల సుబ్బమ్మ. కడప జిల్లా ప్రొద్దుటూరులో జన్మించారు. తండ్రి వెల్లాల శ్రీనివాసరావుకు కళలు అంటే ఎంతో ఇష్టం. మద్రాసులో ప్రొఫెసర్ పి. సాంబమూర్తి వద్ద కర్ణాటక సంగీతం, వయొలిన్ నేర్పించారు. ప్రముఖ సంగీత కళాకారిణి డి.కె.పట్టమ్మాళ్‌తో కలిసి సుబ్బమ్మ సంగీత సాధన చేశారు. 13ఏండ్ల వయసులోనే సుబ్బమ్మ కర్ణాటక సంగీతం, 15ఏండ్ల వయసులో వయొలిన్‌లో పట్టా అందుకున్నారు. ఆ తర్వాత గురువుతో కలసి దక్షిణ భారత్‌లో ఎన్నో కచేరీలు చేశారు.

సుబ్బమ్మ కచేరి చూసిన దర్శక–నిర్మాత పి.వి.దాసు శశిరేఖ పరిణయం సినిమాలోఅవకాశం ఇచ్చి... ఆమె పేరును శాంతకుమారిగా మార్చారు. నటనతో పాటు గాయనిగా కూడా ఆమె సంచలనం సృష్టించిన సినిమా సారంగధర (1937). ఈ చిత్ర దర్శకుడైన పి.పుల్లయ్యతో పెండ్లి తర్వాత ఎన్నో సినిమాల్లో నటించారు. వారికి రాధ, పద్మ ఇద్దరు అమ్మాయిలు.

పౌరాణిక పాత్రల్లోనే కాదు సాంఘిక పాత్రల్లోనూ తన నటనతో ఆకట్టుకున్నారు. పెరిగే వయసుతో పాటు పాత్ర్లోనూ మార్పును ఆహ్వానిస్తూ.. నాలుగు దశాబ్దాల పాటు ఆమె వెండితెరపై హీరోయిన్‌గా, వదినగా, తల్లిగా, బామ్మగా ఆమె నటించారు. శాంతకుమారి మొదటి సాంఘిక చిత్రం ధర్మపత్ని. అక్కినేని నాగేశ్వరరావుతో మాయలోకం సినిమాలో కథానాయికగా నటించిన శాంతకుమారి, జయభేరి సినిమాలో ఆయనకు వదినగా, అర్థాంగి సినిమాలో సవతి తల్లిగా నటించారు. అంతేకాదు ఎన్టీఆర్ హీరోగా నటించిన 'తల్లా పెళ్ళామా' సినిమాలో బామ్మగా నటించారు. తెలుగు సినీ పరిశ్రమలో



అగ్రతారలైన ఎన్.టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, తమిళసినీ ప్రముఖులు శివాజీ గణేశన్, జెమినీ గణేశన్ తదితరులకు చాలా చిత్రాల్లో శాంతకుమారి తల్లిగా నటించారు.

పద్మశ్రీ పిక్చర్స్, రాగిణి పిక్చర్స్ పేరుతో సొంతంగా ఇరవైకి పైగా సినిమాలను నిర్మించారు. తాను హీరోయిన్‌గా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమాలనే మళ్లీ తీసినపుడు తల్లి పాత్రల్లో నటించిన అరుదైన రికార్డు శాంతకుమారి సొంతం. మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడే పాటలను రాసి, స్వరపరిచే తనలోని సంగీతాభిలాషను చాటుకునేవారు.

ఆంధ్రప్రదేశ్ Dwaraka
నవతెలంగాణ

రూ.6కే కిలో నిమ్మకాయలు

అమరావతి : నిమ్మకాయల ధర భారీగా పడిపోయింది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనివిధంగా కిలో ఆరు రూపాయలకు తగ్గిపోవడంతో నిమ్మ రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే పండుగ డిమాండ్‌తో మంగళవారం కాస్త తేరుకునేలా కిలో రూ.15 – రూ.20 మధ్య పలికింది. ధర కనీస స్థాయిల్లో కూడా పలకపోవడంతో గుంటూరు జిల్లాలోని పలు నిమ్మతోటల్లో రైతులు నిమ్మకాయలను మార్కెట్‌కు తరలించకుండా తోటల్లోనే ఉంచేశారు.

నీరుగార్చిన నిమ్మ



నిమ్మతోటలోనే ఉంచిన నిమ్మకాయలు

ఏపీకి కొత్త గవర్నర్‌ను నియమించండి

కేంద్ర హోంమంత్రికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి లేఖ

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌కు వెంటనే కొత్త గవర్నర్‌ను నియమించాలని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కంభంపాటి హరిబాబు లేఖరాశారు. మంగళవారం ఈ లేఖను మీడియాకు విడుదల చేశారు. రాష్ట్రంలో పాలన సవ్యంగా జరగడానికి ప్రస్తుత గవర్నర్ సహకరించడం లేదనే అభిప్రాయం ప్రజల్లో ఉందని, వెంటనే గవర్నర్‌ను నియమించాలని కోరారు. దీంతోపాటు హైకోర్టు విభజన విషయంలోనూ రాష్ట్ర ప్రజల్లో స్పష్టమైన అభిప్రాయం ఉందని తెలిపారు. వెంటనే రాష్ట్రంలో నూతన హైకోర్టును ఏర్పాటు చేయాలని, ఉమ్మడి హైకోర్టును విభజించాలని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర పాలన మొత్తం అమరావతికి మారిందని, హైకోర్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని అన్వేషిస్తోందని, హైకోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీమ హక్కుల కోసం గళం విప్పాలి

- ప్రకటించిన పరిశ్రమలన్నీ వెనక్కుపోతున్నాయి : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్, పుణ్యవతి



అనంతపురం : రాష్ట్ర విభజన సమయంలో వెనుకబడిన రాయలసీమ కోసం ఇచ్చిన హామీలు అమలు చేయించే విషయంలో గళం విప్పాల్సిన అవసరముందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) అనంతపురం12వ జిల్లా మహాసభలు మంగళవారం అనంతపురం జిల్లా ధర్మవరం పట్టణంలో ప్రారంభమయ్యాయి. రెండురోజుల పాటు జరిగే ఈ మహాసభల సందర్భంగా రైల్వేస్టేషన్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడ నరేష్ ప్రాంగణంలో బహిరంగ సభ జరిగింది. తొలుత ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ.. విభజన సమయంలో రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీని కేంద్రం ప్రకటించిందని గుర్తు చేశారు. ఆ ప్యాకేజీ అమలుపై కేంద్రం దృష్టి సారించడం లేదని విమర్శించారు. కడప జిల్లాలో ఏర్పాటు చేస్తామన్న ఉక్కు పరిశ్రమ, అనంతపురం జిల్లాలో కుదురేముఖ్ ఉక్కు పెల్లెట్లు తయారీ పరిశ్రమ, కర్నూలులో రైల్వే వాగ్యన్ల తయారీ పరిశ్రమ, చిత్తూరులో ఏర్పేడులో ఏడు వేల కోట్లతో ఏర్పాటు చేస్తామన్న బీహెచ్ఇఎల్ ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. ఈ పరిశ్రమల ఏర్పాటుకు గట్టిగా నిలదీసే పరిస్థితి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌కు లేదని అన్నారు. కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ.. కేంద్రం తెచ్చిన జీఎస్టీ వలన ధర్మవరంలోని చేనేత పరిశ్రమను మరింత సంక్షోభంలోకి నెట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 30 శాతం వరకు చేనేతపై అదనపు భారం పడుతోందని అన్నారు. రాయలసీమ ప్రాంతం కోసమే పట్టిసీమ అని చెబుతున్న చంద్రబాబు గోదావరి నుంచి కృష్ణకు వంద టీఎంసీలకుపైగా తీసుకొస్తే, రాయలసీమకు కృష్ణా జలాలు ఎన్ని అందించారో చెప్పాలని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య వైషమ్యాలు పెంచే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు (వైవి) మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలందరికీ ఇండ్లు కట్టిస్తామని చెబుతున్న ముఖ్యమంత్రి ఇంత వరకు ఎన్ని ఇండ్లు కట్టించారో చెప్పాలని అన్నారు. అనంతపురం జిల్లాలో మూడు లక్షల ఇండ్లు అవసరమని అధికారులే తేల్చారని గుర్తు చేశారు. అందులో ఇప్పటి వరకు కట్టించినవి 1100 మాత్రమేనని చెప్పారు. పేదలకు భూములు పంచకపోగా ఉన్న భూమిని పరిశ్రమల పేరుతో బలవంతంగా లక్కుంటున్నారని విమర్శించారు. రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు మాట్లాడుతూ.. అత్యంత కరువు పీడిత ప్రాంతాల్లో కనీసం ఉపాధి హామీ పనులను సక్రమంగా కల్పించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వముందని చెప్పారు. చేసిన పనికి నెలల తరబడి బిల్లులు పెండింగులో పెట్టిందని విమర్శించారు. ఉన్న చోట ఉపాధి లేక కర్నాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు జనం వలసలు వెళ్లాల్సిన దయనీయపరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి పోరాటాలే ఏకైక మార్గమని పిలుపునిచ్చారు. సభకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అధ్యక్షత వహించారు.

రాజకీయ ఒత్తిళ్లదే పైచేయి

- పందేల నిర్వాహకులతో ఖాకీల లాలూచీ
- 3 రోజుల్లో 'తూర్పు'లో చేతులు మారింది రూ.100 కోట్లు
- పశ్చిమలో 200 బరుల్లో కోడి పందేలు



తూర్పుగోదావరి జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లలో జోరుగా కోడిపందేలు

రాజమహేంద్రవరం, ఏలూరు : కోడి పందేలు వద్దని హైకోర్టు ఆదేశించినా, పందేలు వేస్తే తాట తీస్తామని పోలీసులు ప్రకటించినా చివరకు రాజకీయ ఒత్తిళ్లే పైచేయి సాధించాయి. తూర్పుగోదావరి జిల్లాలో హోంమంత్రి మొదలు ప్రజాప్రతినిధులెవరూ కోడి పందేలను కట్టడి చేయలేకపోయారు. పైగా ప్రజాప్రతినిధులే దగ్గరుండి పందేలు వేయించారు. ఈ సందర్భంగా కోట్లాది రూపాయలు చేతులు మారాయి. పందేల వైపు పోలీసులు కన్నెత్తి చూడకపోవడాన్ని బట్టి వారిని కూడా తాయిలాలతో లోబరుచుకున్నట్లు సర్వత్రా వినవస్తోంది. ఫలితంగా వందకుపైగా గ్రామాల్లో కోళ్ల రక్తం చిందించాయి. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో ఐ.పోలవరం మండలం మురమళ్ల, అల్లవరం మండలం గోడి, గోడిలంక గ్రామాల్లో తిరునాళ్లను తలపించేలా బరులు కిటకిటలాడాయి. జిల్లాలో సుమారు రూ.100 కోట్ల మేర పందేలు, జూదాలు జరిగాయి. ఒక్క మురమళ్లలోనే ఆది, సోమ, మంగళ వారాల్లో సుమారు రూ.50 కోట్లమేర పందేలు జరిగాయి. గోడి, గోడిలంకలో రూ.10 కోట్ల మేర జూదాలు జరిగాయని అంచనా.

గెస్ట్ టీచర్లను క్రమబద్ధీకరించాలి

ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు భుజంగరావు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

బీసీ గురుకులాల్లో పనిచేస్తున్న గెస్ట్ టీచర్లను క్రమబద్ధీకరించాలనీ ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు భుజంగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్కువ జీతంతో, గంటల ప్రతిపాదికన పనిచేయిస్తూ శ్రమదోపిడి చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లోని ఎస్టీయూ రాష్ట్ర కార్యాలయంలో బీసీ గురుకుల పాఠశాలల్లో మంగళవారం గెస్ట్ టీచర్ల సమస్యలపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న భుజంగరావు మాట్లాడుతూ... రాష్ట్రంలో 15ఏండ్లుగా 850 మంది గెస్ట్ టీచర్లు పనిచేస్తున్నారని తెలిపారు. వారందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆదిరెడ్డి, ఎస్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సదానంద్‌గౌడ్, గెస్ట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గోవర్ధన్, కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, సయ్యద్ గౌస్, దయాకర్‌రావు, హర్షవర్ధన్, సైదమ్మ, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఎంటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

గణితం టీచర్ల ఫోరం(ఎంటీఎఫ్) రూపొందించిన 2018 సంవత్సర క్యాలెండర్‌ను ఎస్‌సీఈఆర్టీ ప్రొఫెసర్ సురేశ్‌బాబు మంగళవారం ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరేంద్రస్వామి, ప్రధాన కార్యదర్శి శ్యామ్‌సుందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ టి శ్రీనివాస్, కోశాధికారి పాండురంగయ్యతో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

నెతన్యాహు పర్యటన

అలీన విధానానికి వెన్నుపోటు:ఐప్సో

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు దేశ పర్యటన భారత అలీన విధానానికి వెన్నుపోటులాంటిదని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం(ఐప్సో) రాష్ట్ర సమన్వయ సంఘం ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఐప్సో అధ్యక్షులు టి. యాదయ్య అధ్యక్షతన జరిగింది. ఆసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాలస్తీనా దేశంలో నిరాయుధులైన స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, యువకులపై దౌర్జన్యాలకు నెతన్యాహు ప్రభుత్వం పాల్పడుతున్నదన్నారు. స్థానిక ప్రజలను బలిగొంటూ వారి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను దూరం చేస్తున్నదన్నారు. అంతర్జాతీయంగా ప్రపంచదేశాలు ఇజ్రాయిల్‌పై విమర్శలు చేస్తుంటే, ప్రధాన నరేంద్రమోడీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు దేశ పర్యటనకు ఆహ్వానించడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. గతంలోని విదేశీవిధానాన్ని మోడీ ప్రభుత్వం తుంగలోకి తొక్కిందని విమర్శించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, నాయకులు ముక్తాల రేఖ, బి.నర్సింహ్మ, వెంకటస్వామిగౌడ్. బి.నాగభూషణం, పి.రవికిశోర్, రజిత తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ చట్టంపై అఖిలపక్షం : చాడ డిమాండ్

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

కొత్తగా తీసుకురానున్న పంచాయతీరాజ్ చట్టంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని రాజకీయ పార్టీల సూచనలను స్వీకరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీలో పరోక్ష ఎన్నికలంటే గ్రామాల్లో వార్డు మెంబర్‌ల కొనుగోలుకు తెరలేపినట్టే అవుతుందన్నారు. గతంలో మాదిరిగానే ప్రత్యక్ష పద్ధతిలో సర్పంచ్ ఎన్నికలు జరపాలన్నారు.

రజనీకాంత్ రాజకీయ ప్రవేశం వల్ల..

- 130 సీట్లతో డీఎంకేకే అధికారం
- ఏఐఏడీఎంకేకు 68, రజనీ పార్టీకి 33 సీట్లు

చెన్నై: తమిళనాడు రాజకీయాల్లోకి నటుడు రజనీకాంత్ రంగ ప్రవేశం వల్ల మారనున్న ఓటర్ తీర్పుపై ఇండియా టుడే ఓ సర్వే నిర్వహించింది. 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో తాజా సర్వే ప్రకారం ప్రధాన ప్రతిపక్షం డీఎంకేకు లబ్ది చేకూరనున్నట్టు తేలింది. డీఎంకేకు తన భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఐయూఎంఎల్‌తో కలిపి మొత్తం 130 సీట్లు రానున్నట్టు టుడే సర్వే వెల్లడించింది. ఏఐఏడీఎంకేకు 68, రజనీకాంత్ పార్టీకి 33, ఇతరులకు 3 సీట్లు రానున్నట్టు తెలిపింది. డీఎంకేకు 34 శాతం,ఏఐఏడీఎంకేకు26 శాతం, రజనీకాంత్‌కు 16 శాతం ,ఇతరులకు 24 శాతం, ఓట్లు రానున్నట్టు తెలిపింది. 2016లో జరిగిన ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐఏడీఎంకేకు 135 సీట్లు, డీఎంకే కూటమికి 88 సీట్లు వచ్చాయి. జయలలిత బతికి ఉన్నపుడు జరిగిన ఎన్నికలవి. ఏఐఏడీఎంకేలో జయలలిత వారసత్వంపై అడిగిన ప్రశ్నకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇకె పళనిస్వామికన్నా ఉప ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం పట్ల ఆ పార్టీ కార్యకర్తలు కాస్త మొగ్గు చూపినట్టు సర్వే తెలిపింది. 30 శాతానికిపైగా పన్నీర్, పళనితోపాటు టిటివి దినకరన్(శశికళ మేనల్లుడు)లో ఎవరూ జయలలితకు తగిన వారసులు కారని అభిప్రాయపడినట్టు టుడే సర్వేలో వెల్లడైంది. తమిళనాడుకు ఇప్పటివరకూ ముఖ్యమంత్రులుగా చేసినవారిలో ఎవరు మంచి పాలన అందించారన్నదానిపై డీఎంకే అధినేత కరుణానిధికి 29 శాతం, ఎంజి రామచంద్రన్‌కు 25 శాతం, జయలలితకు 21 శాతం అనుకూలంగా అభిప్రాయం వ్యక్తమైంది.

అగ్రిఇంకుబేషన్ కేంద్రం ఏర్పాటుపై సమావేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వ్యవసాయ పట్టభద్రుల్లో ఎంటప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాలు పెంచేందుకు అగ్రిఇంకుబేషన్ కేంద్రం ఏర్పాటుపై జయశంకర్ విశ్వవిద్యాలయం దృష్టినిలిపింది. ఇందుకు సంబంధించి న్యూఢిల్లీకి చెందిన ఇండిగ్రామ్ ల్యాబ్స్ ఫౌండేషన్, ఇండియన్ సొసైటీస్ ఆఫ్ అగ్రిబిజినెస్ ప్రొఫెషనల్స్ సంస్థ సహకారం తీసుకోవాలి ప్రాథమికంగా నిర్ణయించింది. అగ్రిఇంకుబేషన్ సెంటర్ ఏర్పాటు, అగ్రిస్టార్టప్‌లపై విశ్వవిద్యాలయం ఏ విధంగా ముందుకు పోవాలన్న అంశాలపై ఉపకులపతి ప్రవీణ్‌రావు, ఇండిగ్రామ్ ల్యాబ్స్ సీఈఓ మనీషా ఆచార్యతో మంగళవారం హైదరాబాద్‌లో చర్చించారు.

ముందస్తుకు ఉరుకులాట..

ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో చెప్పరే..?

- టీఆర్ఎస్ సీఎం క్యాండేటు కేసీఆరేనా!
- స్పష్టత కొరవడిన అధికార పార్టీ వైఖరి

ఈ హెడ్డింగేంటీ? ఆ చి'లిపి' ప్రశ్నేంటీ? అనవసరం, అసంబద్ధమని ఎవరికైనా చిరాగ్గా ఉండొచ్చు! ఓకే..ఓకే. కొంచెం ఓపిగ్గా కథనంలోకి ఎంటరవ్వండి. ఆఖరు లైను దాకా పోండి. టీఆర్ఎస్ అసలు ఫ్యూచర్ 'లైన్' ఏంటో అప్పుడు చెప్పండి!

ఇల్లెందుల దుర్గాప్రసాద్



ఆర్నెల్ల ముందే ఎన్నికలకు పోవాలని ముఖ్యమంత్రి తలపోస్తున్నారట. ఈలోగా పంచాయతీ ఎలక్షన్లతో క్షేత్రంలో పట్టు బిగించాలని భీష్మిస్తున్నారుట. ఇందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని, పార్టీ కేడరును సమాయాత్తపరిచే పనిలో పడ్డారు. తాజాగా కలెక్టర్లతో మంగళవారం భేటీ అయ్యారు కూడా. 'ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధమే..' అనడం ద్వారా ఈ ఉరుకులాట ప్రచారాన్ని మినిస్టర్ తారక రామారావు ఎంతో కొంత ఎండార్స్ చేసేశారు. సీఎం పీఠంపై ఇంకోసారి దస్తీ వేసుకునేందుకు టీఆర్ఎస్ టిప్‌టాప్‌గా తయారవుతున్నది. ఈ 2018లోనే ఓట్ల పండుగ ముహూర్తానికి ఎగిరిపడుతోంది. ఈ ముందస్తు అనేది ఉన్నా లేకున్నా 2019 జూన్‌లోగానైతే ప్రజా తీర్పు కంపల్సరీ. ఇంతకీ రాబోయే ఎలక్షన్లలో తెలంగాణ రాష్ట్ర సమితి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరన్నదే కావాల్సింది. ప్రస్తుత సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావే అధికార 'కారు' పార్టీ క్యాండేటని వేరే చెప్పాలా? అనే ఎదురు ప్రశ్న సహజంగానే బదులు అవ్వొచ్చు. కానీ, మలి దఫా తెలంగాణ ఉద్యమం కొనసాగినంత కాలమూ, రాష్ట్ర విభజనపై విధాన నిర్ణయం వెలువడ్డాక 2014లో నిర్వహించిన తొలి ఎన్నికల దాకా టీఆర్ఎస్ ఏమన్నదో మనం ఓసారి యాజ్జేసుకోవాలే. తెలంగాణ రాష్ట్రానికి దళిత సామాజిక వర్గం వారే మొదటి ముఖ్యమంత్రి అవుతారని నమ్మకానికే నమ్మకం కలిగించేలా టీఆర్ఎస్ ప్రకటించింది. ఇక ఆ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్..తెలంగాణకు కాపలా కుక్కలా ఉంటాననీ, ఎస్సీలే పరిపాలకులు అవుతారని ఎన్నో వేదికల మీద స్వయంగా బాస చేశారు. దీంతో టీఆర్ఎస్‌ను తెలంగాణ ప్రజలు గెలిపించాక తీరా ఏమైందో అందరమూ చూశాం. ఈ ప్రస్తావన తెస్తే..వారికి చిర్రెత్తుకొస్తుంది. అది గతమంటారు.(అది గతమైతే..తెలంగాణ సాధించింది మేమే అని చెప్పుకోవడమూ గతమే అవ్వాలి కదా! అని అంటే ఊరుకుంటారా?) ఎమ్మెల్యేలందరూ కేసీఆరే సీఎం కావాలని కోరుకున్నట్టు, ఆ మేరకు తమ పార్టీ విధానాన్ని సవరించుకున్నట్టు బిల్డప్ ఇస్తారు. కానీ అది ముమ్మాటికీ మేకపోతు గాంభీర్యం లాంటి కౌంటరేననీ, ఆత్మవంచన కిందకే వస్తుందనే అభిప్రాయం, ఆక్రోశం తాడిత పీడిత వర్గాలుసహా ఎందరి మనసుల్లోనో నాటుకుంది. ఇక మరో ఎన్నికల సంగ్రామం సమీపిస్తున్నది. కనీసం ఇప్పుడైనా టీఆర్ఎస్ సీఎం క్యాండేటు ఎవరో క్లారిటీగా, మాట నిలుపుకొనేలా వెల్లడించాల్సి ఉంది.

ఈ దర్శన భావమేంటో 'రామా'..!

సీఎం అభ్యర్థి కేసీఆరే అయితే గనక మరి..ముఖ్యంగా టీఆర్ఎస్ నేతలు అనేకులు, చాలా మంది బ్యూరోక్రాట్లు 'సమీప భవిష్యత్తు ముఖ్యమంత్రి'ని ప్రస్తుతం కీలక శాఖల మంత్రిగా ఉన్న కేటీ రామారావులోనే ఎందుకు దర్శిస్తున్నట్టు? డీజీపీ వంటి అత్యున్నత స్థాయి అధికారులు సైతం కేటీఆర్ సమీక్షలకు హాజరవుతున్నారు. ఆ మేరకు ఆయనకు సీఎం తత్సమాన గౌరవ మర్యాదలు ఎందుకు ఆపాదిస్తున్నట్టు? ఒక్కోసారైతే కేసీఆర్‌కు మించి ఆయన తనయుడు కేటీఆర్ ఫోకస్ అవుతున్నారు. ముందస్తుకు మేం ఎప్పుడైనా రెడీ, కేంద్రానికి దమ్ముందా అంటూ ఆయనే సవాల్ విసురుతున్నారు. మంత్రి హోదాలో కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో మొన్నటికి మొన్న హెలికాప్టరులో పర్యటించారు. ముఖ్యమంత్రిగా ఉన్న వారే అధికారికంగా జిల్లాల టూర్లకు హెలికాప్టర్లను వినియోగిస్తుంటారు. మంత్రులు ఆ సుఖమయమైన ఆకాశయానాన్ని వాడడం అరుదే.

కొంపదీసి ఇట్లా చేస్తారా ఏంటీ..?

పదీ, ఇరువై ఏండ్లు కేసీఆరే సీఎంగా ఉంటారని కేటీఆర్ పదే పదే చెబుతున్నారు. ఇది లౌక్యమే కావొచ్చు. కేటీఆర్ అంటున్నట్టు కేసీఆర్ నాయకత్వంలోనే టీఆర్ఎస్ రెన్యువల్ అయితే..కొన్నాండ్లకు ఆ పీఠంపై కేటీఆర్‌ను కూచోబెడతారా? 'సరైన సమయంలో సరైన నిర్ణయం'గా దానికి పేరు పెడతారా? కేటీఆర్‌నే సీఎం క్యాండేటని నేరుగా ప్రకటిస్తే..హరీశ్‌రావు వంటి నేతల నుంచి ప్రతికూలతలు వస్తాయనే ఈ వ్యూహం పాటిస్తున్నారా..? ఏమో! ఏదో ఒకనాటికి కేటీఆర్‌ను తన వారసుడిగా కేసీఆర్ అధిష్ఠింపజేయడం ఖాయమంటారు. తన మేనల్లుడు అయిన నీళ్ల మంత్రి హరీశ్‌రావు నారాజ్ అవకుండా ఆయనకూ ఆ టైంకల్లా తగిన ప్రాధాన్యం ఇస్తారనేది టాక్. అదెలా అంటే..ఓ కేంద్ర మంత్రిగానో మరేదో పదోన్నతిలా హోదా ఇచ్చి..కేటీఆర్ పట్టాభిషేకానికి పక్కా దారి వేయొచ్చని ఊహిస్తున్నారు. మొత్తానికైతే టీఆర్ఎస్‌లో కేసీఆర్ లేదా కేటీఆరే సీఎమ్మనే భావనా సౌధాన్ని పటిష్ఠంగానే నిర్మించేసుకున్నారు పెద్దసారు. అఫ్‌కోర్స్ ప్రాంతీయ పార్టీలంటేనే అంతనుకోండి! ఇంతకీ టీఆర్ఎస్ సీఎం క్యాండేట్ ఎవరో మరి!

దక్షిణకొరియాలో కేటీఆర్ టూర్

- పరిశ్రమల కోసం పలు ఒప్పందాలు
- ఆయా సంస్థల సీఈవోలతో భేటి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర పరిశ్రమలు, చేనేత శాఖ మంత్రి కె తారకరామారావు రెండు రోజుల పర్యటన నిమిత్తం దక్షిణకొరియాకు వెళ్లారు. ఆ సందర్భంగా మంగళవారం ఆయా పరిశ్రమల సంస్థల సీఈవోలు, కంపెనీల ప్రతినిధులతో భేటి అయ్యారు. ఆయా కంపెనీలను కలిసిన మంత్రి బృందం రాష్ట్రంలో ఉన్న వ్యాపార, పెట్టుబడుల అవకాశాలను ఆయా సంస్థలు, వాటి ప్రతినిధులకు వివరించారు. ప్రధానంగా ఆటోమొబైల్, చేనేత, ఫార్మా, ఐటీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా మంత్రి కోరారు. ఆటోమొబైల్ దిగ్గజం హ్యూందయ్ కార్పొరేషన్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు నామ్ గుహ్నోతో సమావేశం అయ్యారు. టీఎస్ ఐపాస్ ద్వారా సింగిల్‌విండో అనుమతుల విధానంపై హ్యూందయ్ ప్రతినిధులు మంత్రికి అభినందనలు తెలియజేశారు. హ్యూందయ్ రోటెమ్, గ్లోబల్ రైల్వే విభాగం డైరెక్టర్ కెకె యూన్‌తో భేటి అయ్యారు. గ్రీన్‌ఎనర్జీలో అగ్రగామిగా ఉన్న ఓసీఐ సీఈవో హూయున్‌లీతో సమావేశమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా 33 ప్రాంతాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తున్న ఈకంపెనీని తెలంగాణకు ఆహ్వానించారు. మొబైల్ ఇంటర్నెట్ బిజిఎస్ అసోసియేషన్(మొయిబా)తో మంత్రి ప్రతినిధి బృందం సమావేశం అయింది. మొయిబా సీఈవో చోయ్‌డాంగ్‌జిన్‌తో జరిగిన సమావేశంలో సంస్థ ప్రతినిధులను ఫిబ్రవరిలో తెలంగాణలో జరగనున్న ప్రపంచ ఐటీ కాంగ్రెస్‌కు ఆహ్వానించారు. 500కుపైగా కంపెనీలు సభ్యులుగా ఉన్న ఈ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒక అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఒప్పందం మేరకు మొయిబా తెలంగాణ సర్కారుతో కలిసి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, వర్చువల్ రియాలిటీ, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ వంటి అంశాల్లో కలిసి పనిచేస్తాయి. చేనేత పరిశ్రమవర్గాలతోనూ భేటి అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కాకతీయ మెగా జౌళీ పార్కు, చేనేత రంగంలోకి పెట్టుబడులతో ముందుకు వచ్చే కంపెనీలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి చెప్పారు. కాకతీయ జౌళీ పార్కులో 300 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ సందర్భంగా దైగు మెట్రోపాలిటన్ నగరాన్ని మంత్రి బృందం సందర్శించింది. మంత్రి వెంట తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ జి వివేక్‌తోపాటు పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ ఇతర అధికారులు ఉన్నారు.

బాడీగార్డ్‌ను చెంపఛెళ్లుమనిపించిన సీఎం

కెమెరాకు చిక్కిన బీజేపీ ముఖ్యమంత్రి

రాజకీయనేతలకు సహనం..ఓర్పు ఉండాలని జనం ..అధికారులు కోరుకుంటారు.కానీ తమ పీఠాలు ఎక్కడ కదిలిపోతాయోనన్న భయం వెంటాడుతుంటే...బీజేపీ సీఎంకు ఎక్కడలేని కోపం ముంచుకొచ్చింది. ఇంతకీ ఎవరా ముఖ్యమంత్రి..ఏమా కథ..



సర్దార్‌పూర్: విపక్షాలు ఎంతగా రెచ్చగొట్టినా ఎప్పుడూ ప్రశాంతంగా కనిపించే మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మంగళవారం ఇందుకు భిన్నంగా ప్రవర్తించారు. ఓ పబ్లిక్ ర్యాలీ సందర్భంగా ఆయన సహనం కోల్పోయారు. తనకు భద్రత కల్పిస్తున్న ఓ బాడీగార్డ్‌పై చేయి చేయిచేసుకున్నారు. ఈ వ్యవహారమంతా కెమెరాలకు చిక్కింది.సర్దార్ పూర్ టౌన్‌లో ఈనెలాఖరులో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. వీటి ప్రచారంలో ఉన్న చౌహాన్ ముందుకు నడుచుకుంటూ వెళ్తూ అకస్మాత్తుగా తన పక్కనే ఉన్న అధికారి చెంప పగులగొట్టారు. ముఖ్యమంత్రి అలా ఎందుకు తనపై చేయి చేసుకున్నారో అర్థం చేసుకునేలోపు.. ఆయన తాపీగా ముందుకు కదిలారు. ప్రభుత్వ ఉద్యోగిపై సీఎం చేయి చేసుకున్నందుకు క్షమాపణ చెప్పాలని..ఆయన కేసు ఎందుకు పెట్టకూడదని కాంగ్రెస్ ప్రతినిధి పంకజ్ చతుర్వేది ట్వీట్ చేశారు.

ఓఆర్ఆర్ లీజు ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి

హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు పట్నం రాష్ట్ర కమిటి వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లీజు ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని పట్నం రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది. నిర్మాణ సమయంలో ఇచ్చిన ప్రతిపాదనలకు అనుగుణంగా ఆదాయాన్ని రాబట్టుకోడానికి కమర్షియల్ కాంప్లెక్సులు, వినోద స్థలాలు, పార్కులు నిర్మించి ఆదాయాన్ని పెంచుకోవాలని, లీజు ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని కోరుతూ హెచ్‌ఎండీఏ కమీషనర్‌కు పట్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి నర్సింహారావు ప్రధాన కార్యదర్శి, అధ్యక్షులు కె.వేణుగోపాలరావు, రాష్ట్రకార్యదర్శి వి.కామేష్‌బాబు, రంగారెడ్డి జిల్లా నాయకులు దత్తునాయక్ తదితరులు గురువారం వినతిపత్రం సమర్పించారు. 158 కి.మీ నిడివి కలిగి దాదాపు 6,250 పరిధిలో 2008లో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి 2017 నాటికి సుమారు 156.9 కిమీ నిడివి ఓఆర్ఆర్ నిర్మాణం పూర్తి చేయడం హైదరాబాద్ నగర ప్రజలకు ఒక వరమేనని వారు పేర్కొన్నారు. నిర్మాణ ఖర్చు ప్రారంభం నాటికి రు.6691 కోట్లు అయితే ఇందులో సగ భాగం జపాన్ నుండి మిగిలినది జాతీయ బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలతో పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇంత పెద్దఎత్తున వ్యయం, పబ్లిక్ స్థలాన్ని వినియోగించి నిర్మించిన ఓఆర్ఆర్ నిర్వహణ పూర్తిగా లీజుకి ఇచ్చే ప్రతిపాదనను హెచ్‌ఎండీఏ ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు.

ఇప్పటికే దక్షిణ భారత దేశంలో పేరు ప్రఖ్యాతులను సంతరించుకున్న హైదరాబాద్ ఓఆర్ఆర్‌ను తమ హస్తగతం చేసుకోవాలని ప్రయివేటు వ్యక్తులు, సంస్థలు ప్రభుత్వంపై వత్తిడి చేస్తున్న మాట వాస్తవమేనన్నారు. అయితే నిర్మాణం చేపట్టిన రోజు తీసుకున్న నిర్ణయం ప్రకారం ఓఆర్ఆర్‌లో ఉన్న 12 జంక్షన్ల ప్రాంతంలో కమర్షియల్ కాంప్లెక్సులు, సినిమా హాల్స్, వినోద స్థలాలు నిర్మించి ఓఆర్ఆర్ నిర్వహణ వ్యయాన్ని రాబట్టేందుకు తీసుకున్న నిర్ణయాల నుండి వెనక్కి వెళ్లి ఓఆర్ఆర్ నిర్వహణను లీజు పేరుతో ప్రయివేట్ వేటుపరం చేయడానికి హెచ్‌ఎండీఏ, ప్రభుత్వం ప్రయత్నించడం జరుగుతుందన్నారు. లీజు కాలం కూడా 20 లేదా 30 ఏండ్లు నిర్ణయించటమంటే దాదాపు రెండు తరాలు మారతాయని, అనంతరం ఓఆర్ఆర్ హక్కులు ఎవరికి చెందుతాయనేది సంశయాత్మకంగా మారునుందని వారు పేర్కొన్నారు.

బడి మానేసిన చిన్నారులను

గుర్తించేందుకు ఆధార్ : కేంద్రం

న్యూఢిల్లీ : విద్యాసంవత్సరం మధ్యలో బడి మానేసిన చిన్నారులను గుర్తించేందుకు అన్ని పాఠశాలల్లో ఆధార్ వివరాల నమోదు తప్పనిసరి చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నది. సీఏబీఈ (సెంట్రల్ అడ్వయిజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్) కమిటి సభ్యులు పంపిన ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్టు తెలిపింది. మధ్యాహ్న భోజన పథకం అమలులో అవకతవకలను అరికట్టేందుకు ఇప్పటికే విద్యార్థుల ఆధార్ వివరాలను ప్రభుత్వం సేకరించిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్ రాష్ట్రాల్లో మధ్యాహ్న భోజన పథకం సజావుగా అమలవుతోందని సీఏబీఈ పేర్కొన్నది. దాదాపు2లక్షల మంది విద్యార్థులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపింది. ఆధార్ వివరాలను సేకరించడం ద్వారా విద్యార్థుల డ్రాపవుట్‌ను సునాయాసంగా గుర్తించేందుకు వీలవుతుందని సీఏబీఈ అభిప్రాయపడింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఏబీఈ కోరింది. అంతేగాకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే తల్లిదండ్రులకు ప్రోత్సాహకాలు అందజేయాలని సూచించింది. దేశంలో విద్యా ప్రమాణాల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వంతో పాటు అన్ని రాష్ట్రాలకు సీఏబీఈ సలహాలు, సూచనలు ఇస్తుంది.

అమెరికాలో అమానవీయ ఘటన...



• పిల్లలను చిత్రహింసలు పెట్టిన దంపతుల అరెస్ట్

కాలిఫోర్నియా: అమెరికాలోని కాలిఫోర్నియా నగరంలో అమానవీయ ఘటన చోటుచేసుకున్నది. 13 మంది పిల్లలను గృహనిర్బంధం చేసి చిత్రహింసలకు గురిచేసిన దంపతులను పోలీసులు అరెస్టు చేశారు. కాలిఫోర్నియా ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం...డేవిడ్ ఆలెన్ టర్పిన్(57, లూయిస్ అన్నా టర్పిన్(49) దంపతులకు 13 మంది సంతానం. వారి సంతానంలో ఏడుగురు మేజర్లు. లాస్ ఏంజిల్స్ నుంచి 95కిలోమీటర్ల దూరంలో ఉన్న పెర్రిస్ నగరంలో వారంతా నివాసముంటున్నారు. దంపతులిద్దరూ తమ 13 మంది పిల్లల చేతులను తాళ్లతో కట్టివేసి, వాళ్లను మంచాలకు కట్టేశారు. తల్లిదండ్రుల చిత్రహింసలను భరించలేకపోయిన ఓ అమ్మాయి ఇంటి నుంచి పారిపోయి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ ఘటన బయటపడింది. కొందరు పిల్లల్ని చీకటి గదిలో మంచాలకు గొలుసులతో కట్టేసి ఉంచారు. వారి చుట్టూ బాగా మురికి, చెడు వాసన వస్తున్నదని పోలీసులు వెల్లడించారు. అయితే పిల్లల్ని ఎందుకు అలా కట్టేశారన్న దానిపై తల్లిదండ్రులు వివరణ ఇవ్వలేకపోయారు. బాధితులంతా తిండిలేక బలహీనంగా ఉన్నారని, అందరినీ స్థానిక ఆస్పత్రిలో చేర్పించినట్టు పోలీసులు తెలిపారు. అసలు పిల్లల్ని వారు ఎందుకు అలా హింసించారనే విషయమై అర్థం కాలేదని పోలీసులు చెప్పారు. ఈ విషయమై విచారణ జరుపుతున్నట్టు తెలిపారు.

సెర్బియా నేత దారుణ హత్య



ఐవానోవిక్

బెల్‌గ్రేడ్ : సెర్బియా పార్టీ ప్రముఖ నేత ఐవానోవిక్ (64) దారుణ హత్యకు గురయ్యారు. కొసోవో నగరంలోని సిటిజన్స్ ఇనీషియేటివ్ పార్టీ కార్యాలయం ముందు ఆయనపై కొందరు గుర్తు తెలియని దుండగులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన ఐవానోవిక్ స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ దాడిని ఇనీషియేటివ్ పార్టీ నేత మార్కో డ్యూరిక్ ఖండించారు. ఉగ్రవాదులే ఐవానోవిక్‌పై దాడికి పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స

సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఐవానోవిక్ హత్య నేపథ్యంలో సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ ఉసిక్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. హత్యకు పాల్పడ్డ నిందితుల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

దక్షిణ కొరియాతో చర్చలు సఫలం

• ఉత్తరకొరియా ప్రకటన

ప్యాంగ్యాంగ్: శీతాకాలం ఒలింపిక్ క్రీడల నేపథ్యంలో దక్షిణ కొరియాతో జరిపిన చర్చలు సఫలమైనట్టు ఉత్తరకొరియా తాజాగా ప్రకటించింది. వచ్చే నెలలో జరగనున్న శీతాకాలం ఒలింపిక్ క్రీడలకు తాము తమ క్రీడాకారుల బృందంతో పాటు వాద్య కళాకారుల బృందాన్ని (ఆర్కెస్ట్రా) కూడా పంపాలని నిర్ణయించుకున్నట్టు ఉ.కొరియా ప్రతినిధి బృందం నేత క్వాన్‌హుక్ బాంగ్ చెప్పారు. ఇరుదేశాలు చిత్తశుద్ధితో చర్చలు జరిపాయని, 23వ శీతాకాలం ఒలింపిక్ క్రీడలకు సంబంధించి ఉత్తర కొరియా బృందాన్ని పంపటం, వారి ప్రదర్శనలకు సంబంధించిన అంశాలు, కార్యాచరణ వంటి విషయాలపై చర్చించినట్టు బాంగ్ తెలిపారు.

అణు యుద్ధానికి అడుగు దూరం...: పోప్



శాంటియాగో : అణ్వా యుధాలతో ప్రపంచ యుద్ధానికి కేవ లం ఒక్క అడుగు దూరం లోనే ఉన్నామని క్రైస్తవ మతపెద్ద పోప్ ఫ్రాన్సిస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చిలీ పర్యటనకు బయలు దేరిన ఆయన మీడియాతో మాట్లాడారు. హవాయిపై అణు దాడి జరగనుందని పొరపాటున జరిగిన ప్రచారాన్ని ప్రస్తావించారు. ఇటువంటి పొరపాట్లు విపరీత పరిణామాలకు దారి తీస్తాయని, వీటిని చూస్తుంటే తనకు చాలా భయంగా ఉందని అన్నారు. ఏ దేశం కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాల ప్రయోగాలపై దృష్టిపెట్టొద్దని కోరారు. అణ్వాయుధాలు తలెత్తితే మానవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఏ రెండు దేశాల మధ్య యుద్ధం సంభవించినా అపార ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తుందన్నారు. కాగా, వాటికన్ అధికారులు, నాగసాకిపై అమెరికా అణు బాంబు వేసిన తరువాత తీసిన ఓ చిత్రాన్ని బహుకరించగా, దాన్ని చూసి చలించి పోయిన పోప్, అది తన మనసును కలచివేసిందన్నారు. ఈ చిత్రం కాపీలను పంపిణి చేయనున్నట్టు తెలిపారు. చిలీలో పోప్ పర్యటన : చిలీ చేరుకున్న పోప్ ఫ్రాన్సిస్‌కు ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం లభించింది. చిలీ అధ్యక్షుడు మిచెల్లీ బ్యాచులెట్ సాదరంగా ఆహ్వానించారు. ద క్యాథలిక్ రిజిస్టర్ మీడియా సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం...పోప్ 17న చిలీలో, 18,19,20 తేదీల్లో లిమా, ప్యూర్టోమల్డొనాడో, ట్రుజిల్లో ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

ఇండోనేషియా స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనంలో భారీ ప్రమాదం

• 72మందికి గాయాలు



జకార్తా: జకార్తాలోని ఇండోనేషియా స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనంలో వాక్‌వే అకస్మాత్తుగా కూలిపడటంతో ప్రమాదం సంభవించింది. దీంతో వాక్‌వేపై నడుస్తున్న 72 మంది గాయపడ్డారు. వీరిలో 17 మంది విషమంగా ఉన్నట్టు సమాచారం. విహార యాత్రలో భాగంగా విద్యార్థులు జకార్తాలోని స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనం సందర్శనకు వచ్చారు. వివిధ కార్యాలయాలతో నిత్యం రద్దీగా ఉండే బహుళ అంతస్తుల(32) భవనాన్ని సందర్శిస్తుండగా.. ఒక అంతస్తులోని వాక్‌వే ఒక్కసారిగా కూలిపోయింది. వాక్‌వేపైకి పెద్దసంఖ్యలో విద్యార్థులు రావడంతో కూలినట్టు భావిస్తున్నారు.


సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అనేకమంది పర్యాటకులు, ఇతర ఉద్యోగులను ఖాళీ చేయించారు.

గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. జకార్తాలో అత్యంత ఆధునిక భవనాలలో ఒకటైన స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనంలో ప్రమాదం సంభవించడంతో స్థానికంగా ఆందోళన రేపింది. ప్రాణ నష్టం భారీగా ఉండొచ్చనే అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. మరోవైపు ఈ ప్రమాదంపై ఇప్పటికే ట్విట్టర్‌లో వీడియోలు, పోస్ట్‌లు వెల్లువెత్తాయి

భారత్ ఎంబసీ ప్రాంగణంపై రాకెట్

• కాబూల్‌లో ఉద్యోగులంతా సురక్షితం, ధ్వంసమైన ఐటీబీపీ బ్యారక్

కాబూల్: అఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లోని భారత రాయబార కార్యాలయ సిబ్బందికి తృటిలో ప్రమాదం తప్పింది. ఎంబసీ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం ఓ రాకెట్ పడింది. అయితే ఈ ఘటనలో దౌత్యవేత్తలకు, సిబ్బందికి ఎలాంటి హానీ జరగలేదు. ఈ విషయాన్ని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ ట్విటర్ ద్వారా వెల్లడించారు. 'కాబూల్‌లోని మన ఎంబసీ కార్యాలయ ప్రాంగణంలో ఓ రాకెట్ ల్యాండ్ అయ్యింది. దీంతో, ఐటీబీపీ బ్యారక్ స్వల్పంగా దెబ్బతింది. భారత దౌత్యవేత్తలు, సిబ్బంది అంతా సురక్షితంగా ఉన్నారు' అని రవీశ్ కుమార్ ట్వీట్ చేశారు. విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ కూడా దీనిపై ట్వీట్ చేశారు. భవనం పై భాగంలో రాకెట్ పడినట్టు ధ్రువీకరించారు. ఎంబసీ ప్రాంగణంలోని సిబ్బంది, ప్రజలకు ఎలాంటి హానీ జరగలేదని వెల్లడించారు. అయితే, ఈ రాకెట్‌ను ఎవరు ప్రయోగించారు.. భారత ఎంబసీని లక్ష్యంగా చేసుకునే రాకెట్ ప్రయోగం జరిగిందా ? అనే విషయాలపై స్పష్టత రాలేదు. ఇదిలా ఉండగా, గతేడాది మార్చిలో కాబూల్‌లోని భారత ఎంబసీ కార్యాలయానికి సమీపంలో ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో 90 మంది మృతి చెందగా, 400 మంది గాయపడ్డారు.



అమెరికా అండదండలతోనే సైనిక నిర్వహణ

• అఫ్ఘాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ



అమెరికా సహకారంతోనే తమ సైన్యాన్ని పోషించుకుంటున్నామని అఫ్ఘాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ అన్నారు. అమెరికా నిధులే లేకుంటే ఆరు నెలల కంటే ఎక్కువ కాలం తమ సైన్యాన్ని పోషించుకోలేమన్నారు. సీబీఎస్ మీడియా సంస్థతో ఘనీ మాట్లాడారు. 'అఫ్ఘనిస్థాన్‌లో 21 ఉగ్రసంస్థలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తు న్నాయి. ఉగ్రవాదులు ఏ ప్రాంతంలో, ఏ రూపంలో, ఎప్పుడు పేలుళ్లకు పాల్పడతారో అర్థం కావడం లేదు. ఈ ఉగ్రసంస్థలన్నింటినీ కట్టడిచేసేందుకు అమెరికా సహకరిస్తోంది. యూఎస్ నిధులతోనే 16 ఏండ్ల నుంచి మిలిటెంట్లకు వ్యతిరేకంగా స్పెషల్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాం. రక్షణ కార్యకలాపాల కోసం యూఎస్ అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుంటున్నాం. అమెరికా నుంచి ఇప్పటికీ 700 బిలియన్ డాలర్లు అందాయి. అఫ్ఘాన్‌లో 90శాతం మంది పౌరులు చెల్లిస్తున్న పన్నులు అమెరికా అందజేస్తున్న నిధులకు సమానం. బాంబులను తయారు చేసి ఉగ్రవాదులకు అత్యంత రహస్యంగా సరఫరా చేస్తున్న కర్మాగారాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్నది. ఉగ్రసంస్థలను నిర్మూలించేందుకు 14వేల మంది అమెరికా సైనికులు అఫ్ఘాన్‌లో మోహరించారు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన తర్వాత అఫ్ఘనిస్థాన్‌కు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు' అని ఘనీ అన్నారు. ఉగ్రసంస్థలను కట్టడిచేయడంలో అష్రఫ్ ఘనీ ఘోరంగా విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అమెరికా అండదండల తోనే అంత రగత, సరిహద్దు భద్రత నిర్వహించు కుంటున్నామని ట్రంప్ మెప్పుపొందేందుకు ఘనీ ఊదరగొడు తున్నారు. ఈనేపథ్యంలో ఘనీ సర్కార్ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొన్నది. ఓ వైపు సాయం అందిస్తున్నట్టు కపటనాటకాలాడుతూ మరో వైపు ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతున్న అమెరికా చర్యల పట్ల అఫ్ఘాన్ ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

జాత్యహంకార భావాలు లేవు : అమెరికా అధ్యక్షుడు ట్రంప్



వాషింగ్టన్: తనలో జాత్యహంకార భావాలు లేవని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. అమెరికాకు వస్తున్న వలసదారులను ఉద్దేశించి ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వివాదంపై తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో ట్రంప్.. తన వ్యాఖ్యలను సర్దిచెప్పుకునే ప్రయత్నం చేశారు. తానేమీ జాత్యహంకారిని కాదన్నారు. గతవారం ఓ సమావేశంలో పాల్గొన్న ట్రంప్.. వలసలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కొన్ని చెత్తదేశాల నుంచి అమెరికాకు వలస వస్తున్నారు. అలాంటి వారు తమకెందుకు అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ఆయా దేశాల నుంచే కాకుండా అనేక దేశాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. రాజకీయ ప్రత్యర్థులు ఆయనను జాత్యహంకారి అంటూ విమర్శించారు. ఈ నేపథ్యంలో ఫ్లోరిడాలోని గోల్ఫ్‌కోర్స్‌కు వచ్చిన ట్రంప్‌ను సదరు విమర్శలపై మీడియా ప్రశ్నించగా.. 'లేదు లేదు నేనేం జాత్యహంకారిని కాదు. మీరు ఇంటర్వ్యూ చేసిన వ్యక్తులందరికంటే నాకే జాతి విద్వేషం చాలా తక్కువ. ఆ విషయాన్ని నేను స్పష్టంగా చెప్పగలను' అని సమాధానమిచ్చారు.

కేంద్రం చంపాలనుకుంటోంది

ఎన్‌కౌంటర్ చేయాలని కుట్ర:ప్రవీణ్ తొగాడియా



న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం తనను చంపాలని చూస్తోందని వీహెచ్‌పీ నేత ప్రవీణ్ తొగాడియా సంచలన ఆరోపణలు చేశారు. కేంద్రప్రభుత్వం తనను నిత్యం వేధిస్తోందని తొగాడియా ఆరోపించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ 'కేంద్ర ప్రభుత్వం నా గొంతు నొక్కాలని ప్రయత్నిస్తోంది. గుజరాత్, రాజస్థాన్ పోలీసులు నన్ను నిరంతరం వెంటాడుతున్నారు. నాపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. రాజస్థాన్ పోలీసులు నన్ను అరెస్ట్ చేయడానికే ఇక్కడకు వచ్చారు. వారు నన్ను ఎన్‌కౌంటర్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం ఉందని ఆరోపించారు. అందుకే వీహెచ్‌పీ కార్యాలయం నుంచి అద శ్యమయ్యానని తెలిపారు. హిందూత్వ ఐక్యత గురించి ప్రయత్నిస్తున్నందునే నా గొంతు నొక్కాలని చూసున్నారని ఆరోపించారు. నా ఆరోగ్యం కుదుటపడగానే గుజరాత్ పోలీసులకు లొంగిపోతానని' ప్రవీణ్ తొగాడియా తెలిపారు. ఈ వివరాలు వెల్లడిస్తున్న సమయంలో తొగాడియా కంటతడి పెట్టుకున్నారు.

రెండోసారి ఎన్నిక ఇష్టంలేకనే..

తొగాడియా రెండోసారి ఎన్నికకావడం కొందరికి ఇష్టంలేదని, అందుకనే ఆయన టార్గెట్ చేశారని పటీదార్ ఆందోళన్ సమితి (పాస్) నేత హార్దిక్ పటేల్ తెలిపారు. ప్రవీణ్ తొగాడియా అదృశ్యం కావడం, ఆ తర్వాత స్పృహతప్పిన పరిస్థితిలో కనబడటంతో ఆయనను ఆస్పత్రిలో చేర్చడం సంచలనమైంది. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తొగాడియాను హార్దిక్ పరామర్శించారు. కాగా తొగాడియా ఆరోపణలపై జనంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎస్సారెస్పీ ఆయకట్టుకు ఎల్లంపల్లి నీరు

• రామగుండం మండలంలో 20,000 ఎకరాలకు సాగునీరు

• రూ. 75.74 కోట్లు మంజూరు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

పెద్దపల్లి జిల్లా రామగుండం మండలంలోని ఎస్సారెస్పీ ఆయకట్టు చివరి భూములకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి సాగునీరందించటానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సారెస్పీ డి 83 కాల్వ కింద ఉన్న ఈ భూములకు నీరందక పోవటంతో నీటిపారుదల ఈ ప్రత్యామ్నా ఏర్పాట్లు చేసింది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎస్సారెస్పీ కాల్వకు నీరు మళ్లించటం ద్వారా 20 వేల ఎకరాలకు సాగునీరందించటానికి ఇంజినీర్ ఇన్ చీఫ్ పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ లింక్‌కు అవసరమైన రూ. 75.74 కోట్లు మంజూరు చేసింది. ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి లభ్యత నిర్ధారించిన తర్వాత పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఆయకట్టును ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలోకి తెస్తున్నందువల్ల ఎస్సారెస్పీ నుంచి తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రామగుండం ప్రాంతానికి ఎల్లంపల్లి ద్వారా సాగునీరందించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటం పట్ల రామగుండం ఎమ్మెల్యే, ఈఎస్‌ఆర్‌టీసీ చైర్మన్ సోమారపు సత్యనారయణ ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ప్రగతి భవన్‌లో సీఎంను ఆయన కలిశారు.

గ్రామాల్లో చిచ్చు పెట్టేందుకే కొత్త చట్టం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో చిచ్చు పెట్టేందుకే ప్రభుత్వం కొత్త పంచాయతీరాజ్ చట్టం తీసుకొస్తోందని మాజీ ఎంపీ వి హనుమంతరావు అన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ కేసీఆర్‌కు గ్రామాలు, బీసీలు కనబడుతున్నారని మండిపడ్డారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో లబ్ది పొందేందుకు కేసీఆర్ ఓట్ల రాజకీయాలు చేస్తున్నారన్నారు. కేసీఆర్ కపట ప్రేమను బీసీలు అర్థం చేసుకోవాలన్నారు. పరోక్ష ఎన్నికలు పెట్టి గ్రామాలల్లో కేసీఆర్ చిచ్చు పెట్టేందుకు తేస్తున్న ఈ చట్టాన్ని అసెంబ్లీలో వ్యతిరేకిస్తామన్నారు.

బంగారు కాదు.. భ్రమల

• జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్

• రంగారెడ్డి జిల్లా అమనగల్‌లో తెలంగాణ అమరవీరుల ఆత్మగౌరవ సభ



కోనాపూర్ గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

నవతెలంగాణ-ఆమనగల్

దోపిడీ దొంగల పాలనలో బంగారు తెలంగాణ భ్రమల తెలంగాణగా మారిందని పొలిటికల్ జేఏసీ చెర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్ విమర్శించారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం కోనాపూర్ గ్రామంలో తెలంగాణ విద్యార్థి వికాస వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల ఆత్మగౌరవ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో ఎక్కడా లేని విధంగా 1,250 మంది విద్యార్థుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రం నేడు కుటుంబ పాలనలో బందీగా మారిందన్నారు. ఉద్యోగాల భర్తీ క్యాలెండర్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు.

రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. పారిశ్రామిక రంగంలో ఫార్మా కంపెనీలు కాకుండా వాతావరణ కాలుష్యం లేని చిన్న చిన్న కంపెనీలు స్థాపించి స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక 3,800 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషించడం సిగ్గుచేటని విమర్శించారు. సిద్దిపేట నియోజకవర్గంలోనే ఎక్కువ మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, భగత్‌సింగ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ సభ్యులు గోరేటి రమేష్, చిన్నికృష్ణ, పి.శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆట పాట కార్యక్రమం అందర్నీ అలరించింది. తెలంగాణ విద్యార్థి వికాస వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో జేఏసీ కోకన్వీనర్ ప్రొఫెసర్ పురుషోత్తం, అధికార ప్రతినిధి వెంకట్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ చల్మారెడ్డి, న్యాయవాది యాదిలాల్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంతృత్వ పాలన

• జైల్లో మందకృష్ణను పరామర్శించిన ఉత్తమ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు స్వేచ్ఛ, హక్కులు లేకుండా పోయాయని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో నిర్బంధ, నియంతత్వ పాలన సాగుతుందన్నారు. అందులో భాగంగా మందకృష్ణను అరెస్టు చేసి జైల్లో పెట్టిందన్నారు. వర్గీకరణ ఉద్యమంలో భారతి అనే మహిళ పోలీసుల తొక్కిసలాటలో మరణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం చంచల్‌గూడ జైల్లో ఉన్న మందకృష్ణను మాదిగను ఉత్తమ్, మాజీ మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మల్లు రవి పరామర్శించారు. అనంతరం ఉత్తమ్ విలేకరులతో మాట్లాడుతూ భారతి సంస్మరణ సభ జరిపితే మంద కష్ణను అరెస్టు చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రధాన మంత్రి వద్దకు అఖిలపక్షాన్ని తీసుకుపోతామని హామీ ఇచ్చినప్పటికి అమలు చేయలేదన్నారు. ఈ విషయాన్ని ప్రస్తావించినందుకే మందకృష్ణను అరెస్టు చేసి ప్రభుత్వం జైల్లో పెట్టిందన్నారు. ఆ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చాక ప్రజాస్వామ్య యుతంగా మంద కష్ణ హక్కుల సాధన కోసం తన ఇంట్లో దీక్ష చేస్తుంటే కూడ అరెస్టు చేసి జైల్లో పెట్టారని విమర్శించారు.

ఇక్కడ అణగారిన వర్గాలకు హక్కులు లేకుండా పోయిందన్నారు. నేరెళ్ళలో దళితులను ఇసుక మాఫియా అండతో పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్నారు.గత ఎన్నికల్లో కేసీఆర్‌పైన గజ్వేల్ పోటీ చేసిన టీడీపీ నేత ఒంటేరు ప్రతాప్‌రెడ్డిని కూడా చాలా వేధిస్తున్నారని చెప్పారు. ఉద్యోగం రాలేదని వెనుకబడిన విద్యార్థి మురళి ముదిరాజ్ ఆత్మహత్య చేసుకుంటే... ఆ కుటుంబాన్ని పరామర్శించినందుకు ఆయనను అరెస్టు చేసి హత్య కేసు నమోదు చేశారని ఆయన విమర్శించారు.

ఆశలు ఆవిరై.. అప్పులు భారమై..

• కార్గిల్‌లేక్‌లో గల్ఫ్ బాధితుని ఆత్మహత్య

నవతెలంగాణ- సిరిసిల్ల

అప్పులు చేసి గల్ఫ్‌కు వెళ్తే.. ఉపాధి దొరక్క ఇంటికి చేరిన కార్మికుడు అప్పుల బాధతో కార్గిల్‌లేక్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్ర శివారులో మంగళవారం జరిగింది. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన రేగుల ఆంజనేయులు(35) సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీలో పదేండ్లు హమాలీగా చేశాడు. వచ్చే ఆదాయంతో ఇల్లుగడవక అప్పులు తెచ్చాడు. ఇంటి నిర్మాణానికి మరికొంత బాకీ చేశాడు. వాటిని తీర్చేందుకు మరికొంత అప్పు చేసి గల్ఫ్ బాటపట్టాడు. అక్కడా ఉపాధి లేక పదిరోజులకే ఇంటిముఖం పట్టాడు. మొత్తంగా రూ.2లక్షలకు పైగా అప్పులు అయ్యాయి. వీటిని ఎలా తీర్చాలోనని ఆందోళనకు గురయ్యాడు. రెండు నెలలుగా ట్రాక్టర్‌పై దినసరి కూలీగా చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్న ఆంజనేయులుకు అప్పులవారి ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలో సంక్రాంతి పండుగకు అతని భార్య లత నాలుగు రోజుల కిందట కుమార్తె, కుమారున్ని తీసుకొని తల్లిగారింటికి వెళ్లింది. ఆ మర్నాడే ఇంటికి తాళం వేసి వెళ్లిన ఆంజనేయులు జాడ లేదు. మంగళవారం మధ్యాహ్నం స్థానికులు కార్గిల్‌లేక్‌లో ఆంజనేయులు మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి వచ్చారు. ఆంజనేయులు భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్డీఎస్‌పై త్రైపాక్షిక సమావేశం

• అనుకూలమైన తేదీలను తెలపండి : ఏపీ మంత్రి దేవినేనికి హరీశ్‌రావు లేఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాజోలిబండ మళ్లింపు పథకం (ఆర్డీఎస్) ఆధునీకరణ పనుల కోసం జరిగే త్రైపాక్షిక సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఏపీ జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక లేఖ రాశారు. ఈనెల 4వ తేదీన హైదరాబాద్ వచ్చిన కర్నాటక జలవనరుల శాఖ మంత్రితో ఆర్డీఎస్ పనుల గురించి చర్చించామని హరీశ్ తెలిపారు. మూడు రాష్ట్రాల రైతులకు సంబంధించిన ఆర్డీఎస్ ఆధునీకరణ సమస్యలను త్రైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కర్నాటక మంత్రి పాటిల్ సూచించారని లేఖలో పేర్కొన్నారు. ఆర్డీఎస్ అనకట్ట ఎత్తుపెంపు, ప్యాకేజీ 1 పనుల్లో ప్రతిష్ఠంభన ఏర్పడిన విషయాన్ని దేవినేని దృష్టికి తెచ్చారు. ఆర్డీఎస్‌పై ఉమ్మడి సమావేశం కోసం ఆగస్టు 4న ఒక లేఖ రాసిన విషయాన్ని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఆర్డీఎస్‌పై చర్చల కోసం కర్నాటక కూడా అంగీకరించినందున హైదరాబాద్‌లో జరిగే సమావేశం కోసం రెండు తేదీలను సూచించాలని కోరారు. ఆర్డీఎస్ వ్యవహారంపై రెండు రాష్ట్రాల చీఫ్ ఇంజినీర్ల స్థాయిలో జరిగిన సమావేశాలు ఫలప్రదం కాలేదని లేఖలో తెలిపారు.

ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించండి

ముఖ్యమంత్రికి రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ

• కుటుంబాలు మానసిక క్షోభను అనుభవిస్తున్నాయి

• ఎన్నికల హామీని అమలు చేయాలని విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

క్షణికావేశానికి లోనై ఎంతో మంది జైళ్లల్లో మగ్గుతున్నారని, ప్రాయశ్చిత్త పడుతున్నారని అటువంటి ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించాలని కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఖైదీల రాక కోసం వారి కుటుంబాలు ఎదురు చూస్తున్నాయని తెలిపారు. ఐదేండ్లు గడిచిన ఖైదీలు, వారి కుటుంబ సభ్యులు మానసిక క్షోభను అనుభవిస్తున్నారని తెలిపారు. ఈమేరకు మంగళవారం ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు ఆయన బహిరంగలేఖ రాశారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, గత ఎన్నికల సందర్భంగా ఐదేండ్లు శిక్ష పూర్తి చేసిన వారిని విడుదల చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రం ఏర్పడి నాలుగేండ్లు అవుతున్నా ఖైదీలకు ఇచ్చిన హామీని అమలు నిలబెట్టుకోకపోవడంతో అటు ఖైదీలు, ఇటు వారి రాకకోసం ఎదురుచూస్తున్న వారి కుటుంబీకులు కూడా మానసిక క్షోభను అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే ఐదేండ్ల శిక్షా కాలం పూర్తి చేసిన ఖైదీలను అందరినీ విడుదల చేస్తామని హామీ ఇచ్చి మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారి ప్రసాదించిన క్షమాభిక్ష వందలాది మంది ఖైదీలను నిరాశ పరిచిందన్నారు. గతంలో ఇచ్చిన మాటకు భిన్నంగా ఐదేండ్లు శిక్ష పూర్తి చేసిన వారిని కాకుండా 12 నుంచి 14 సంవత్సరాల వాస్తవ శిక్ష, కనీసం ఆరేండ్ల రిమిషన్ శిక్షతో కలిపి కనీసం 18 నుంచి 20 ఏండ్ల శిక్షా కాలాన్ని పూర్తి చేసిన వారికి మాత్రమే క్షమాభిక్ష పెట్టి విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కాలపరిమితి కారణంగా వందలాది ఖైదీలు విడుదలకు నోచుకోలేదని, దీంతో శిక్ష అనుభవిస్తున్న తమ వారు విడుదలవుతారని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న వందలాది కుటుంబాలకు నిరాశే మిగిలిందన్నారు. రాబోయే రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 26న ఖైదీలను విడుదల చేయడానికి అవసరమైన జీవోను విడుదల చేయాల్సిన బాధ్యత మీపై ఉందని తెలిపారు. గతంలో పెట్టిన షరతులు కాల పరిమితులతో కాకుండా ఉద్యమ సమయంలో ఖైదీలకు మీరు హామీ ఇచ్చిన విధంగా మహిళా ఖైదీలలో ఐదేండ్లు వాస్తవ శిక్షను పూర్తి చేసిన వారినీ, మగ ఖైదీలలో ఏడేండ్లు వాస్తవ శిక్షను, మూడేండ్ల రిమిషన్ శిక్షతో కలిపి పదేళ్ల శిక్షను పూర్తి చేసిన వారందరినీ విడుదల చేయడానికి జీవోను జారీ చేయాల్సిందిగా ఆయన కోరారు.

నవచిత్రం



రంగస్థలంలో చిట్టిబాబు సందడి

రామ్‌చరణ్ ప్రస్తుతం సుకుమార్ దర్శకత్వంలో 'రంగస్థలం' చిత్రంలో నటిస్తున్న విషయం విదితమే. సమంత కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్(సి.వి.ఎం) సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను ఈనెల 24న విడుదల చేస్తున్నట్టు చిత్రయూనిట్ సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. "శ్రీమంతుడు', 'జనతా గ్యారేజ్' వంటి సూపర్ హిట్ చిత్రాల తర్వాత మా బ్యానర్‌లో రూపొందుతున్న ఎగ్జైటింగ్ ప్రాజెక్ట్ ఇది. మెగా పవర్‌స్టార్ రామచరణ్ లుక్‌తో రిలీజ్ చేసిన సినిమా ఫస్ట్‌లుక్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. చిట్టిబాబు పాత్రలో రామ్‌చరణ్ మాస్ యాక్టింగ్, సమంత గ్లామర్ ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. విలక్షణమైన కథలు, క్యారెక్టరైజేషన్స్‌ను తెరపై ఆవిష్కరించడంలో సిద్ధహస్తుడైన దర్శకుడు సుకుమార్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆయన డైరెక్ట్ చేసిన సినిమాలే ఆయనేంటో నిరూపించాయి. మరోసారి తనదైన స్టయిల్‌లో విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమాను సుకుమార్ ఎంతో అద్భుతంగా తెరకెక్కించారు. రామ్‌చరణ్, సమంత ఇంతకముందెన్నడూ చేయని విభిన్నమైన పాత్రలు పోషిస్తున్నారు. దేవిశ్రీప్రసాద్ అద్భుతమైన మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, రత్నవేలు సినిమాటోగ్రఫీ సినిమాకు పెద్ద అసెట్ అవుతాయి. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తిచేసి సినిమాను వచ్చే ఏడాది మార్చి 30న సమ్మర్ స్పెషల్‌గా ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. ఇది మా బ్యానర్ వ్యాల్యూస్‌ను పెంచడమే కాకుండా మా సంస్థకు హ్యాట్రిక్ హిట్ అందించే సినిమా అవుతుంది' అని చిత్రబృందం తెలిపింది. జగపతిబాబు, ప్రకాష్‌రాజ్, సీనియర్ నరేష్,ఆది పినిశెట్టి, అనసూయ ఇతర పాత్రలు పోషించిన ఈచిత్రానికి ఎడిటింగ్: నవీన్‌నూలి.

మెగాస్టార్ ముఖ్యఅతిథిగా..



చిరంజీవి, నాగశౌర్య

నాగశౌర్య, రష్మిక మండన్న జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో శంకర ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి నిర్మిస్తున్న చిత్రం 'ఛలో'. ఐరా క్రియేషన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం.1గా తెరకెక్కుతున్న ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను ఈనెల 25న గ్రాండ్‌గా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ,'ఇప్పటివరకు విడుదల చేసిన ఫస్ట్‌లుక్, టీజర్, సాంగ్స్‌ను బాగా ఆదరించిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఇప్పటివరకు ఎవ్వరూ చేయని రీతిలో హైదరాబాద్‌లో ఈనెల 25న ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించబోతున్నాం. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా మెగాస్టార్ చిరంజీవి విచ్చేస్తున్నారు. షూటింగ్‌తో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ మా ఈవెంట్‌కు ఆయన రావడం చాలా సంతోషంగా ఉంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే చిత్రంగా ఫిబ్రవరి 2వ తేదీన విడుదల కాబోతోంది. మహతి స్వర సాగర్ అందించిన పాటలు అద్భుతంగా వచ్చాయి. సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ ఈచిత్రానికి ప్రధాన బలం. ఆయన అత్యద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. నాగశౌర్య పెర్‌ఫార్మెన్స్ చాలా కొత్తగా, ఎనర్జిటిక్‌గా ఉంటుంది. తన కెరీర్‌కి పర్‌ఫెక్ట్ కమర్షియల్ మూవీగా నిలుస్తుందని నమ్ముతున్నాం. హీరో, హీరోయిన్లు నాగశౌర్య, రష్మికల ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ సూపర్‌గా కుదిరింది. సినిమా బాగా వచ్చింది. మా ప్రయత్నాన్ని అందరూ ఆదరిస్తారని ఆశిస్తున్నాం' అని చెప్పారు. నరేష్, పోసాని, రఘుబాబు, వెన్నెలకిషోర్, మైమ్‌గోపి, ప్రవీణ్, సత్య, వైవా హర్ష వేణుగోపాలరావు, మెట్ట రాజేంద్రన్, ప్రగతి, స్వప్ని, సుదర్శన్, జీవా తదితరులు నటిస్తున్నారు.

సమ్మర్ స్పెషల్..



నందమూరి కళ్యాణ్‌రామ్, కాజల్ జంటగా ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఎం.ఎల్.ఏ' (మంచి లక్షణాలు ఉన్న అబ్బాయి). టి.జి.విశ్వప్రసాద్ సమర్పణలో బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్.ఎల్.పి, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఎల్.ఎల్.పి సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈచిత్ర టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ,' సంక్రాంతి నేపథ్యంలో విడుదల చేసిన టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఆద్యంతం వినోదభరితం సాగే ఈచిత్రం హీరో కళ్యాణ్‌రామ్ కెరీర్‌లో ఓ మంచి చిత్రం అవుతుంది. నూతన దర్శకుడు ఉపేంద్ర ఈ చిత్రాన్ని ఫుల్‌లెంగ్త్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. వేసవి హాలీడేస్ సందర్భంగా ఈచిత్రాన్ని మార్చిలో విడుదల చేస్తున్నాం' అని చెప్పారు. 'టోటల్ న్యూలుక్‌తో ఎంతో స్టయిలిష్‌గా కళ్యాణ్‌రామ్ ఈ చిత్రంలో కనిపిస్తారు. కథ, కథనం, క్యారెక్టరైజేషన్స్ టైటిల్, క్యాప్షన్‌కు జస్టిఫై చేసేలా ఉంటాయి. దర్శకుడిగా నాకు అవకాశం ఇచ్చిన నిర్మాతలకు కృతజ్ఞతలు' అని దర్శకుడు అన్నారు.

డార్క్ కామెడీ నేపథ్యంలో మిఠాయి..



రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి, విజయ్‌దేవరకొండ

రెడ్ యాంట్స్ పతాకంపై ప్రశాంత్‌కుమార్ స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'మిఠాయి'. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఈ చిత్రం లాంఛనంగా ప్రారంభమైంది. ప్రధాన తారాగణంపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి కథానాయకుడు విజయ్‌దేవరకొండ క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'ఈ సినిమాకు పని చేస్తున్న యూనిట్ అంతా నాకు 'పెళ్ళిచూపులు' చిత్రం దగ్గర్నుంచి పరిచయమే. ప్రశాంత్ నాకు మంచి స్నేహితుడు. డార్క్ కామెడీ సినిమా అనగానే చాలా క్యూరియస్‌గా వెయిట్ చేస్తున్నాను. టీమ్‌కు ఆల్ ద బెస్ట్' అని చెప్పారు. 'మంచి కథ, కచ్చితంగా ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసేలా ఈ చిత్రం ఉంటుంది' అని రాహుల్ రామకృష్ణ తెలిపారు. 'డార్క్ కామెడీ నేపథ్యంలో మన దగ్గర చాలా తక్కువ సినిమాలొచ్చాయి. తప్పకుండా అందరికీ నచ్చే సినిమా అవుతుంది' అని దర్శక, నిర్మాత ప్రశాంత్‌కుమార్ చెప్పారు. గాయత్రిగుప్తా, శ్వేతా వర్మ, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి, భూషణ్ కళ్యాణ్, కమల్ కామరాజు, రవివర్మ, అజయ్‌ఘోష్, విజయ్ మురార్ తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి సంగీతం : వివేక్‌సాగర్, సినిమాటోగ్రఫీ : సాకేత్ సౌరభ్, ఎడిటింగ్ : వీణు భూషణ్, కొరియోగ్రఫీ : అనీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : కృష్ణ వొడపల్లి.

ఊరంతా అనుకుంటున్నారు..



నవీన్ విజయ్ కృష్ణ

నవీన్ విజయ్ కృష్ణ కథానాయకుడిగా బాలాజీ సనాల దర్శకత్వంలో ఓ నూతన చిత్రం త్వరలోనే ప్రారంభం కానుంది. 'నందిని నర్సింగ్ హోమ్' చిత్రంతో హీరోగానే కాకుండా నటుడిగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్న నవీన్ విజయ్ కృష్ణ బర్త్‌డే (మంగళవారం) సందర్భంగా నిర్మాతలు నూతన చిత్రాన్ని ఎనౌన్స్ చేశారు. 'ఊరంతా అనుకుంటున్నారు' అనే టైటిల్‌తో రూపొందబోయే ఈచిత్ర షూటింగ్ కార్యక్రమాలు ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా నిర్మాతలు శ్రీహరి మంగళంపల్లి, ఎ.పద్మనాభరెడ్డి మాట్లాడుతూ, 'నవీన్ విజయ్ కృష్ణ ప్రస్తుతం తన తండ్రితో కలిసి 'విఠలాచార్య' చిత్రంలో నటిస్తున్నారు. ఆయనతో మేం ఈ నూతన చిత్రం నిర్మించడం ఆనందంగా ఉంది. ఆయన పుట్టినరోజుని పురస్కరించుకుని ఈచిత్రాన్ని ఎనౌన్స్ చేయటం ఓ విశేషమైతే, ఈ చిత్ర మోషన్ పోస్టర్‌ను ఆయన ఆప్తమిత్రుడు సుప్రీమ్ హీరో సాయిధరమ్ తేజ్ ట్విట్టర్‌లో విడుదల చేయటం మరో విశేషం. లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కబోయే ఈచిత్రకథకు అనుగుణంగానే 'ఊరంతా అనుకుంటున్నారు' అనే టైటిల్‌ను పెట్టడం జరిగింది. నటుడు, దర్శకుడు అవసరాల శ్రీనివాస్ ఇందులో ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈనెల 22 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అని తెలిపారు. రోవస్కైర్ ఎంటర్‌టైన్‌మెంట్స్, యు అండ్ ఐ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై రూపొందుతున్న ఈచిత్రంలో మేఘాచౌదరి, సోఫియా సింగ్, జయసుధ, అన్నపూర్ణమ్మ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కథ : శ్రీరమ్య, శ్రీ మంగళం, సంగీతం : కె.ఎం.రాధాకృష్ణ, సినిమాటోగ్రఫీ : జి.లింగబాబు, లైన్ ప్రొడ్యూసర్ : శ్రీరమ్య గోగుల, రచన-దర్శకత్వం : బాలాజీ సనాల.



క్లాస్ + మాస్..



నాని, అనుపమా పరమేశ్వరన్, రుక్సర్ మీర్ నాయకానాయికలుగా షైన్ స్క్రీన్స్ పతాకంపై మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కృష్ణార్జునయుద్ధం'. ఈ చిత్రంలో నాని ద్విపాత్రాభినయం చేస్తున్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యాన్ని పురస్కరించుకుని ఈ చిత్రంలోని కృష్ణార్జునల పాత్రల లుక్స్‌ను చిత్రయూనిట్ విడుదల చేసింది. 'కత్తులను తలపిస్తున్న కోరమీసాలు, పదునైన చూపులతో పక్కా మాస్ యాంగిల్‌లో ఉన్న నాని లుక్‌తోపాటు దీనికి పూర్తి విరుద్ధంగా క్లాస్ టచ్‌తో ఉన్న నాని లుక్‌కు అత్యద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. రెండు విభిన్నమైన క్యారెక్టరైజేషన్స్‌తో నాని అందరినీ అలరించడం ఖాయం. ఈ చిత్రంలో నానిని దర్శకుడు గాంధీ చాలా డిఫరెంట్‌గా ప్రజెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఫైనల్ షెడ్యూల్ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తవుతుంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 12న గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు దర్శక, నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు' అని చిత్రయూనిట్ తెలిపింది. ఈచిత్రానికి సమర్పణ: వెంకట్ బోయనపల్లి, సంగీతం : హిప్ హాప్ తమిళ, సినిమాటోగ్రఫీ : కార్తీక్ ఘట్టమనేని, ఆర్ట్ : సాహి సురేష్, నిర్మాతలు :సాహు గారపాటి, హరీష్ పెద్ది, దర్శకత్వం :మేర్లపాక గాంధీ.

అజయ్‌దేవగన్ సరసన..

టాలీవుడ్‌లోనే కాదు బాలీవుడ్‌లోనూ రకుల్‌ప్రీత్ సింగ్‌కు ఆఫర్ల మీద ఆఫర్లొస్తున్నాయి. ప్రస్తుతం నటిస్తున్న హిందీ చిత్రం 'అయ్యారీ' విడుదల కాకముందే రకుల్ బ్యాక్ టు బ్యాక్ రెండు అవకాశాలను అందిపుచ్చుకోవడం ఓ విశేషమైతే, ఈ రెండు ప్రాజెక్టులు కూడా బాలీవుడ్ స్టార్ హీరోలతో కావడం మరో విశేషం. ఇటీవల అక్షయ్‌కుమార్ సరసన ఓ చిత్రంలో నటించేందుకు అంగీకరించిన రకుల్ తాజాగా అజయ్‌దేవగన్‌కి జోడీగా నటించబోతోంది. ఈ నయా చిత్రం గురించి రచయిత, నిర్మాత రంజన్ మాట్లాడుతూ,'అర్బన్ రిలేషన్‌షిప్స్ నేపథ్యంలో ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నాం. ఇందులో అర్బన్ గర్ల్‌గా రకుల్ నటించనుంది. ఈ కథను ప్రిపేర్ చేసినప్పుడే కథానాయికగా రకుల్‌ని ఫిక్స్ అయ్యాం. ఎందుకంటే ఆమె నిజ జీవితంలోనూ ఈ కథలోని పాత్రకు అనుగుణంగా ఉంటుంది. ఆమె బాడీ లాంగ్వేజ్ పర్‌ఫెక్ట్‌గా ఈ పాత్రకు సూట్ అవుతుంది. ఈ పాత్రలో రకుల్‌ని తప్ప మరొకరిని ఊహించలేం. అజయ్‌గేవగన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈచిత్రానికి అకీవ్ ఆలీ దర్శకత్వం వహిస్తున్నారు. టీ-సిరీస్, లవ్‌ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈచిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 19న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పారు. రకుల్ ఈ చిత్రంతోపాటు తమిళంలో సూర్య సరసన ఓ చిత్రంలోను, కార్తీకి జోడీగా మరో చిత్రంలోనూ నటిస్తోంది. తెలుగులో మహేష్, వంశీపైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కబోయే చిత్రంతోపాటు నితిన్, శర్వానంద్ హీరోలుగా హరీష్‌శంకర్ దర్శకత్వంలో రూపొందబోయే 'దాగుడుమూతలు' చిత్రంలోనూ రకుల్ నటించనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి.

ప్రయోగాత్మకంగా ఎందరో మహానుభావులు..



సాయికృష్ణ, అనిషా

శ్రీ అన్నపూర్ణ క్రియేషన్స్ పతాకంపై తల్లాడా సాయికృష్ణ దర్శకత్వం వహిస్తూ నటిస్తున్న చిత్రం 'ఎందరో మహానుభావులు - ఇందులో కొందరు కేటుగాళ్లు'. తల్లాడా శ్రీనివాస్ నిర్మిస్తున్న ఈచిత్రానికి దర్శకుడు మారుతి వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ, 'ఇదొక ప్రయోగాత్మక చిత్రం. సమకాలీన పరిస్థితులు, ప్రేమ, రాజకీయం, హాస్యం వంటి తదితర అంశాల సమాహారంగా రూపొందే ఈచిత్రం ప్రేక్షకులకు ఓ మంచి అనుభూతినిస్తుంది. గోవా, అమలాపురం, విశాఖపట్నం, అరకు, ఖమ్మం, వరంగల్ వంటి తదితర ప్రదేశాల్లోని అందమైన లొకేషన్లలో చిత్రీకరణ జరిపాం. పాటలు, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. అలాగే ఫైట్స్ హైలైట్‌గా ఉంటాయి. షూటింగ్ పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ చిత్రానికి దర్శకుడు మారుతి వాయిస్ ఓవర్ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి త్వరలోనే ఈచిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని చెప్పారు. సాయికృష్ణ, అనిషా, షాలిని నాయకానాయికలుగా నటిస్తున్న ఈచిత్రంలో తనికెళ్ళభరణి, కిషోర్‌దాస్, సుధాకర్, మాయ కృష్ణ తదితరులు ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. ఈచిత్రానికి ఫైట్స్ : శ్యామ్, ఎడిటింగ్ : క్రాంతి, సంగీతం : సిద్ధార్థ్, కెమెరా : శివ, డాన్స్ : భరత్, మాటలు: కిరణ్ కోడూరి, ఎగ్జిక్యూటివ్ నిర్మాత : కుంచపర్తి సాయికుమార్.

రొమాంటిక్ ఎంటర్‌టైనర్



రవిశంకర్, అవంతిక శెట్టి, నిరూప్ భండారి

నిరూప్ భండారి, అవంతిక శెట్టి జంటగా అనూప్ భండారి దర్శకత్వంలో జాలీ హిట్స్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'రాజరథం'. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 16న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

ఈ సందర్భంగా దర్శకుడు, సంగీత దర్శకుడు అనూప్ భండారి మాట్లాడుతూ "రంగితరంగ' వంటి సూపర్‌హిట్ సినిమా తర్వాత నా దర్శకత్వంలో వస్తున్న చిత్రమిది. ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు సంగీతం కూడా సమకూర్చాను. ఇందులో మొత్తం ఏడు పాటలు ఉన్నాయి. ఈ పాటలకు రామజోగయ్యశాస్త్రి అత్యద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. ఈ పాటలకు తప్పనిసరిగా లైవ్ ఇన్‌స్ట్రుమెంట్స్‌నే వాడాల్సి ఉండటంతో వాటితోనే పాటల్ని రికార్డ్ చేశాం. చెన్నైలో విజిపి రికార్డింగ్ థియేటర్ చాలా ఫేమస్. పాటలకు దేవి ఆర్కెస్ట్రా ఎరేంజ్ చేశారు. స్యాక్స్ రాజా చాలా సీనియర్ మ్యూజిషియన్. ఆయన పాటలకు ఎరేంజ్‌మెంట్స్ చేశారు. రిథమ్స్‌ని ఇండియాలోనే బిగ్గెస్ట్ స్టూడియో అయిన యశ్‌రాజ్ స్టూడియోలో చేశాం. దీపేశ్‌వర్మ రెండు పాటలకు రిథమ్స్ ప్లే చేశారు. దాదాపు 60 మంది మ్యూజిషియన్స్‌తో పాటల్ని క్వాలిటీగా రికార్డ్ చేశాం. ఆడియోపరంగా, విజువల్‌గా పాటలు అందరికీ నచ్చుతాయి' అని చెప్పారు. నిర్మాతల్లో ఒకరైన అజయ్‌రెడ్డి గొల్లపల్లి మాట్లాడుతూ,"రంగితరంగ' వంటి సూపర్‌హిట్ చిత్రాన్ని రూపొందించిన టీమ్ తెలుగులో 'రాజరథం' చిత్రంతో పరిచయమవుతోంది. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో ఈ చిత్రాన్ని నిర్మించాం. అనూప్ భండారి ఎక్స్‌ట్రార్డినరీ టేకింగ్‌తో, బ్యూటిఫుల్ మ్యూజిక్‌తో సినిమాని అద్భుతంగా తీర్చిదిద్దారు. ఫిబ్రవరి 16న 'రాజరథం' చిత్రాన్ని చాలా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నాం' అని అన్నారు.

రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న 'రాజరథం' చిత్రంలో నిరూప్ భండారి, అవంతిక శెట్టి, పి.రవిశంకర్ ప్రధాన తారాగణంగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి మాటలు: అబ్బూరి రవి, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: అజనీష్ లోక్‌నాథ్, ఎడిటింగ్: శాంతకుమార్, సినిమాటోగ్రఫీ: విలియమ్ డేవిడ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుధాకర్ సాజ, నిర్మాణం: జాలీహిట్స్ టీమ్, అంజు వల్లభనేని, విషు దకప్పదారి, సతీష్ శాస్త్రి, అజయ్‌రెడ్డి గొల్లపల్లి, సంగీతం, స్క్రీన్‌ప్లే, రచన, దర్శకత్వం: అనూప్ భండారి.

సరికొత్త పాయింట్‌తో అనగనగా ఓ రాజకుమారుడు



నవీన్‌బాబు, అమృత

నవీన్‌బాబు, సంజన, అమృత హీరో హీరోయిన్లుగా శ్రీమతి రమాదేవి సమర్పణలో రామ్ సాయి గోకులం క్రియేషన్స్ పతాకంపై 'షాలిని' ఫేమ్ షెరాజ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'అనగనగా ఓ రాజకుమారుడు'. పి.వి.రాఘవులు నిర్మాత. హాస్యనటుడు సుమన్‌శెట్టి ప్రధాన పాత్రధారుడిగా నటిస్తున్న ఈచిత్రానికి సంబంధించి తొలి షెడ్యూల్ ఇటీవల గోవాలో పూర్తయ్యింది. ఈ సందర్భంగా దర్శకుడు ఈచిత్రం గురించి మాట్లాడుతూ,'లవ్, కామెడీ అండ్ థ్రిల్లర్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. గోవా, మహారాష్ట్రలోని కొన్ని అందమైన ప్రదేశాల్లో జరిపిన చిత్రీకరణతో తొలి షెడ్యూల్ పూర్తయ్యింది. గోవా నేపథ్యంలో సాగే సరికొత్త పాయింట్‌తో రూపొందుతున్న ఈ చిత్రకథకు తగ్గట్టు నాయకానాయికలు బాగా సెట్ అయ్యారు. కామెడీతోపాటు థ్రిల్లర్ అంశాలు ఆద్యంతం ఆసక్తి కలిగిస్తాయి. త్వరలోనే హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభిస్తాం. ఈ షెడ్యూల్‌లోనే పాటలతోపాటు మిగిలిన సన్నివేశాలను చిత్రీకరిస్తాం. క్వాలిటీగా సినిమా రావడానికి నిర్మాత బాగా సపోర్ట్ చేస్తున్నారు' అని చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా, ఎడిటింగ్ : ఏకరీ లక్కీ, పాటలు : బాషాశ్రీ, సమర్పణ: రమాదేవి, సంగీతం, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం : షెరాజ్.

డిజిటలైజేషన్‌కు యువత దూరం

ఇంటర్నెట్ వాడుతున్నది 28శాతం మందే

- మొబైల్ వాడకం 72.6 శాతం..కంప్యూటర్ 25శాతం
- ఇంటర్నేట్ బ్యాంకింగ్ చేసేది 4.6 శాతమే
- టీవీలు చూసేది 85శాతం, పేపర్లు చదివేది 58శాతం
- ఇదీ 14-18 ఏండ్ల విద్యార్థుల స్థితి
- 'ప్రథమ్' సర్వేలో వెల్లడి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

డిజిటల్ రంగంలో దేశం ముందుకు వెళ్తుందంటూ పాలకులు ఊదర గొడుతున్నా...వాస్తవాలు మాత్రం దీనికి విరుద్ధంగా ఉన్నాయి. వాస్తవానికి నేటికీ దేశంలో ఇంటర్నేట్, కంప్యూటర్ వాడనీ యువతే ఎక్కువగా ఉన్నది. ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ వార్షిక విద్యాస్థితి (అసర్-2017) నివేదిక మంగళవారం ఢిల్లీలో విడుదల చేసింది. 2017లో 14 నుంచి 18 ఏండ్ల వయస్సున్న విద్యార్థుల్లో సర్వే నిర్వహించింది. దీనిలో 63.7 శాతం మంది ఇప్పటికీ ఇంటర్నెట్, 59.3శాతం మంది కంప్యూటరూ వాడలేదనీ సర్వేలో తేలింది. అయితే మొబైల్ వాడని వారు మాత్రం 17.6 శాతమే ఉండటం గమనార్హం. దేశవ్యాప్తంగా 24రాష్ట్రాల్లోని 28 జిల్లాల్లోని 1641 గ్రామాల్లో ప్రథమ్ సర్వే నిర్వహించింది. తెలంగాణ రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లాను ఎంచుకున్నారు. సర్వేలో 30వేలకు పైగా ఆరోతరగతి నుంచి డిగ్రీ స్థాయి విద్యార్థులు పాల్గొన్నారు.


ఫైల్

ఫోన్ ఎక్కువ.. కంప్యూటర్ తక్కువ..

14-18 ఏండ్ల వయస్సున్న యువత 72.6శాతం మంది మొబైల్ వాడుతున్నారు. 17.6శాతం మంది మొబైల్ మొత్తానికే వాడకపోగా, 9.8శాతం మంది అప్పుడప్పుడు వినియోగిస్తున్నారు. కాగా 28శాతం మంది మాత్రమే ఇంటర్నేట్ వినియోగిస్తుండగా, 8.3 శాతం అప్పుడప్పుడు వాడుతున్నారు. 25.5శాతం యువత మాత్రమే కంప్యూటర్‌ను వాడుతోంది. 15.1 శాతం ఎప్పుడో ఒకసారి దీన్ని వినియోగిస్తున్నారు. డిజిటలైజేషన్ అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నా...వాస్తవాలు దీనికి భిన్నంగా కనిపిస్తున్నాయి. బ్యాంకు ఖాతాలు 74.3 శాతం మందికి ఉండగా, వారిలో ఏటీఎం కార్డు ఉన్నది కేవలం 15.7 శాతం మంది మాత్రమే. అయితే ఇంటర్నేట్ బ్యాంకింగ్ చేసేది కేవలం 4.6 శాతమే.

ప్రభుత్వ ఉద్యోగం వద్దు..!

భవిష్యత్‌లో ఏం కావాలనుకుంటున్నారు..అనే ప్రశ్నకు ఇంజినీర్, డాక్టర్, టీచర్ అని వివిధ వృత్తుల గురించి వివరించగా, వ్యవసాయం చేస్తామని కేవలం 1.2 శాతం మాత్రమే చెప్పారు. బాలురుల్లో ఆర్మీ జవాన్ అవుతామనీ 17.6 శాతం, ఇంజినీర్ అవుతామని 11.6శాతం తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. కాగా బాలికలు మాత్రం 25.1 శాతం మంది టీచర్ కావాలని ఉందనీ, 18.1 శాతం డాక్టర్, నర్స్ అవుతామని చెప్పారు. కాగా ప్రభుత్వ ఉద్యోగి కావాలనుకునే వారిలో బాలురు 12.8శాతం, 9.3 శాతం బాలికలు మాత్రమే సర్కారీ ఉద్యోగం కావాలని కోరుకున్నారు. 40 శాతం యువత వారు ఎంచుకున్న లక్ష్యానికి ఆదర్శం ఎవ్వరూ లేరని చెప్పగా, కొద్ది మాత్రమే వారి తల్లిదండ్రులని చెప్పారు.

మాతృభాషలోనూ అంతంతే..!

మాతృభాషలోనూ చదవలేని స్థితిలో 14-18 ఏండ్ల వారూ ఉండటం ఆందోళన కలిగించే అంశం. 25శాతం వారివారి మాతృభాషలూ సరిగా చదవలేకపోతున్నారని సర్వేలో తేలింది. 14 ఏండ్ల వారు 53శాతం మంది మాత్రమే ఇంగ్లీష్‌లో సింపుల్ పదాలను చదవుతుండగా, 18 ఏండ్ల వారులో 60శాతం చదువుతున్నారు. చదవగలిగే వారిలో 79శాతం మంది దానికి అర్థం కూడా చెబుతున్నారు. అయితే చదవడం, రాయడంలో కొంత మార్పు వచ్చినా, లెక్కాల విషయంలో మాత్రం మార్పు రావడం లేదు. 43శాతం మంది మాత్రమే భాగాహారాలు, తీసివేతలు 22.6 శాతం మంది చేస్తుండగా, నెంబర్లను(10 నుంచి 99 వరకు) 34.3 శాతం మంది మాత్రమే గుర్తిస్తున్నారు.

టీవీ తర్వాతే పత్రికలు

టీవీలు చూసే వారితో పాటు పత్రికలు చదివేందుకు యువత కాస్త ఉత్సాహం చూపుతున్నది. 85 శాతం యువత టీవీలు చూస్తుండగా, 45.8 శాతం మంది రేడియోలు(ఎఫ్ఎం..) వింటున్నారు. కాగా 57.8 శాతం మంది పత్రికలు చదువుతున్నారు. 13.1 శాతం అప్పుడప్పుడు చదువుతుండగా, 29.1 శాతం మంది అసలే పేపర్ చదవడం లేదని సర్వేలో తేలింది. కాగా టీవీలు మొత్తానికే చూడని వారు 6.8 శాతం, అప్పుడప్పుడు చూసే వారు 8.3 శాతం ఉన్నారు. రేడియో వినని వారు 35.5 శాతం మంది ఉండగా, 18.9 శాతం అప్పుడప్పుడు వింటున్నారు.

రోజువారి పనుల్లో..

పనులు..	యూత్	బాలురు	బాలికలు
డబ్బులు లెక్కించడం	75.7	82.4	69.9
బరువులు లెక్కించడం	55.7	67.5	45.4
గంటలు,నిమిషాల లెక్క	59.3	66.4	53.1
కొలతలు గుర్తించడం			
పని	యూత్	బాలురు	బాలికలు
చిన్న కొలతలు	85.9	89.2	83.1
పెద్ద కొలతలు	39.7	47.9	32.5

నాగోబా జాతర ఆరంభం



(మొదటిపేజీ తరువాయి)

రోజులపాటు కొనసాగనుంది. అంతకుముందు మెస్రం వంశీయులు నాగోబా ఆలయం వెనుక పూజకు తెచ్చిన కొత్త కుండలకు పటేల్ వెంకట్‌రావు ఆధ్వర్యంలో పూజలు చేసి భద్రపరిచారు. ఆలయాన్ని మంచినీటితో కడిగి శుభ్రపరిచారు. వట వృక్షం వద్ద బస చేసిన మెస్రం వంశీయులు తెల్లవస్త్రాన్ని ధరించి మెస్రం కటోట(పూజరి) హన్మంత్, పటేల్ వెంకట్‌రావు, మెస్రం కోసు, మెస్రం తిరుపతి పూజకు తెచ్చిన పవిత్ర కలశాన్ని కట్టుకొని భాజాభజంత్రీల మధ్య కాగడాలతో ఆలయంలోకి ప్రవేశించారు. వారి సంప్రదాయం ప్రకారం రాగి చెంబులో పాలు తెచ్చి తెల్లటి వస్త్రాన్ని కప్పి ఉంచారు. తెల్లటి వస్త్రం పైకి కదిలే వరకు పూజలు చేస్తారు. తెల్లటి వస్త్రం కదిలితే పూజ సఫలమైనట్టు మెస్రం వంశీయులు భావిస్తారు. ఇటీవల వివాహాలు చేసుకున్న జంటలు నాగోబా ఆవరణలో తయారు చేసిన పుట్టను బోధన్ సబ్‌కలెక్టర్ అనురాగ్ జయంత్, ట్రైనీ కలెక్టర్ డాక్టర్ గోపి తిలకించారు. జాతరలో భాగంగా 19న దర్బార్ నిర్వహించనున్నారు. నిజాం సర్కార్ హయాంలో గిరిజనుల స్థితిగతులపై అధ్యయనం చేయడానికి మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్‌డార్ఫ్‌ను నియమించింది. డార్ఫ్ తన అధ్యయన నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. అప్పటి నుంచి దర్బార్ కొనసాగుతూనే ఉంది. జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలేకాక మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి జనం తరలివస్తారు.

హజ్ సబ్సిడీ రద్దు



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం హజ్ యాత్రికులకు సంబంధించి వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. హజ్ యాత్రికులకు ఇచ్చే సబ్సిడీని ఎత్తివేస్తున్నట్టు ప్రకటించింది. కానీ 2012లో సుప్రీం కోర్టు ఏమన్నదంటే.. హజ్ యాత్రికులకు ఇచ్చే సబ్సిడీని దశాబ్దకాలం పాటు గడువిచ్చింది. గత ఐదేండ్లలో సబ్సిడీపై కోత పెడుతూ...ప్రస్తుతం 25 శాతం మాత్రమే మిగిలింది. 2006లో విదేశీ మంత్రిత్వశాఖ, పర్యాటకశాఖలతో ఏర్పడిన పార్లమెంటరీ స్థాయిసంఘం హజ్ సబ్సిడీలను ఒక నిర్ణీత సమయంలో సబ్సిడీని రద్దు చేయాలని సిఫారసు చేసింది. ఆ తర్వాత సుప్రీం కోర్టు కూడా సబ్సిడీపై పదేండ్ల పాటు వ్యవధిని పెట్టాలని అప్పటి కేంద్రప్రభుత్వానికి ఆదేశించింది. దాంతో అప్పటి యూపీఏ సర్కారు వెనక్కితగ్గింది. 2012 మైనార్టీ సంక్షేమశాఖ రిపోర్టుల ప్రకారం 836.55 కోట్లు హజ్ సబ్సిడీ అందజేసింది. ఆ తర్వాత ఈ సబ్సిడీని భారమంటూ కోత పెట్టడం మొదలుపెట్టింది. 2013లో ఏకంగా 150 కోట్ల మేర సబ్సిడీపై కోతపెట్టింది. అపుడు 680.03కోట్లు సబ్సిడీ ఇచ్చింది. 2014లో ఇక మోడీ అధికారంలోని వచ్చాక మరో వంద కోట్లను తగ్గించారు. అపుడు సబ్సిడ 577.07 కోట్లకు చేరింది. 2015లో మరో 50 కోట్లకు కోత పెట్టారు. 529.51 కోట్ల మేర సబ్సిడీ అందజేశారు. 2016లో మాత్రం కోతలు పెడుతూ 405 కోట్లకు చేర్చారు. ఇలా దశలవారీగా కోత పెడుతూ హజ్ యాత్రికులకు ఇచ్చే సబ్సిడీ సగానికి చేరింది. 2017లో కేవలం 250కోట్లు మాత్రమే సబ్సిడీ ఇచ్చారు.ఈ ఏడాది(2018)లో సబ్సిడీ ఇవ్వమంటూ చేతులెత్తేసింది. వాస్తవానికి 2022లో సంపూర్ణంగా సబ్సిడీ ఎత్తివేయాల్సి ఉండగా, మోడీ సర్కారు ఆఘమేఘాలమీద సబ్సిడీని పూర్తిగా రద్దు చేసింది.

మోడీ సర్కారు అంటున్నదేంటీ..?

సబ్సిడీ రాయితీ మొత్తాన్ని ముస్లిం బాలికల విద్యకు ఉపయోగించనున్నట్టు మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ చెప్పారు. మైనారిటీలకు సాధికారత కల్పించడంలో భాగంగానే ఈ చర్య తీసుకున్నామన్నారు. ఈ రాయితీ వల్ల ముస్లిం ప్రజలకు ఎటువంటి ప్రయోజనం చేకూరడం లేదని ఆయన చెప్పారు. సబ్సిడీని ఎత్తివేస్తున్నప్పటికీ ఈ ఏడాది రికార్డు స్థాయిలో 1.75 లక్షల మంది హజ్ యాత్రకు వెళ్తున్నారని తెలిపారు. సముద్ర మార్గం ద్వారా కూడా యాత్రికులు హజ్ చేరుకునేందుకు సౌదీ ప్రభుత్వం అంగీకరించిందని కేంద్ర మంత్రి తెలిపారు. 45 ఏండ్ల కన్నా ఎక్కువ వయసుగల మహిళలు కనీసం నలుగురు బందంగా ఏర్పడితే, వారితోపాటు పురుష సహచరుడు లేకపోయినా హజ్ యాత్ర చేసేందుకు అనుమతిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. స్వల్ప వ్యవధిలోనే. సబ్సిడీని ఎత్తివేస్తూ ప్రకటనను చేయడం గమనార్హం. ప్రస్తుతమున్న హజ్ పాలసీని అధ్యయనం చేసి, 2018-22 వరకూ కొత్త హజ్ పాలసీ రూపకల్పన సలహాలు ఇవ్వాల్సిందిగా కోరుతూ ఒక కమిటీని కేంద్ర ప్రభుత్వం గతేడాది ఏర్పాటుచేసింది. ఎయిర్ ఇండియా విమానచార్జీల్లో డిస్కౌంట్‌గా హజ్ యాత్రికులకు ప్రభుత్వం సబ్సిడీని ఇస్తూ వస్తోంది.

మళ్లీ పెట్రోలు, డీజిల్ వాత

- 2014 తర్వాత గరిష్ట స్థాయికి ధరలు



న్యూఢిల్లీ : పెట్రోలు, డీజిల్ ధరలు మళ్లీ పెరిగాయి. హైదరాబాదులో మంగళవారంనాడు లీటర్ పెట్రోల్ పది పైసలు పెరిగి రూ.75.47కు, లీటర్ డీజిల్ 15 పైసలు రూ.67.23కు చేరుకుంది. గతేడాది జూన్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్రం రోజువారీ పద్ధతిలో సమీక్షిస్తున్నది. 2014 తర్వాత మళ్లీ ఆనాటి ధరలకు పెట్రోలు చేరటం ఇదే తొలిసారి. ఢిల్లీ, కోల్‌కతా, ముంబయి, చెన్నై నగరాల్లో పెట్రోల్ ధర 9 పైసలు పెరిగింది. అలాగే దేశంలోని అన్ని నగరాల్లో మంగళవారంనాడు డీజిల్ ధరలు 16 పైసలు పెరిగింది. దేశ రాజధానిలో లీటర్ డీజిల్ ధర 61.88 కాగా, లీటర్ పెట్రోల్ రూ.71.27కు పెరిగింది. ముంబయిలో లీ.పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా రూ.79.15కు, 65.90కు చేరుకున్నాయి. మొత్తం దేశవ్యాప్తంగా ఒక్క నెలలోనే డీజిల్ రూ.3.4పెరిగింది. ఇక పెట్రోలు రూ.2.09 పెరగడం గమనార్హం.

అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడమే పెట్రోలు ధరలు పెరగడానికి కారణమైందని కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడం ద్వారా సామాన్యుడికి కొంత ఊరట కలిగించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ విషయమై చమురశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ప్రశ్నించగా, 'వ్యాట్ తగ్గించమని రాష్ట్రాలను ఎందుకు అడగరు?' అంటూ ఎదురు ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం గతేడాది అక్టోబరులో ఎక్సైజ్ డ్యూటీని తగ్గించిందని, ఈసారి రాష్ట్రాలను వ్యాట్‌ను తగ్గించాలని కోరుతున్నట్టు తెలిపారు. మరోపక్క ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ రాష్ట్రాలకు లేఖలు కూడా రాశారు.

మహిళలకు..అందని పౌష్టికం

(మొదటిపేజీ తరువాయి)

మాంసం, చేపలు వంటివి ఆహారంలో తీసుకోగలుగుతున్నారు. పౌష్టికాహారాన్ని పక్కనబెడితే.. రేషన్ షాపుల ద్వారా పేదలకు ఇచ్చే ఆహార ధాన్యాలను కూడా మోడీ సర్కార్ అందకుండా చేస్తున్నది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ ఆధార్ లింకులు లేవనో.. మరొకటనో సాకు చెప్పి రేషన్ సరుకులను నిలిపివేస్తున్నారు. దీంతో ఆ రాష్ట్రాల్లో ఆకలిచావుల ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చడంతో చేద్దామంటే పనిలేక... కనీసం ఒకపూట కూడా భోజనం లేక.. అల్లాడుతున్న పేదల దీనవస్థలు అనేకం బయటపడ్డాయి. గ్రామాల్లో పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. అన్నదాతల దగ్గర నుంచి మొదలు... పేదలు ఆత్మహత్యల ఘటనలూ అనేకం వెలుగులోకి వచ్చాయి. గారడి మాటలకు ఇకనైనా స్వస్తి పలికి... పేద ప్రజలను ఆదుకునే చర్యలకు ఇకనైనా శ్రీకారం చుట్టాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మార్చి 12న అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

పంచాయతీలకు రూ.5 లక్షలు, ఆపై జనాభాగల పంచాయతీలకు రూ.10 లక్షలు కేటాయిస్తామన్నారు.ఈ విధంగా పంచాయతీల స్థాయినిబట్టి రూ.15 నుంచి రూ.25 లక్షల వరకు రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుందని వివరించారు. గ్రామాల్లో వందశాతం పన్నులను వసూలు చేస్తామని తెలిపారు. జాతీయ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకుంటామని.. ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో ఆస్తులను సమకూర్చుకుంటామని సీఎం ఈ సందర్భంగా వివరించారు.

సాగునీటి ప్రాజెక్టులతో శాశ్వత ప్రయోజనం

సీఎం కేసీఆర్

- కాళేశ్వరం ప్రాజెక్టుపై సమీక్ష

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రానికి శాశ్వత ప్రయోజనం కలిగే రీతిలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం సాగుతున్నదని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పురోగతిపై సోమవారం ప్రగతి భవన్‌లో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కాళేశ్వరం తరహాలోనే కాల్వలు, చెక్ డ్యాంల నిర్మాణం జరగాలని, చెరువులను నింపుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. పూర్తిగా అధ్యయనం చేసి పనులు చేపట్టాలన్నారు. తెలంగాణా కోసం ఒక ఉజ్వలమైన భవిష్యత్ రూపకల్పనలో భాగమే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణమని ఆయన అభివర్ణించారు. సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అప్పర్ మానేరు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎండిపోయే అవకాశం లేదనీ, అప్పర్ మానేరు నుండి లోయర్ మానేరు ఒక జీవధార లాంటిదనీ, ఇప్పుడు జరుగుతున్న పనులు పురోగతి సాధిస్తున్న కొద్దీ కరీంనగర్ జిల్లా దక్షిణ ప్రాంతం ఎప్పుడూ లైవ్ గా ఉంటుందని అన్నారు. అలాగే కాకతీయ కాలువ మరో జీవధార అనీ, గోదావరి మీద కడుతున్న బారేజీల వల్ల ఉత్తర కరీంనగర్ కూడా ఒక జీవధార లాగా ఉంటుందన్నారు. ఈ జిల్లాలోనే వివిధ రకాల సాగునీరు అందడం వలన నాలుగు జీవధారలు ఎల్లప్పుడూ వుంటాయనీ సీఎం అన్నారు. దీనివల్ల నిత్యం పచ్చదనంతో పాటు, హరితహారానికి కూడా మేలు జరుగుతుందన్నారు. అలాగే సింగూర్ ఒక్క సారి నిండితే ఐదారు సంవత్సరాల దాకా ఇబ్బంది ఉండదనీ, సింగూర్ నుండి కొండపోచమ్మ , మల్లన్న సాగర్ వరకూ కూడా జీవదారేననీ, దీని వల్ల మెదక్ జిల్లాకున్న మెతుకుసీమ అనే పేరు సార్థకమవుతుందని చెప్పారు. కరువు ప్రాంతాలు సస్యశ్యామలం కావడానికి ఎంత త్వరగా వీలుంటే అంత త్వరగా సాగునీరు ఇవ్వాలనీ, వచ్చిన నీళ్ల వచ్చిన వెంటనే చెరువులు నింపుకుంటూ పోవాలని సూచించారు. వచ్చే వర్షాకాలం నాటికి పూర్తి ఉపయోగంలోకి రావాలంటే చెరువులు నింపడం తప్పనిసరి అని ఆయన అన్నారు. మిడ్ మానేరు నుండి నీళ్ళతో చెరువులు, చెక్ డాంలు నిమ్పాలన్నారు. అనంతగిరి, రంగానాయక్ సాగర్ లోకి ఎత్తిపోసే పంప్ హౌజ్ పనులను కూడా వేగవంతం చేయాలని సీఎం చెప్పారు.మల్లన్న సాగర్ కింద వుండే కాల్వల పనులను కూడా ముఖ్యమంత్రి సమీక్షించారు. మల్లన్న సాగర్ నుండి సింగూర్ కు గ్రావిటీ ద్వారానే నీళ్ళు పోవాలన్నారు. గ్రావిటీ మార్గంలో ఎక్కువ ప్రాంతం సాగులోకి వచ్చే అవకాశం వుందన్నారు. జాతీయ రహదారి నుండి మెదక్ పట్టణం వరకూ, అలాగే గజ్వేల్, దుబ్బాక, సిద్ధిపేట నియోజక వర్గాలలో ఒక్క కుంట భూమి కూడా మిగలకుండా సాగులోకి రావాలని సీఎం చెప్పారు. గంధమల, బస్వాపూర్ రిజర్వాయర్ల పనుల పురోగతిని కూడా ముఖ్యమంత్రి అదికారులను అడిగి తెలుసుకున్నారు.మొత్తం తెలంగాణాలో వున్న మంజీరా, దుందుభి, కనగల్ వాగు, మూసీ, పాకాల లాంటి ఉపనదుల మీద చెక్ డాంల నిర్మాణం జరగాలని సీఎం అన్నారు.

రాష్ట్రంలో మరో నాలుగు వేల పంచాయతీలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వర్తించాల్సిన పనులు, పురపాలక చట్టం సవరణ తదితరాంశాలపై సీఎం ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చాలా విషయాల్లో విజయం సాధించిందని తెలిపారు. ఇదే సమయంలో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచలేకపోయామని చెప్పారు. ఈ నేపథ్యంలో 'పనిచేసే పంచాయతీరాజ్ వ్యవస్థ'ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్‌ను ప్రత్యక్షంగా ఎన్నికోవాలా? లేక పరోక్షంగానా? అనే అంశంపై కూడా చర్చిస్తున్నామని అన్నారు. ఒకప్పుడు జిల్లా కలెక్టర్లకు పంచాయతీల మీద ఎన్నో అధికారాలు ఉండేవి.. ఇప్పుడు వాటి మీద నియంత్రణ లేకుండా పోయిందని చెప్పారు. ఈ నిస్సహాయ స్థితి నుంచి బయటపడాలని అన్నారు. ఇదే సమయంలో మున్సిపల్ చట్టానికి కూడా సవరణలు చేస్తామని సీఎం తెలిపారు.

మార్చి 11న పాస్ పుస్తకాల పంపిణీ...

మార్చి 11న రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఒకేసారి పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాలని సీఎం ఈ సందర్భంగా కలెక్టర్లను ఆదేశించారు. ఇందుకోసం ప్రతిగ్రామంలో ఒక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రుల దగ్గర్నుంచి మండలాధ్యక్షుల వరకు అందర్నీ భాగస్వాములను చేయాలని ఆదేశించారు. ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేయటం ద్వారా పాస్ పుస్తకాలను గ్రామాలకు చేర్చాలని చెప్పారు.

జిల్లా మొత్తానికి ఒకే రెవెన్యూ కోర్టు...

భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా 93 శాతం భూమి, 92 శాతం ఖాతాలు వివాద రహితమైనవేనన్న విషయం తేలిందని సీఎం అన్నారు. ఈ క్రమంలో వివాదాలు చాలా తక్కువ శాతంలో మాత్రమే ఉన్నాయని వివరించారు. ఆర్డీవో, జాయింట్ కలెక్టర్లు, కలెక్టర్లు నిర్వహించే రెవెన్యూ కోర్టుల స్థానంలో జిల్లా మొత్తానికి ఒకే ఒక రెవెన్యూ కోర్టు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిబ్రవరి చివరినాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. మార్చి 12 నుంచి రెవెన్యూ రికార్డుల నిర్వహణలో విప్లవాత్మకమైన మార్పులొస్తాయని తెలిపారు. ఈ క్రమంలో ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ శాఖ ఉండాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో రోజువారీగా రెండున్నర వేల నుంచి నాలుగు వేల వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయని.. వీటిలో 60 శాతం పట్టణ ప్రాంతాల్లో, మిగిలినవి గ్రామీణ ప్రాంతాల్లో ఉంటాయని చెప్పారు. ఇప్పుడున్న 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అదనంగా 443 మండల కార్యాలయాలు కూడా రిజిస్ట్రేషన్ వ్యవహారాలను చూస్తుంటాయని వివరించారు. ఈ ప్రకారంగా మొత్తం 584 మండలాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాలుంటాయని తెలిపారు. దీంతో రిజిస్ట్రేషన్ తర్వాత మ్యుటేషన్‌కు నెలలకొద్ది సమయం వేచి చూడాల్సిన అవసరం ఇకపై ఉండబోదని సీఎం చెప్పారు. దీంతోపాటు 'కోర్ బ్యాంకింగ్ నెట్‌వర్క్' విధానాన్ని కూడా ప్రవేశపెడుతున్నామని అన్నారు. తద్వారా కొనుగోలు, అమ్మకందార్ల పాస్ పుస్తకాల్లో తక్షణమే ఎంట్రీలు, మార్పులు, చేర్పులు జరిగిపోతాయని తెలిపారు. ఇలాంటి అంశాలన్నింటినీ 'ధరణి వెబ్‌సైట్'లో పొందుపరుస్తామని అన్నారు. ఈ వెబ్‌సైట్‌ను ప్రపంచంలో ఏ మూలనుంచైనా చూడొచ్చని తెలిపారు. భూ రికార్డుల ప్రక్షాళన పూర్తయిన నాటి నుంచి మార్చి 12 వరకు చోటు చేసుకోబోయే క్రయ విక్రయాల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి, ఆ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని సీఎం ఈ సందర్భంగా కలెక్టర్లను ఆదేశించారు.



ఎస్సారెస్పీ ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ తొలగింపు

(మొదటిపేజీ తరువాయి)

రైతులు ఆందోళన విమరించారు. అలాగే పెద్దపల్లి జిల్లాలో పండుగ పూట గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని రైతులు ఘెరావ్ చేశారు. జగిత్యాల రాస్తారోకోలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సారెస్పీ కాల్వల సమీపంలోని పంట పొలాలకు విద్యుత్ మోటార్ల ద్వారా నీళ్ల తోడుకోవడం నేరం కాదన్నారు. 20 ఏండ్ల నుంచి రైతులు ఇలానే చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆదేశాలు లేకుండా అధికారులే విద్యుత్ సరఫరా నిలిపేయడం సరికాదన్నారు. ఎస్ఈని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అక్కడి నుంచే విద్యుత్ అధికారులతో మాట్లాడారు. అధికారులు విద్యుత్‌ను పునరుద్ధరించడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ ధర్నాలో మోతె ఎంపీటీసీ గంగాధర్, వైస్ ఎంపీపీ గంగం మహేష్, సింగిల్ విండో చైర్మన్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం ఎమ్మెల్యే నిలదీత

సాగునీరందించాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామ రైతులు సోమవారం పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని నిలదీశారు. కోలాట బృందం మహిళలకు చీరలు పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యే గ్రామానికి వచ్చారు. విషయం తెలుసుకున్న రైతులు ఆయన్ని ఘెరావ్ చేశారు. వాహనాన్ని అడ్డుకుని రోడ్డుపై బైటాయించారు. సాగునీరందించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. నీరందించడం కుదరదని ఎమ్మెల్యే తేల్చిచెప్పడంతో రైతులు ఆగ్రహించారు. నీళ్లిప్పించలేని ఎమ్మెల్యే తమ ఊరికి రావొద్దని, వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఎమ్మెల్యే చీరలు పంపిణీ చేయకుండానే పోలీసు బందోబస్తు నడుమ వెనుదిరిగారు. ఈ ఆందోళనలో రైతులు మేడి అశోక్, యాట రాజయ్య, దామ రవి, మేదురు రాజమల్లు, రాజేందర్, ముస్కు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేను యాడికెళ్లినా..

(మొదటిపేజీ తరువాయి)

చేశారని, అందుకే గోమూత్రంతో శుద్ధి చేశామని బీజేపీ యువ మోర్చా స్థానిక నేత విశాల్ మరాటె అన్నారు. 'ఇటువంటి అసాంఘిక వామపక్ష మేధావులను సమాజం క్షమించదు' అని వ్యాఖ్యానించారు. కాగా దీనిపై ప్రకాశ్ తీవ్రంగా స్పందించారు. నేను ఎక్కడికివెళితే అక్కడ గో మూత్రంతో శుద్ధి చేస్తారా? అని ప్రశ్నించారు. ఇటువంటి బెదిరింపులకు తాను భయపడనని అన్నారు. గతేడాది అక్టోబర్‌లో జరిగిన సీనియర్ జర్నలిస్ట్ గౌరీ లంకేశ్ హత్య నేపథ్యంలో ప్రధాని మోడీ, బీజేపీపై ప్రకాశ్ రాజ్ విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి బీజేపీ నాయకులు ఆయనపై విరుచుకుపడుతూనే ఉన్నారు.

వెల్ నెస్.. ఇది ఉద్యోగికి హెల్దీ నెస్!

కడవేర్గు

ప్రపంచ దేశాలకు ప్రధాన ఆదాయవనరుగా ఉన్న ఐటీ, కస్టమర్ గూడ్స్, ఫైనాన్షియల్ సర్వీసులు, రియల్ ఎస్టేట్, నిర్మాణం - మౌలిక సదుపాయాలు, మార్కెట్ రీసెర్చ్, మీడియా, ఇంజినీరింగ్ తదితర రంగాల్లో పనిచేసే ఉద్యోగుల ఆరోగ్యపరమైన సమస్యలను (మానసిక, శారీరక) అంచనా వేసి తగిన చికిత్సలను సూచించే 'వెల్ నెస్ ప్రోగ్రాం'లను చేపట్టడంలో కొన్ని సంస్థలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అసోచాం తాజా సర్వేలో వెల్లడైంది.

వారి 1శాతం గైర్హాజరు విలువ.. 128వేల కోట్లు

"కార్పొరేట్ వెల్ నెస్ ప్రోగ్రాం బెనిఫిట్స్ టు ఆర్గనైజేషన్ అండ్ ఎకానమీ" పేరుతో అసోచాం సంస్థ దేశంలోని ప్రధాన కార్పొరేట్ కంపెనీల్లో చేపట్టిన తాజా సర్వేలో ఆసక్తికర అంశాలు వెలువడ్డాయి. ఇక అధ్యయనం ప్రకారం.. తాము పనిచేస్తోన్న సంస్థలు ఎటువంటి 'వెల్ నెస్' కార్యక్రమాలను నడపడం లేదని సర్వేలో పాల్గొన్న సుమారు 52శాతం ఉద్యోగులు తెలిపారు. తమ సంస్థలు నడుపుతోన్న వెల్ నెస్ ప్రోగ్రాం లు అంతగా బాగోలేవని, వాటిని అభివృద్ధి చేసే అవసరం ఎంతైనా ఉన్నదని వెల్ నెస్ ప్రోగ్రాం లను నడిపే కంపెనీల్లో పనిచేసే దాదాపు 62శాతం ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. కాగా, కార్పొరేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల గైర్హాజరును వెల్ నెస్ ప్రోగ్రామ్ లను ఉపయోగించి కనీసం 1శాతం తగ్గించినా.. 2018లోపు సుమారు 128వేల కోట్ల రూపాయలు ఆదా చేసినట్టేనని, వెల్ నెస్ ప్రోగ్రామ్ కి సంస్థ ఖర్చు చేసే ఒక్క రూపాయి.. ఉద్యోగి గైర్హాజరు సమయంలో యాజమానులు సగటున నష్టపోయే రూ.132.33 (ఒక్కో ఉద్యోగిపై) ఆదా చేస్తుందని, అలాగే, ఆరోగ్య సంరక్షణకు ఉద్యోగులు సగటున ఖర్చుచేసే మొత్తంలో సుమారు 6.62 రూపాయలు .. వెల్ నెస్ ప్రోగ్రాం ల వల్ల తగ్గుతాయని అధ్యయనం పేర్కొంది.

వెల్ నెస్ ప్రోగ్రాం లు అవసరమే!:

ఏ సంస్థ అయినా విజయం సాధించి, లాభాల బాటలో నడవాలంటే ఉద్యోగులదే ప్రధాన భూమిక అని ఒప్పుకోవాల్సిందే! అలాంటి ఉద్యోగులు ఆరోగ్యపరమైన సమస్యలతో(మానసికంగా లేదా శారీరకంగా) బాధపడితే, అది వారి పనితీరు, తద్వారా సంస్థ వృద్ధి, ఆదాయంపై ప్రభావం చూపిస్తుందని తేలింది. ఫిజికల్ గా, మెంటల్ గా ఫిట్ గా లేని ఉద్యోగుల్లో పని చేసే ఉత్సాహం ఉండకపోగా, వారి పనితీరులో క్రమంగా మార్పులు రావడంతో పాటు తోటి ఉద్యోగులపై కూడా ప్రభావం చూపే అవకాశమున్నదని ఇప్పటికే ఎన్నో సర్వేలు తేల్చి చెప్పాయి. నేటి పోటీ ప్రపంచంలో సంస్థల మధ్య ఒకరకమైన పరోక్ష యుద్ధం నడవడం.. అది ఆయా సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల మానసిక, శారీరక శ్రమను పెంచేదిగా మారుతుండటం పరిపాటిగా తయారయ్యింది. కొంతమంది ఉద్యోగులు శారీరకంగా వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకునే అలవాటు ఉన్నప్పటికీ.. మానసికంగా కుంగుబాటుకు లోనవుతున్నారు. ఇటువంటి వారి కోసమే.. ఆయా సంస్థల్లో మానవ వనరుల విభాగం ఆధ్వర్యంలో వెల్ నెస్ ప్రోగ్రాం లను నిర్వహించడం ప్రారంభమైంది.

ఈ కార్యక్రమాల్లో పనిఒత్తిడిని తట్టుకునేందుకు ఉద్యోగుల్లో మానసిక స్థైర్యాన్ని కల్పించడంతో పాటు శారీరక సమస్యలను సైతం దూరం చెయ్యడమే లక్ష్యంగా ఉండేది. ఐతే, క్రమేపీ వివిధ సంస్థలు వెల్ నెస్ ప్రోగ్రాం లకు మంగళం పాడటం వల్ల ఉద్యోగుల్లో ఒకరకమైన ఒత్తిడి మళ్ళీ కనిపిస్తున్నదని, ఇది ఇలాగే కొనసాగితే, ఆయా సంస్థల ఆర్థిక ప్రగతిపై పెను ప్రభావం చూపే అవకాశమున్నది. ఇకనైనా, సదరు సంస్థలు ఉద్యోగులు పని ప్రాంతాల్లో ఎదురుకుంటున్న మానసిక, శారీరక సమస్యలను దూరం చేసే మార్గాలను అన్వేషిస్తూ.. పరిష్కార కార్యక్రమాలను తక్షణం అమలు చేసే అవసరం ఎంతైనా ఉన్నదని మానవ వనరుల నిపుణులు హెచ్చరిస్తున్నారు.

'వెల్ నెస్ ప్రోగ్రామ్స్'కు ఉద్యోగులు ఎందుకు హాజరవుతున్నారంటే?

రంగం	ఆరోగ్యకరమైన జీవితం కోసం	కంపెనీ ప్రోత్సాహకం	కాబట్టి రెండూ
ఇంజినీరింగ్	75	19	06
కస్టమర్ గూడ్స్	75	13	12
ఫైనాన్షియల్ సర్వీసులు	73	27	-
ఐటీ	55	34	11
మార్కెట్ రీసెర్చ్	90	10	-
మీడియా	70	30	-

ఆధారం: అసోచాం సర్వే

సెన్సెక్స్ ▼72	34,771
నిఫ్టీ ▼41	10,700
డాలరుకు రూపాయి విలువ	64.04
బంగారం(10.గ్రా)	రూ. 30,855
వెండి (కేజీ)	రూ. 42,000





కోడిగుడ్లు			
హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410



స్వచ్ఛతపై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలి..

బీవోఎం జోనల్ మేనేజర్ దీపక్ ఎన్. భండారీ



నవతెలంగాణ, బిజినెస్ డెస్క్: స్వచ్ఛతపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీవోఎం) జోనల్ మేనేజర్ దీపక్ ఎన్.భండారీ కోరారు. మంగళవారం జోనల్ కార్యాలయంలో బ్యాంక్ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ చిత్తశుద్ధితో బ్యాంక్‌లోనూ, పరిసర ప్రాంతాల్లోనూ స్వచ్ఛత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ జీఎస్ బాగుర్కర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ టిఎస్ రావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. కాగా, కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ నెల 16 నుంచి 31 వరకు సచ్ఛ సర్వేక్షణ్-2018 పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్న సంగతి తెలిసిందే.

మార్కెట్లోకి ఇసుజు వీ-క్రాస్ అప్‌గ్రేడెడ్ వెర్షన్



హైదరాబాద్: జపాన్‌కు చెందిన ఇసుజు మోటార్స్ లిమిటెడ్ అడ్వెంచర్ యుటిలిటీ వాహనం ఇసుజు వీ-క్రాస్‌లో అప్‌గ్రేడెడ్ వెర్షన్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. దీనిని హై, స్టాండర్ట్ రెండు వేరియంట్స్‌లో అందుబాటులోకి తెచ్చింది. చెన్నై కేంద్రగా వీటి ధరలు రూ.14,26లక్షల-15,76లక్షలుగా కంపెనీ నిర్ణయించింది. 2.5 లీటర్ డీజిల్ ఇంజిన్ కలిగిన ఈ వాహనం 132 బీహెచ్‌పీని ఉత్పత్తి చేస్తుంది. 320 ఎన్ఎం టార్క్, 5-స్పీడ్ మ్యానువల్, ఎలక్ట్రానిక్ స్టేబిలిటీ కంట్రోల్ (ఈఎస్‌సీ) ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్ (టీసీఎస్), డే టైమ్ రన్నింగ్ లైట్స్ (డీఆర్ఎల్), ఎల్ఈడీ టైల్ ల్యాంప్స్, ఆలో క్రూయిజ్ కంట్రోల్, 6-వే పవర్ ఎడ్జస్టబుల్ డ్రైవర్ సీట్, రియర్ వ్యూ కెమేరా, డ్యూయల్ టోన్ ఇంటీరియర్స్, స్పోర్టీ బ్లాక్ లెదర్ సీట్స్ వంటి ఫీచర్లతో ఈ కొత్త ఎడిషన్ లభిస్తుందని కంపెనీ పేర్కొంది.

ఆన్‌లైన్‌లోకి పతాంజలి ఉత్పత్తులు

న్యూఢిల్లీ : ప్రముఖ కార్పొరేట్, యోగా గురు బాబా రామ్‌దేవ్‌కు చెందిన పతాంజలి ఉత్పత్తులు అన్ని ఆన్‌లైన్ పోర్టల్లో అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ లాంటి ఎనిమిది ప్రముఖ ఈ-కామర్స్ పోర్టళ్లతో మంగళవారం హరిద్వార్‌లో బాబా రామ్‌దేవ్ ఆధ్వర్యంలో ఒప్పందాలు జరిగాయి. ఈ-కామర్స్ పోర్టళ్ల సాయంతో తమ ఉత్పత్తులు ప్రతి ఇంటి గుమ్మానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రామ్‌దేవ్ బాబా పేర్కొన్నారు. ప్రస్తుతం ఏడాదికి 50వేల కోట్ల ఉత్పత్తులను తయారు చేస్తున్నట్టు రామ్‌దేవ్ తెలిపారు. వచ్చే సంవత్సరం నాటికి ఈ సామర్థ్యాన్ని రెట్టింపు చేసుకోవాలని నిర్ధేశించుకున్నామన్నారు. బహుళ జాతి సంస్థలకు వ్యతిరేకంగా విమర్శలు చేసే రామ్‌దేవ్ బాబా అమెజాన్ లాంటి కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం గమనార్హం.

పొంతన లేని లెక్కలు

- ద్రవ్యోల్బణ సూచీల గందరగోళం
- ఎగిసిన రిటైల్ ధరలు
- దిగివచ్చిన టోకు సూచీలు


న్యూఢిల్లీ: దేశంలో ధరల పెరుగుదలపై కేంద్ర గణంకాల శాఖ (సీఎస్‌వో) పొంతన లేని లెక్కలు ప్రకటిస్తుంది. ఇందుకు నిదర్శనం గత డిసెంబర్ ద్రవ్యోల్బణ సూచీలే నిదర్శనం. ఒక వైపు రిటైల్ ధరలు ఎగిసి పడుతుంటే, మరోవైపు టోకు ద్రవ్యోల్బణం దిగివచ్చిందని వెల్లడించింది. 2017 డిసెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం సూచీ (డబ్ల్యుపీఐ) 3.58 శాతానికి తగ్గి మూడు మాసాల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. కాగా ఇదే మాసంలో వినియోగదారుల రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) సూచీ ఏకంగా 5.21 శాతానికి ఎగిసి 17 మాసాల గరిష్ట స్థాయిని తాకింది. కాగా గత మాసంలో రిటైల్ కూరగాయలు, ఇంధన ధరలు అమాంతం పెరిగాయని తొలుత ప్రకటించిన సీఎస్‌వో ఆ తర్వాత రెండు రోజులకే వెల్లడించిన టోకు ద్రవ్యోల్బణం సూచీలో ఈ ఉత్పత్తుల ధరలు దిగివచ్చాయని పేర్కొంది. టోకు ధరలు దిగివస్తే రిటైల్ ధరలు ఎలా పెరుగుతాయని విశ్లేషకుల సందిగ్ధం. వాస్తవానికి టోకు ధరలు పెరగడం వల్లనే రిటైల్ ధరాఘాతం చోటు చేసుకుంటుందనేది అందరికీ తెలిసిన విషయం. కాని మోడీ ప్రభుత్వం ధరలపై తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి టోకు ధరలను తగ్గించి చూపిస్తుందనే విమర్శలు పెరుగుతున్నాయి.

పెరిగిన రిటైల్

క్రితం డిసెంబర్‌లో వినియోగదారుల రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ (సీపీఐ) అమాంతం 5.21 శాతానికి ఎగిసిందని శుక్రవారం కేంద్ర గణంకాల శాఖ స్వయంగా వెల్లడించింది. 2016 ఇదే డిసెంబర్‌లో 1.37 శాతంగా ఉంది. గత నెలలో ముఖ్యంగా కోడి గుడ్ల ధరలు అమాంతం పెరగడంతో పాటు కూరగాయల ధరలు ఎగిసిపడి రిటైల్ ధరలకు ఆజ్యం పోశాయి. కూరగాయల ధరలు ఏకంగా 29.13 శాతం పెరిగాయి. ఇంతక్రితం నెలలో 22.48 శాతం ప్రియమయ్యాయి. ఒకే దేశం ఒకే పన్ను జీఎస్టీతో ధరలు దిగివస్తాయని పదే పదే చెప్పిన మోడీ సర్కార్ ఈ విధానాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచే ధరలు వరుసగా పెరుగుతున్నాయి. గత జూన్‌లో 1.54 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ క్రమంగా పెరుగుతూ డిసెంబర్ నెలలో ఏకంగా 5.21 శాతానికి ఎగిసింది.

తగ్గిన టోకు..

గతేడాది డిసెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం సూచీ 3.58 శాతానికి తగ్గి, మూడు నెలల కనిష్టానికి దిగివచ్చిందని సోమవారం సీఎస్‌వో వెల్లడించింది. కూరగాయలు, ఇంధన ధరలు దిగివచ్చాయని దీంతో టోకు ధరలు తగ్గాయని తెలిపింది. ఈ మాసంలో ఉల్లి ధరలు ఏకంగా 197.05 శాతం పెరిగాయి. పండ్ల ధరలు 11.99 శాతం ప్రియమయ్యాయి. అహారోత్పత్తుల ధరలు 6.06 శాతం నుంచి 4.72 శాతానికి తగ్గాయి. ధరల పెరుగుదల అంతిమంగా ప్రజల కొనుగోలు శక్తిని హరిస్తుంది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ధరల నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటేనే వడ్డీ రేట్లు తగ్గడానికి, పెట్టుబడులు పెరగడానికి ఆస్కారం ఉంటుందని సూచిస్తున్నారు.



స్మాట్రాన్ నుంచి బడ్జెట్ ఫోన్



న్యూఢిల్లీ: గ్లోబల్ సాంకేతికత ఈవోఎం, ఐవోటీ బ్రాండ్ అయినా స్మాట్రాన్ మంగళవారం మార్కెట్లోకి 'టీఫోన్ పీ' స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. దీని ధర రూ.7,999గా నిర్ణయించింది. దీన్ని శక్తివంతమైన 5000 ఎంఏహెచ్ బ్యాటరీతో అందుబాటులోకి తెచ్చినట్టు ఆ కంపెనీ పేర్కొంది. 5.1 అంగుళాల డిస్‌ప్లే కలిగిన ఈ ఫోన్‌ను 13 ఎంపీ రియల్ కెమెరా, 5ఎంపీ ఫ్రంట్ కెమెరాతో తీసుకొచ్చింది. క్వాల్‌కాం స్నాప్‌డ్రాగన్ 435 ఆక్టా కోర్ చిప్‌సెట్ ప్రాసెసర్, 32 జీబీ ఇన్‌బిల్ట్ స్టోరేజీ, 120 జీబీకి విస్తరించుకునే సామర్థ్యంతో దీన్ని ఆవిష్కరించింది.

నాలుగు వారాల కనిష్టానికి బిట్‌కాయిన్!

14శాతం మేర దిగజారిన విలువ

లండన్ : క్రిప్టోకరెన్సీ బిట్ కాయిన్ విలువ ఒకే రోజు భారీగా పడిపోయి నాలుగు వారాల కనిష్ట స్థాయికి దిగజారింది. మంగళవారం ఈ కరెన్సీ విలువ 14 శాతం క్షీణించి 12,000 డాలర్ల దిగువకు పడిపోయింది. దక్షిణ కొరియా ఆర్థిక శాఖ మంత్రి కిమ్ డొంగ్ యెన్ స్థానిక రేడియో స్టేషన్‌లో మాట్లాడుతూ అసంబద్ధంగా ఉన్న క్రిప్టో కరెన్సీ పెట్టుబడులను నియంత్రించడానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో లక్షమ్‌బర్గ్ కేంద్రంగా పని చేస్తోన్న బిట్స్‌స్టాంప్ ఎక్సేంజీలో బిట్ కాయిన్ విలువ 13.6 శాతం క్షీణించి 11,730 డాలర్లుగా నమోదయ్యింది. గత డిసెంబర్ మధ్యలో ఈ కరెన్సీ విలువ ఏకంగా 20,000 డాలర్లకు చేరి దీని మార్కెట్ విలువ 125 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. గత కొద్ది రోజులుగా ఈ కరెన్సీపై నెలకొన్న భయాలతో దాదాపుగా 40 శాతం పైగా విలువ కోల్పోయింది.



మార్కెట్లకు 'లోటు' భయాలు

ముంబయి: వరుస లాభాలతో రికార్డు స్థాయిలను తాకిన దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాలు చవి చూశాయి. గతేడాది డిసెంబర్‌లో భారత వాణిజ్య లోటు 14.88 బిలియన్ డాలర్లకు చేరిందన్న గణంకాలు మదుపర్ల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. 2016 ఇదే మాసంలో 10.54 బిలియన్ డాలర్ల లోటు చేసుకుంది. లోటు భయాలకు తోడు వరుసగా పెరిగిన సూచీల నేపథ్యంలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. దీంతో బీఎస్‌ఈ సెన్సెక్స్ 72.46 పాయింట్లు తగ్గి 34771.05కు పడిపోయింది. ఇంట్రా ట్రేడింగ్‌లో 34,936-34,735 మధ్య కదలాడింది.
బీఎస్ఈలో రంగాల వారిగా రియాల్టీ 3.51 శాతం, లోహ 2.83 శాతం, పీఎస్‌యూ 2.26 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 1.84 శాతం చొప్పున విలువ కోల్పోయి మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి. మరోవైపు ఐటీ సూచీ 3.32 శాతం, టెక్ 2.45 శాతం చొప్పున పెరిగాయి. సెన్సెక్స్‌లో విప్రో 4.88 శాతం, ఇన్ఫోసిస్ 3.93 శాతం, టీసీఎస్ 3.77 శాతం, ఐసీఐసీఐ బ్యాంకు 1.43 శాతం, డాక్టర్ రెడ్డీస్ 1.38 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు కోల్ ఇండియా 4.57 శాతం, రిలయన్స్ 2.54 శాతం, టాటా మోటార్స్ 2.3 శాతం, టాటా స్టీల్ 2.16 శాతం, ఐటీసీ 2.06 శాతం చొప్పున అధికంగా అమ్మకాలకు గురైయ్యాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం సోమవారం సెషన్‌లో విదేశీ మదుపర్లు రూ.32.92 కోట్ల ఈక్విటీలు, దేశీయ మదుపర్లు రూ.173.28 కోట్ల ఈక్విటీలను కొనుగోలు చేశారు.

కుంగిన రూపాయి విలువ



అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్లో రూపాయి విలువ వెలవెల పోతోంది. క్రితం డిసెంబర్‌లో భారత వాణిజ్య లోటు మూడు సంవత్సరాల గరిష్టానికి చేరడంతో మంగళవారం రూపాయి విలువ తీవ్ర ఒత్తిడికి గురైంది. ఈ నేపథ్యంలోనే డాలర్‌తో రూపాయి మారకం విలువ 54 పైసలు కోల్పోయి 64.04కు దిగజారింది. ఓ దశలో 60 పైసలు పతనమై 64.09 వద్ద ట్రేడింగ్ అయ్యింది. దేశ కరెంట్ అకౌంట్ లోటు కూడా జీడీపీలో 2 శాతానికి చేరిందని విదేశీ బ్రోకరేజీ సంస్థ నోమురా పేర్కొంది. ఈ ప్రభావం రూపాయిపై ఒత్తిడి పెంచిందని విశ్లేషించింది.

మార్చి 12 తర్వాత సాదాబైనామాలను స్వీకరించొద్దు..

- పాస్ పుస్తకాల తాకట్టుక్కూడా వీల్లేదు : సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


మార్చి 12 తర్వాత సాదా బైనామాలను స్వీకరించొద్దని ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. భూ బదలాయింపులన్నీ రిజిస్ట్రేషన్ ద్వారాగాని, వారసత్వ హక్కుగా మ్యూటేషన్ ద్వారాగానీ జరగాలని అన్నారు. మార్చి 12 తర్వాత బ్యాంక్ రుణాల కోసం పట్టాదారు పాస్ పుస్తకాలను కూడా తాకట్టుపెట్టుకోకూడదని సూచించారు. ఇతర అన్ని వివరాల కోసం ధరణి వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కలెక్టర్ల సమావేశం అనంతరం సీఎం పలు నిర్ణయాలను ప్రకటించారు.

- షెడ్యూల్డ్, మైదాన ప్రాంతాల్లో ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న సాదా బైనామాలను పూర్తి చేయాలి
- జిల్లాల వారీగా ఆర్వోఎఫ్ఆర్ ప్రతిపాదలను ప్రభుత్వానికి పంపిస్తే.. వాటిని పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటాం
- భూ ప్రక్షాళలను సంబంధించి ఇంకెలాంటి సమస్యలున్నా వాటిని ప్రభుత్వానికి పంపాలి
- కొత్తగా సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలను స్వీకరించబోతున్న 443 తహశీల్దార్లతోపాటు ప్రస్తుతమున్న 141 మంది సబ్ రిజిస్ట్రార్లకు.. నూతన రిజిస్ట్రేషన్ విధానం, ఐటీ అప్లికేషన్లకు సంబంధించిన శిక్షణినివ్వాలి
- భూ సమస్యల్లో ప్రధానమైంది అసైన్డ్ భూములు. ఈ ప్రక్రియ గతంలో చాలా అశాస్త్రీయంగా ఉండేది. అనేక అవకతవకలు జరిగాయి. ఈ నేపథ్యంలో అసైన్డ్ భూములపై ఒక విధానాన్ని రూపొందించాలి. ఇందుకోసం రెవెన్యూశాఖ మార్గదర్శకాలను రూపొందించాలి. వాటికి అనుగుణంగా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు తమ జిల్లాల్లో నిర్ణయాలు తీసుకోవాలి. అసైన్డ్ భూముల విషయాన్ని మానవీయ కోణంలో ఆలోచించాలి
- నూతనంగా ఏర్పాటు చేయబోయే పంచాయతీల భౌగోళిక సరిహద్దులను ఈనెల 25 నాటికి నిర్ణయించి, ప్రభుత్వానికి పంపాలి. నూతనంగా ఏర్పాటు చేయబోయే పంచాయతీ కనీస జనాభా 500గా ఉండాలి. విడిపోతున్న పంచాయతీకి, కొత్తగా ఏర్పాటు చేయబోయే పంచాయతీకి మధ్య కనీసం ఒకటిన్నర నుంచి రెండు కిలోమీటర్ల దూరం ఉండాలి
- పంచాయతీ వ్యవస్థ ఎలా ఉండాలనే దానిపై కలెక్టర్లు తమ సూచనలు, సలహాలను పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శికి పంపాలి. జిల్లా పంచాయతీ అధికారులు కూడా తగిన సూచనలివ్వాలి.
- ఈ సూచనలు, సలహాల ఆధారంగానే నూతన పంచాయతీరాజ్ చట్టం ముసాయిదాను రూపొందిస్తాం. ఫిబ్రవరి మొదటి వారంలో ఆ చట్టాన్ని శాసనసభలో ప్రవేశపెడతాం
- రాబోయే ఎన్నికల్లో ఎన్నికైన సర్పంచులు.. పదవీ బాధ్యతలు చేపట్టేలోపే వారికి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలి
- ప్రతి జిల్లాలో ఉన్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాల స్థితిగతులను కంప్యూటరీకరించాలి. ఆ వివరాల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వృధా కాకుండా చూడాలి
- పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వం.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆర్థికంగా వెనుబడిన ఇతర వర్గాల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలను రూపొందిస్తుంది. వైద్య, ఆరోగ్య రంగంలో ఇవి ముఖ్యంగా ఉంటాయి
- 2020 నాటికి కోటి ఎకరాలకు సాగు నీరందిస్తాం. ఈ యేడాది డిసెంబరు చివరి నాటికే కాళేశ్వరంలో చాలా భాగానికి నీళ్లొస్తాయి
- గొర్రెల పంపిణీలో భాగంగా ఇప్పటికే 38,28,987 గొర్రెలను పంపిణీ చేశాం. వీటికి 14,56,376 గొర్రె పిల్లలు పుట్టాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 52,79,363 గొర్రెలు అదనంగా చేరాయి. ఇదో సంచార బ్యాంకులాంటిది.
- స్థానికంగా తక్షణ అవసరాల కోసం విస్తీర్ణం రీత్యా పెద్ద జిల్లాల కలెక్టర్లకు రూ.1.5 కోట్లు, చిన్న జిల్లాల వారికి రూ.కోటి కేటాయించాలి.

సర్కారుపై ఉద్యోగుల గుర్రు !

బదిలీలు లేకపోవడంతో అసంతృప్తి

- డైరీల ఆవిష్కరణలో మంత్రులపై ఒత్తిడి
- సీఎం దృష్టికి తీసుకెళ్లాలని వినతి
- కొత్త జిల్లాల్లో ఆర్డర్ టు సర్వ్ పేరుతోనే పోస్టింగులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు జరగలేదు. సాధారణ బదిలీల కోసం ఉద్యోగులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రంలోనూ ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీటికోసం ఐదేండ్లుగా నిరీక్షిస్తున్నారు. ఏటా వేసవికాలంలో రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు చేపడుతుందని ఎదురుచూడ్డం, నిరాశ చెందడం షరామామూలుగా మారిందని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013, ఏప్రిల్ 25 నుంచి మే 15 వరకు చివరిసారిగా ఉద్యోగుల బదిలీలు జరిగాయి. తెలంగాణ ప్రభుత్వం 2017 ఏప్రిల్, మేనెలల్లో చేపడుతుందని ఉద్యోగులు భావించినా వారి ఆశలు ఆశలుగానే మిగిలాయి. 2016, అక్టోబర్ 11న ప్రభుత్వం 10 జిల్లాలను 31 జిల్లాలుగా ఏర్పాటు చేసింది. ఆర్డర్ టు సర్వ్ పేరుతో కొత్త జిల్లాలకు ఉద్యోగులను బదిలీ చేసింది. ఆ తర్వాతైనా శాశ్వత నియామకాలు చేపడుతుందని అందరూ ఆశించారు. కొత్త జిల్లాలు ఆవిర్భవించి ఏడాది దాటినా శాశ్వత బదిలీలు జరగలేదు. దీంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ ఏడాది తమ సంఘానికి సంబంధించి డైరీలు, క్యాలెండర్ ఆవిష్కరణల సందర్భంగా మంత్రుల ఎదుట ఉద్యోగ సంఘాల నేతలు బదిలీల డిమాండ్లు వినిపించారు. ఉద్యోగుల్లో ఉన్న అసంతృప్తిని దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్‌కు తమ విన్నపాన్ని తీసుకెళ్లాలని కోరడం గమనార్హం. కొత్త పీర్సీ పేరుతో సర్దిబుచ్చే ప్రయత్నం చేసినా బదిలీలు కూడా జరపాలని కోరుతున్నారు. కుటుంబాలు ఒకచోట నివాసముంటే, ఉద్యోగులు మరోచోట విధులు నిర్వహించాల్సి వస్తున్నది. పిల్లల చదువుల కోసం, కుటుంబ అవసరాల కోసం ఎంతో ఓపికతో భరిస్తున్నామని ఉద్యోగులు తెలిపారు. ఇంకోవైపు పాత జిల్లా కేంద్రాల్లో పనిచేసిన ఉద్యోగులకు 20 శాతం హెచ్‌ఆర్ఏ వచ్చేది. కొత్త జిల్లాలకు వెళ్లిన ఉద్యోగులకు కేవలం కొన్ని జిల్లా కేంద్రాల్లో 14.5 శాతం, మరికొన్ని జిల్లా కేంద్రాల్లో పనిచేసే వారికి 12 శాతం హెచ్‌ఆర్ఏ మాత్రమే వస్తున్నది. ఒకవైపు బదిలీల్లేక, ఇంకోవైపు కొత్త జిల్లాల్లో శాశ్వత నియామకాల్లేక, మరోవైపు హెచ్‌ఆర్ఏ 20 శాతం అందక ఉద్యోగులు ప్రభుత్వ తీరుపై గుర్రుగా ఉన్నారు. సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నదన్న అభిప్రాయం వినిపిస్తున్నది. ఎంప్లాయ్ ఫ్రెండ్లీ అంటూనే సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహించడం ఎంతవరకు సమంజసమని ఉద్యోగుల సంఘం నేతలు తెలిపారు. ప్రభుత్వం తీరు మారకుంటే ఆందోళనకు దారితీసే అవకాశం ఉంటుందని పేరు చెప్పడానికి ఇష్టపడని కొంతమంది నేతలు అభిప్రాయపడ్డారు.

శాశ్వత కేటాయింపులకు స్థానికతే ప్రామాణికం

జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఉద్యోగులు ఆర్డర్ టు సర్వ్ (తాత్కాలిక నియామకాలు) పేరుతో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. గతంలో పది జిల్లాల్లో ఉన్న 41,816 మంది ఉద్యోగులను ఆర్డర్ టు సర్వ్ పేరుతో తాత్కాలికంగా 31 జిల్లాలకూ సర్దుబాటు చేసింది. ఎలా చేయాలన్న దానిపై హైదరాబాద్ మినహా మిగిలిన తొమ్మిది జిల్లాలకు ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం విభజించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా ఐదు జిల్లాలుగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నాలుగు జిల్లాలుగా విభజించబడింది. ఉద్యోగుల బదిలీలు, శాశ్వత నియామకాలకు స్థానికతే ప్రామాణికంగా తీసుకునే అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఉద్యోగులు ఎక్కడ పనిచేస్తారన్నది ఆప్షన్ అవకాశం ఇచ్చి స్థానికత ఆధారంగా శాశ్వత కేటాయింపులు చేయాలని చూస్తున్నది. ఉదాహరణకు రంగారెడ్డి జిల్లా రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాలుగా విభజన అయ్యింది. ఉమ్మడి జిల్లా రంగారెడ్డికు చెందిన ఓ ఉద్యోగి విద్యార్హత కూకట్‌పల్లిలో పదో తరగతి వరకు చదివి ఉంటే, ప్రస్తుతం మేడ్చల్-మల్కాజిగిరికి స్థానికులుగా మారుతారు. ఇక ఆ ఉద్యోగి శాశ్వత కేటాయింపు కూడా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు వర్తిస్తుంది. ఇలా ఉద్యోగులకు శాశ్వత కేటాయింపులు చేయాలని ప్రభుత్వం సమాలోచన చేస్తున్నది. ఉద్యోగుల శాశ్వత బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను ముందు విడుదల చేయనుంది. ఆ తర్వాత ఉద్యోగ సంఘాల నుంచి అభ్యంతరాలు స్వీకరించనుంది. అనంతరం ఉద్యోగుల ఆప్షన్లను స్వీకరించి శాశ్వత కేటాయింపులు చేపట్టనుంది. ఈ ప్రక్రియలో ఏడాదిలో ఉద్యోగ విరమణ పొందే వారికి, ఉద్యోగ సంఘాల ప్రధాన నాయకులు, దివ్యాంగులు, భార్యాభర్తలు, దీర్ఘకాలిక వ్యాధి ఉన్న ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చే అవకాశముంది. ఇదంతా చేసే క్రమంలో కావాలని నాన్చివేత ధోరణి అవలంబిస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి.

ఎన్నికలే లక్ష్యంగా ఉద్యోగులకు వల

రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు వచ్చే ఏడాది 2019లో జరగనున్నాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు వెళ్లాలన్న అభిప్రాయంతో ఉన్నట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే 11 వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) వేయడంతోపాటు ఆ లోపే ఫిట్‌మెంట్ ప్రకటించే సూచనలు కనిపిస్తున్నాయి. పీఆర్సీ ఆలస్యమైతే మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ఈలోపే ఉద్యోగులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న బదిలీల ప్రక్రియను చేపట్టాలని సమాలోచన చేస్తున్నట్టు సమాచారం. ఎన్నికలే లక్ష్యంగా ఉద్యోగులకు వల వేయాలని అధికార పార్టీ నేతలు ఇప్పటి నుంచే ప్రణాళిక రచిస్తున్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది ఏప్రిల్ లేదా మేలో తప్పనిసరిగా ఉద్యోగులకు బదిలీలతోపాటు కొత్త జిల్లాల్లో పనిచేస్తున్న వారికి శాశ్వత కేటాయింపులుంటాయని బలంగా వినిపిస్తున్నది. ఉద్యోగుల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి నుంచే జాగ్రత్త పడుతున్నట్టు సమాచారం. ఉద్యోగుల నుంచి వ్యతిరేకత వస్తే ప్రతిపక్ష పార్టీలకు మేలు కలుగుతుందున్న ప్రమాదాన్ని గ్రహించిన ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో త్వరలోనే సంప్రదింపులు జరపాలని నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. త్వరలోనే ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసే అవకాశమున్నట్టు సమాచారం.

ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్ధానాల అమలుకై

19 వరకు రిలేదీక్షలు, 22న లో కలెక్టరేట్‌లకు టీమాస్ పిలుపు

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అణగారిన కులాలకు, పేదలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 19 వరకు అన్ని మండల కేంద్రాలలో రిలే నిరాహార దీక్షలు, 22న చలో కలెక్టరేట్ నిర్వహించాలని టీమాస్ రాష్ట్ర కమిటి పిలుపునిచ్చింది. ప్రభుత్వం పరిష్కరించకపోతే వారందరినీ సంఘటితపరిచి ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించింది. ఈ మేరకు టీమాస్ రాష్ట్ర రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ, స్టీరింగ్ కమిటీ సభ్యులు గద్దర్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, విమలక్క ఒక ప్రకటనలో తెలిపారు.

అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూమ్‌లను నిర్మించి ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 3 ఎకరాల భూమిని పంపిణీ చేయాలని, చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.18వేలు ఇవ్వాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న లక్ష పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రైతు రుణ మాఫీ చేసి గిట్టుబాటు ధర కల్పించాలని, కెజి టు పిజి ఉచిత విద్య, అందరికీ ఉచిత వైద్యం అందించాలని కోరారు.

వేరుశనగకు మద్దతు ధర ఇప్పించండి

సీఎంకు మాజీ ఎమ్మెల్యే నంద్యాల లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వేరుశనగ పంటకు తక్షణమే మద్దతు ధర వచ్చే ఏర్పాట్లు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వేరుశనగ పంట చేతికొచ్చిందని, మార్కెట్‌లోకి తీసుకువెళితే రైతులకు మద్దతు ధర రావడం లేదని వివరించారు. అక్కడ ప్రభుత్వ సంస్థల కొనుగోలు కేంద్రాలు లేవని, మార్కెట్‌లలో మద్దతు ధర బోర్డులు లేవని, మార్కెట్ ఫీజు కంటే అధికంగా తీసుకుంటున్నారని తెలిపారు. మద్దతుధర కోసం వనపర్తిలో 5 గంటలు, పెబ్బేరులో గంటకు పైగా ఆందోళన చేశారని, ఈ సమయంలో అధికారులు జోక్యం చేసుకొని క్వింటాలుకు రు.100ల నుండి రు.150లు పెంచారు తప్ప ఆ ధర కూడా అమలు జరగలే దన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలన్నారు. అదేవిధంగా మార్కెట్‌లలో ఫీజులు అధికంగా వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

జరదేఖో



గతం వర్తమానానికి చరిత్ర. వర్తమానం భవిష్యత్‌కు చరిత్ర. ఆ చరిత్రలో ఎత్తుపల్లాలు, స్వర్ణయుగాలు, క్షీణ దశలు అన్నీ ఉంటాయి. అలాంటి చరిత్రకు సంబంధించిన కట్టడాల గురించిన కథలు వినడం, చదవడం తప్ప ప్రత్యక్షంగా చూసినవారు చాలా అరుదుగా ఉంటారు. నిజంగా వాటిని చూసినప్పుడు కలిగే ఆనందం వర్ణనాతీతం. అపురూపమైన చారిత్రక కట్టడాలను, అద్భుతమైన శిల్పకళలను, సాంకేతిక నైపుణ్యాన్ని తనలో దాచుకున్నది "కోణార్క్ సూర్యదేవాలయం". ఈ దేవాలయం చరిత్రను తన గర్భంలో దాచుకుంటే దాని చుట్టుపక్కల ప్రాంతాలైనటువంటి కటక్, భువనేశ్వర్, గోపాల్పూర్ బీచ్, ఉదయగిరి, చిల్కా సరస్సు, బెర్హంపూర్ బీచ్, సన్ రైజ్ హిల్స్ తదితర ప్రాంతాలు చరిత్రలో మౌనంగా నిలవడమే కాకుండా ప్రపంచ పర్యాటకులను తన దగ్గరకు రారమ్మని ఆహ్వానిస్తున్నాయి.

పర్యాటక ఆకర్షణ 'స్వర్ణ త్రిభుజ'...

ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందింది. కోణార్క్ దేవాలయం. ఎర్ర ఇసుక రాయితో నిర్మించిన అద్భుత కట్టడం. ఇది పగటి పూట కురిసే వెన్నెల. అమావాస్య రాత్రుల్లో వెలిగే చందమామ. మానసిక ప్రశాంతతను ప్రసాదించే ఆధ్యాత్మిక క్షేత్రం. కాబట్టి దీన్ని "నల్ల పగోడా" అని కూడా పిలుస్తారు. అంతే కాదు సైన్స్, ఆధ్యాత్మికం కలగలిసిన అపురూపమైన నిర్మాణం. కళింగ రాజుల శిల్పకళా వైభవానికి ప్రతీక కోణార్క్ సూర్య దేవాలయం. ఒడిషాలోని మహానది నుంచి ఆంధ్రాలోని గోదావరికి మధ్య ఉన్న ప్రాంతమంతా ప్రాచీన కళింగ రాజ్యంగా ఉండేదని చరిత్ర చెబుతున్నది. ఇక్కడి సంస్కృతి కాస్త భిన్నంగా ఉంటుంది. ఒడిషా శిల్పసౌందర్యానికి కోణార్క్ ఓ చక్కటి ఉదాహరణ. కోణార్క్ సూర్య దేవాలయాన్ని1200 మంది శిల్పకళాకారులు, 12 ఏండ్ల పాటు కష్టపడి నిర్మించినారట. ఈ ఆలయాన్ని పదమూడవ శతాబ్దంలో పూర్తి చేశారు. ఇది చూడటానికి సూర్యరథంలా ఉంటుంది. పన్నెండు జతల చక్రాలు కలిగిన ఓ పెద్ద రథాన్ని ఏడు గుర్రలు లాగుతున్నట్టుగా కనిపిస్తుంది. ఒక్కొక్క రథ చక్రం మూడు మీటర్ల వ్యాసంతో, అందమైన నగిషీ చెక్కడాలతో కనిపిస్తుంది. కోణ అంటే కోణం. ఆర్క అంటే సూర్యుడు. సూర్య గమనానికి అనుగుణంగా ఈ ఆలయ నిర్మాణం జరిగింది. రథానికి పన్నెండు చక్రాలు ఉంటాయి. అయితే సంవత్సరానికి పన్నెండు నెలలు. వీటి అనుగుణంగానే సూర్యగమనం ఒక్కొక్క చక్రంలో ఒక్కో నెల జరుగుతుందని చెబుతారు.

పురావస్తు మ్యూజియం...

1968 లో ఇక్కడ పురావస్తు మ్యూజియాన్ని ప్రారంభించారు. సూర్య దేవాలయం సమీపంలోనే పురావస్తు మ్యూజియం ఉంది. దీన్ని ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నడిపిస్తున్నారు. గత వైభవాన్ని తెలుసుకునేందుకు పర్యాటకులు ఇక్కడికి ఎక్కువ సంఖ్యలో వస్తారు. ఆలయంలో పడిపోయిన నిర్మాణాలను, పురావస్తు శిథిలాలను ఈ మ్యూజియంలోనే భద్రపరిచారు. వాటిని చూడడానికి కూడా ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తుంటారు.



ఆర్కియలాజికల్ మ్యూజియం

ముఖ్యంగా మ్యూజియంలో నాలుగు గ్యాలరీలు ఉన్నాయి. ఆలయం నుంచి సేకరించిన 260 కి పైగా ప్రాచీన వస్తువులు, వివిధ విగ్రహాలు ఇక్కడ కనిపిస్తాయి. వాటితో పాటు వివిధ రకాల ఇతర స్మారక చిహ్నాలు, కళింగ చరిత్రను వివరించే పురాతత్వ ప్రదేశాల చిత్రాలు కూడా ఉన్నాయి. ఈ మ్యూజియాన్ని ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తెరుస్తారు. శుక్రవారం నాడు సెలవు. పర్యాటకులు ఈ విషయాన్ని దష్టిలో పెట్టుకుంటే మంచిది.

శాస్త్రీయ నృత్య వేడుకలు...

పర్యాటకులకు స్వర్గాధామం కోణార్క్. ప్రపంచ నలు మూలల నుండి పర్యాటకులను ఆకర్షిస్తున్నది. కోణార్క్ డాన్స్ ఫెస్టివల్ ప్రతి సంవత్సరం డిసెంబర్ 1 నుండి 5 వరకు జరుగుతుంది. శాస్త్రీయ నత్య వేడుకలకు ఇది ప్రత్యేక ఆకర్షణ. ప్రాచీన నత్యాలైన ఒడిస్సీ, భరతనాట్యం, కథక్, కూచిపూడి, మణిపురి, స్థానిక ఛౌ డాన్సులు వేడుకలో ప్రదర్శిస్తారు. కోణార్క్ పర్యాటకం లో ప్రధాన ఆకర్షణ హస్త కళల మేళా. నోరూరించే వంటకాలు పర్యాటకులను బాగా ఆకట్టుకుంటాయి. కోణార్క్ లో పెద్ద ఎత్తున జరిగే మరొక ముఖ్యమైన పండుగ చంద్రభాగ మేళా. ఇది ఫిబ్రవరి నెలలో జరుగుతుంది. అలాగే కోణార్క్ లో షాపింగ్ మరో ప్రత్యేక ఆకర్షణ. కోణార్క్ లో ఉన్న కుటీర పరిశ్రమలో అల్లిన పందిళ్ళు, బ్యాగులు, గొడుగులు రంగు రంగుల్లో పర్యాటకులను అబ్బురపరుస్తాయి. వివిధ చిత్రాలు, ఏనుగు దంతం, రాయి, చెక్కతో చెయ్యబడిన డెకరేటివ్ వస్తువులు, పెయింటింగ్స్ ఇక్కడ చాలా లభిస్తాయి.

ప్రత్యేకతలెన్నో...!

ఈరోజుకి కూడా వేలాది మంది సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్న ఈ నిర్మాణం ఒకప్పుడు బౌద్ధధర్మానికి చెందింది. ప్రస్తుతం దీనిని అన్ని మతాలవారూ సందర్శిస్తున్నారని చరిత్ర స్పష్టం చేస్తోంది. ఎరుపు రంగు ఇసుక, నల్లటి రాళ్ళతో కట్టినందు వల్ల బ్రిటిష్ పాలనలో వారు దీన్ని 'బ్లాక్ పగోడా' అని వ్యవహరించేవారు. ఈ ఆలయాన్ని 1568లో బెంగాల్ సుల్తాన్ సులైమాన్ ఖాన్ కర్రాని నాశనం చేసాడు. ఆ సుల్తాన్ క్రింద జనరల్ కాలాపహాడ్ ఆధ్వర్యం లో మరోసారి కోణార్క్ సూర్య దేవాలయం విధ్వంసాన్ని చవిచూసింది. తర్వాత పదిహేడవ శతాబ్దంలో మొగల్ చక్రవర్తి జహంగీర్ ఈ కోణార్క్ ఆలయంలో మిగిలిన శిల్పాలను కొన్నింటిని నేల మట్టం చేశాడు. ఇప్పుడైతే ఏడు గుర్రాలలో, ఆరు గుర్రాలు మాత్రం శిథిలావస్థలో మిగిలివున్నాయి. అలాగే చాల చోట్ల విరిగి పోయిన శిల్పాలు ఇంకా చరిత్రను మాత్రం చెరపకుండా చూపిస్తున్నాయి. అంతే కాకుండా ఖజరహోలో ఉన్నట్లే ఇక్కడ కూడా కొన్ని వందల శృంగార శిల్పాలు న్నాయి. ఇవి చూసే తాపీ ధర్మారావు "దేవాల యాలపై బూతు బొమ్మలెందుకు?" అనే పరిశోధనాత్మక పుస్తకాన్ని రాసారు. ఈ ఆలయంలో ఎలాంటి విగ్రహం, పూజలు లేకపోయినా, రథ సప్తమి నాడు మాత్రం ఉత్సవాలు జరపడం విశేషం. ప్రస్తుతం కోణార్క్ పురావస్తుశాఖ నిర్వహణలో ఉంది. ప్రపంచ వార సత్వ సంపదల్లో ఇదొకటిగా ఐక్యరాజ్య సమితి 1984లో దీనిని గుర్తించింది.

అంతే కాకుండా ఖజరహోలో ఉన్నట్లే ఇక్కడ కూడా కొన్ని వందల శృంగార శిల్పాలు న్నాయి. ఇవి చూసే తాపీ ధర్మారావు "దేవాల యాలపై బూతు బొమ్మలెందుకు?" అనే పరిశోధనాత్మక పుస్తకాన్ని రాసారు.

చిల్కా సరస్సు...

ఒడిషా లో ప్రసిద్ధి చెందిన పర్యాటక కేంద్రాలలో ఒకటి చిల్కా సరస్సు. ఇది ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద సరస్సుగా పేరుగాంచింది. ఇది భువనేశ్వర్ నుంచి 81 కిలోమీటర్ల దూరంలో ఉంది. చిల్కా గంజాం జిల్లాలో, ఖుర్దా, పూరీ సరిహద్దుల వెంబడి ఉంటుంది. కళింగ రాజుల పాలనలో చిల్కా వాణిజ్య కేంద్రంగా, నౌకాశ్రయంగా ఉండేది. ఈ సరస్సు లో పడవ విహారం చాలా సరదాగా ఉంటుంది. కొంచెం ఎండగా, చల్లటి గాలి తగులుతుంటే ఆహ్లాదకరంగా ఉంటుంది. చిల్కా లో బోటింగ్, ఫిషింగ్, బర్డ్ వాచింగ్, ప్రధాన ఆకర్షణ. ప్రతి సంవత్సరం శీతాకాలంలో వేల పక్షులు చిల్కా సరస్సును సందర్శిస్తాయి. చేపలు, తాబేళ్ళు, పీతలు, రొయ్యలు, డాల్ఫిన్లు వంటి నీటి జంతువులూ చిల్కా సరస్సులో నివసిస్తాయి.



సూర్యదేవాలయం

బెర్హంపూర్ బీచ్...

ఇది అతిపెద్ద పురాతన నగరాలలో ఒకటి. ఒడిషాలోని గంజం జిల్లాలో ఉంది బెర్హంపూర్ నగరం. ఇది పట్టు వస్త్రాలకు, చేనేత, నగల దుకాణాలకు ప్రసిద్ధి. కాబట్టి దీన్ని పట్టు నగరంగా కూడా పిలుస్తారు. ఇక బెర్హంపూర్ బీచ్ ప్రేమికు లతో, పర్యాటకులతో ఎప్పుడు సందడిగా ఉంటుంది. బీచ్ ఒడ్డున కూర్చొని ఇసుకతో బొమ్మరిల్లు కట్టుకోవడం, అలలతో ఆడుకోవడం మరిచిపోలేని జ్ఞాపకం.



ఉదయగిరి గుహలు

సన్ రైజ్ హిల్స్...

భారత దేశంలో నిర్మాణ కౌశలానికి ఉదయగిరి చక్కటి ఉదాహరణ. ఇక్కడ తవ్వకాల్లో బయటపడ్డ బౌద్ధ, జైనుల పెద్ద పెద్ద నిర్మాణాలు, ఆశ్రమాలు, స్తూపాలు, శిథిలాల వల్ల దీనికి చాలా చారిత్రక ప్రాముఖ్యం ఉంది. ఒడిషా రాజధాని భువనేశ్వర్ నుంచి 85 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది ఉదయగిరి. దీన్ని సన్ రైజ్ హిల్స్ అని కూడా పిలుస్తారు. ఉదయగిరిలో 18 గుహలలో విస్తారంగా చెక్కిన శిల్పాలు, నిర్మాణాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఇక్కడ దొరికిన శాసనాల ప్రకారం జైన సన్యాసుల కొండలు తొలిచి నివాసాలను ఏర్పరుచుకున్నట్టు తెలుస్తున్నది. ఉదయగిరి పక్కనే ఉన్న ఖండ గిరి అనే మరో కొండ లో 15 గుహలు ఉన్నాయి. ఉదయగిరి, ఖండగిరి రెండూ ఉద యగిరి పర్యాటకానికి కీలకమైన పట్టుకొమ్మలు.

గోపాల్పూర్ బీచ్...

ఈ ప్రదేశం బంగాళాఖాతానికి సమీపంలో ఉంది. ఇది ఒడిషా కు దక్షిణ సరిహద్దు లో ఉన్న కోస్తా పట్టణం. ఒరిషా రాష్ట్రంలోని మూడు ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలలో ఒకటి గోపాల్పూర్. పూర్వం గోపాల్పూర్ ను మత్స్యకారుల గ్రామంగా పిలిచేవారు. ఇది మంచి వ్యాపార కేంద్రం. షాపింగ్ ప్రియులు ఈ పట్టణానికి ఎక్కువగా వస్తారు. గోపాల్పూర్ సముద్రపు గవ్వలతో తయారు చేసిన బ్రేస్‌లెట్‌లు, నెక్లెస్‌లు, పట్టుచీరల వంటి హస్తకళల కు ప్రసిద్ధి చెందింది.

అద్భుతమైన నగరం కటక్...

కటక్ లోని పర్యాటక ప్రదేశాలు చాలా ఉన్నాయి. ఇక్కడికి భువ నేశ్వర్ నుంచి 28 కిలోమీటర్ల దూరంలో ఉంది కటక్. ఒడిషా సాంస్కృతిక, వ్యాపార నగరంగా పేరుగాంచింది. కటక్ అతి పురాతన నగరాలలో ఒకటి. కటక్ పర్యటన పర్యాటకులను మంత్రముగ్దులను చేస్తుంది. అక్కడి కోటలు, కొండలు, శిల్ప సౌందర్యం అబ్బురపరుస్తాయి. కటక్‌కు దగ్గరలో ఉన్న ధబలేశ్వర్ బీచ్, రత్నగిరి, లలిత్‌గిరి, ఉదయగిరి కొండల అందాలు ఆకట్టుకుంటాయి. సత కోసియా వన్యప్రాణుల అభయారణ్యంలో వైవిధ్యమైన అడవి జంతువులను చూడవచ్చు. బారబతి స్టేడియంలో స్పోర్ట్స్ ప్రేమికులు ఎక్కువగా ఉంటారు. మన దేశ స్వాతంత్ర్యం గురించి, ఫ్రీడమ్ ఫైటర్స్ గురించి తెలుసుకో వాలనుకునే వారు నేతాజీ మ్యూజి యం సందర్శించ వచ్చు.

భువనేశ్వర్...

ఒడిషా రాజధాని భువనేశ్వర్. భారతదేశం తూర్పు భాగంలో ఉన్న గంభీరమైన పట్టణం. మహానది నైరుతి ఒడ్డున ఉన్నది. ఈ నగరం కళింగ కాలం నాటి నుంచి అద్భుతమైన నిర్మాణాశైలిని కలిగి ఉన్నది.


ఈ మహానగరంలో 3000 సంవత్సరాల నాటి గొప్ప వారసత్వ సంపద దాగి ఉన్నది. భువనేశ్వర్ భూభాగంలో 2000 కంటే ఎక్కువ దేవాలయాలు ఉంటాయి. కాబట్టి దీన్ని ఆలయనగరం అని కూడా పిలుస్తారు. భువనేశ్వర్ లో పురాతన కాలం నాటి గొప్ప నిర్మాణ శైలి ఉండటం వల్ల పర్యాటక రంగం అభివృద్ధి చెందింది. భువనేశ్వర్, పూరీ, కోణార్క్ ను కలిపి "స్వర్ణ త్రిభుజ" అని అంటారు. ముఖ్యంగా భువనేశ్వర్‌లో ఉండే దేవాలయాలు, సరస్సులు, గుహలు, మ్యూజియంలు, ఉద్యానవనాలు, ఆనకట్టలు, బిందిసాగర్ సరస్సు, ఉదయగిరి, ఖండగిరి, దులిగిరి, చందక వన్యప్రాణుల అభయారణ్యం, అత్రి వేడి నీటి బుగ్గ మొదలైనవి చూడదగ్గ ప్రదేశాలు. అలాగే భువనేశ్వర్‌లో అనేక పార్కులూ ఉన్నాయి.

ఎలా వెళ్లాలి?

దేశంలోని అన్ని ప్రధాన రైలు మార్గాలు, విమాన మార్గాల నుంచి ఒడిషా రాజధాని భువనేశ్వర్ చేరుకోవచ్చు. అక్కడికి అరవై కిలోమీటర్ల దూరంలో కోణార్క్ ఉంది. బస్సులు, ఇతన వాహనాల్లో కూడా భువనేశ్వర్ నుంచి కోణార్క్ చేరుకోవచ్చు, అందుబాటు ధరల్లోనే హొటళ్లు, ఆహారం లభిస్తాయి.

- రూప © 7661910634

పెరియార్ అడవి అందాలు...



ఇది కేరళలో ఉన్న ఓ అందమైన ప్రదేశం తేక్కడి. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి 900-1800 మీటర్ల ఎత్తులో ఉంటుంది. తేక్కడి అనే పేరు వినగానే మనకు ఏనుగులు, విడిపోయిన కొండలు, సుగంధ ద్రవ్యాల వాసనలు విరజిమ్మే తోటలు గుర్తుకు వస్తాయి. ఇంకా భారతదేశంలో ఉన్న అత్యద్భుతమైన వన్యప్రాణి సంరక్షణ కేంద్రాల్లో ఒకటి పెరియార్ అడవి. జంతు ప్రేమికులకు ఇది చక్కటి ప్రదేశం. అందమైన తోటలు, ఎత్తైన పర్వతాలపై నడక, ట్రెక్కింగ్ పర్యాటకులను మరింత అబ్బురపరుస్తాయి.

కుమిలి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది తేక్కడి. వివిధ ప్రాంతాల నుంచి తరచుగా పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. పెరియార్ అడవి లో నివాసించే పక్షులు, జంతువులు, మొక్కల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. అడవిలో కనిపించే కొన్ని ఆసక్తికరమైన విషయాలు... ఈ వన్య ప్రాణి సంరక్షణ కేంద్రంలో మొత్తం 1965 పుష్పించే మొక్కల్లో 171 గడ్డి రకాలు, 143 ఆర్కిడ్ రకాలు ఉన్నాయి. దక్షిణ భారతదేశ కోనిఫెరస్ పోడోకార్పస్ వలిచైనస్‌లు కేవలం ఇక్కడే ఉన్నాయి. అదే విధంగా ఇక్కడ జంతు సంపదకు కొదువే లేదు. 35 రకాల్లో కనిపించే ఏనుగులు, సాంబార్ డీర్, అడవి ఎలుగుబంట్లు ఉంటాయి. దీనికి దిగువ ప్రాంతంలో నీలగిరీ తార్ అనే అరుదైన జీవిని చూడవచ్చు. అదే విధంగా రాతి ప్రదేశాల్లో ఉండే సింహం, కోతులు, మలాబార్ జెయింట్ ఉడతలు, ఎగిరే ఉడతలు, పులి, అడవి పిల్లి, స్లాత్ బేర్ వంటివి కనిపిస్తాయి. ఇంకా ఇక్కడ వలస వచ్చిన పక్షులతో సహా 265 ఉంటాయి. హార్న్, కొంగ, వడ్రంగి పిట్ట, చెకుముకి పిట్ట, రాస్టర్, నీటికాకి, గ్రాకెల్, డార్టర్ మొదలైనవి.



సరీసృపాలైన కోబ్రా, తాచుపాము, కట్లపాము, విషం లేని అనేక పాములు, మానిటర్ బల్లి కనిపిస్తాయి. కప్పలతో పాటు రంగురంగుల మలబార్ గ్లైడిరగ్ కప్ప, కామన్ ఇండియన్ చిరుకప్ప, ఫన్‌గోయిడ్ కప్ప వంటి ఉభయచరాలు చాలా ఉంటాయి. పెరియర్ వాగులు, వంకల్లో అనేక రకాల జాతుల చేపలు కనిపిస్తాయి. ముషేర్, అదృశ్యమైపోతున్న భారతదేశ గేమ్‌ఫిష్ వంటివి ఉంటాయి. వోట్టర్ సరస్సులో ఉండే ఏకైక క్షీరదం. బోట్లో ప్రయాణించేటప్పుడు దీన్ని గమనించవచ్చు. తోటలు, టీ, యాలకులు, మిరియాల చెట్లు, కాఫీ తోటలు పెరియార్ వన్య సంరక్షణ కేంద్రం చుట్టూ ఉన్నాయి. ఇక పెరియార్ అడవిలోపల రెండు రకాల వాచ్ టవర్లు ఉంటాయి. ఫారెస్టు ఇన్ఫర్మేషన్ సెంటర్, ఇక్కడికి వెళ్లటానికి తెక్కడిలోనే రిజర్వేషన్లు చేసుకోవచ్చు.

> "రాజుల సొమ్ము రాళ్ల పాలు" అయితే కావొచ్చు గాక నష్టమేముంది? ఒక తాజ్‌మహల్, ఒక కోణార్క్, ఒక హంపీ, ఒక రామప్ప మనకు దక్కింది కదా!

ఈ శీర్షిక మీదే..

మీరు ఎన్నో ప్రదేశాలు చూసి ఉంటారు. మీ అనుభూతులను, ప్రయాణంలో ఎదురైన అనుభవాలను జరదేఖో పాఠకులతో పంచుకోండి.. jaradekhont@gmail.com

మా చిరునామా..
నవ తెలంగాణ తెలుగు దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కళ్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020

మిక్కిమౌస్ పువ్వులకు నిలయం...



అక్కడి ప్రకృతి అందాలను చూడటానికి రెండు కండ్లు చాలవు. ఎటు చూసినా చుట్టూ పచ్చదనమే కనిపిస్తుంది. కొండలు, గుట్టలు, పర్వతాలు... రంగురంగుల పూల సువాసనలు ఈ వ్యాలీ అంతటా వ్యాపించి ఉంటాయి. దక్షిణ భారత దేశంలో ఉన్న పూల లోయల్లో మరొకటి సతారా సమీపంలో ఉన్న కౌస్ మైదానం. ఈ అందమైన ప్రదేశం వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు పొందింది. వర్షాకాలం ఆరంభం నుంచి శీతాకాలం ముగింపు వరకు రంగు రంగుల పువ్వులతో ఈ లోయ పర్యాటకులను అబ్బురపరుస్తుంది. మిక్కిమౌస్ పువ్వులు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ.

మహారాష్ట్ర లోని సతారా జిల్లా 10,500 చ.కి.మీ ల విస్తీర్ణంలో నెలకొని ఉంది. దీనికి పడమటి వైపున రత్నగిరి, తూర్పున సోలాపూర్, దక్షిణాన సాంగ్లి ఉన్నాయి. దీని చుట్టూ కొండలు ఉండటం వల్ల సతారా అని పిలుస్తారు. అంటే సుమారుగా ఏడు కొండలు ఉంటాయి. ఆ ఏడు కొండల పేర్లను చూసినట్లైతే జరందేశ్వర్, యవతేశ్వర్, అజింక్యతర, కిట్లిచా దొంగార్, సజ్జనగడ, పెధ్యాచా బైరోబా, నడ్కిచా దొంగార్. సతారా చారిత్రక వైభవాన్ని గమనించినట్లైతే సతారా జిల్లాను ముందుగా రాష్ట్రకూట వంశస్తులు పాలించారు. వారి తర్వాత చాళుక్యులు, మౌర్య రాజులు పాలించారు. ముస్లిం దండయాత్ర తర్వాత సతారా మరాఠా నగరంగా మారింది. ఆ తర్వాత బ్రిటిష్ వారు సతారాను మరాఠాల నుంచి చేజిక్కించుకొని రాజా ప్రతాప సింహుడికి అప్పగించారు. అటు తర్వాత సతారా బొంబాయి ప్రెసిడెన్సీ లో భాగమైంది. ప్రకృతి ప్రేమికులు తప్పక చూడాల్సిన వివిధ జాతుల మొక్కలు ఇక్కడ దొరుకుతాయి. కౌస్ సరస్సు, కౌస్ మైదానంలో ఉండే పువ్వులు పర్యాటకులను అబ్బురపరుస్తాయి. ఇవే సతారాకు ప్రధాన జలవనరులు.



సెంచూరియన్ టెస్టు రసవత్తరంగా సాగుతోంది. మూడో రోజు కోహ్లి (153) మెరుపులతో భారత్ పోటీలో నిలువగా.. నాల్గో రోజు మహమ్మద్ షమి, ఇషాంత్ శర్మల మెరుపులతో దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 258 పరుగులే చేయగలిగింది. లక్ష్య ఛేదనలో భారత్‌కు ఆరంగేట్ర కుర్రాడు ఎంగిడి ఆదిలోనే మోకాలడ్డాడు. 35 పరుగులకే ఓపెనర్లు సహా విరాట్ కోహ్లి వికెట్ కోల్పోయింది భారత్. దీంతో ఆఖరు రోజు లక్ష్యాన్ని ఛేదించి భారత్ సిరీస్‌లో సమంగా నిలుస్తుందా? కోహ్లి సేన నిలకడగా ఆడి వికెట్లు కాపాడుకుంటే డ్రాగా ముగుస్తుందా? అన్న ఆసక్తి నెలకొన్నది.

ఛేదించేస్తారా?

కోహ్లి సేన విజయ లక్ష్యం 252 పరుగులు



- రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 258/10, భారత్ 35/3
- రాణించిన షమి, ఇషాంత్
- సెంచూరియన్ టెస్టు నాల్గో రోజు

నవతెలంగాణ-సెంచూరియన్

తొలి ఇన్నింగ్స్‌లో కోహ్లి (153) శతాధిక స్కోరుతో భారత్ విజయావకాశాలను సజీవంగా నిలుపగా, నాల్గో రోజు బౌలర్లు మెరిశారు. బుమ్రా సఫారీ టాప్ ఆర్డర్‌ను దెబ్బ తీయగా మహమ్మద్ షమి, ఇషాంత్ శర్మలు రాణించటంతో రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 258 పరుగుల చేయగలిగింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకుని భారత్‌కు 286 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే ఛేదనలో భారత్‌క ఆదిలోనే చుక్కెదురైంది. ఆరంగేట్ర బౌలర్ లుంగి ఎంగిడి కోహ్లి, కేఎల్ రాహుల్‌ల వికెట్లు పడగొట్టి భారత్‌ను ఒత్తిడిలో పడేశాడు. నాల్గో రోజు ఆటముగిసే సమయానికి 23 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయిన భారత్ 35 పరుగులు చేసింది. కోహ్లి సేన రెండో టెస్టు గెలవాలంటే 252 పరుగుల కోసం నేడు ఆట కొనసాగించనుండగా.. సఫారీలు ఏడు వికెట్ల కోసం ఆడనున్నారు.

షమి, ఇశాంత్ మెరుపులు : ఓవర్నైట్ స్కోరు 90/2తో సఫారీలు రెండో ఇన్నింగ్స్ కొనసాగించారు. క్రీజులో ఉన్న డివిలియర్స్, ఎల్గర్‌లు భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. ఈ జోడీ మూడో వికెట్‌కు భారీ భాగస్వామ్యాన్ని జోడించారు. భారత పేసర్ మహమ్మద్ షమి ఈ విధ్వంసక జోడీని విడదీశాడు. తొలుత ఏబీ డివిలియర్స్ (80) వికెట్‌ను పడగొట్టగా, ఆపై డీన్ ఎల్గార్ (61)ను పెవీలియన్ బాటపట్టించాడు షమి. ఆపై వచ్చిన క్వింటన్ డికాక్ (12) సైతం షమి బౌలింగ్‌లోనే క్రీజును వీడాడు. భోజన విరామానికి దక్షిణాఫ్రికా 5 వికెట్ల నష్టానికి 173 పరుగులతో నిలిచింది. సారథి డుప్లెసిస్, వెర్నర్ ఫిలాండర్ ఆచితూచి ఆడుతూ జట్టు స్కోరును ముందుకు నడిపించారు. విభిన్నంగా స్పందిస్తోన్న పిచ్‌పై ఈ జోడీ భారత బౌలర్ల ఇబ్బంది పెట్టారు. రెండో సెషన్‌లో ఆట నత్తనడకన సాగగా.. 10 ఓవర్లలో 19 పరుగులే రాబట్టారు సఫారీలు. 74 ఓవర్లో పేసర్ ఇషాంత్ శర్మ వరుస వికెట్లతో మెరిశాడు. ఆ ఓవర్ నాల్గో బంతికి ఫిలాండర్ (26)ను ఔట్ చేశాడు. రెండు ఓవర్ల వ్యవధిలో కేశవ్ మహరాజ్ (6)ను బలిగొన్నాడు. టీ విరామానికి 82 ఓవర్లు ముగిసే సరికి ఏడు వికెట్ల నష్టానికి 230 పరుగుల చేసింది డుప్లెసిస్ సేన. ఓపెనర్ల పనిపట్టిన బుమ్రా బంతికే డుప్లెసిస్ వెనుదిరగగా, వెనువెంటనే మిగిలిన వికెట్లు సైతం కూలాయి. రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 258 పరుగులు చేసింది.

ఆదిలోనే తడబాటు: ఛేదనలో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు మురళీ విజయ్ (9), కేఎల్ రాహుల్ (4) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. వీరోచిత ఇన్నింగ్స్ ఆడుతాడనుకున్న విరాట్ కోహ్లి (5) ఎంగిడి బౌలింగ్‌లో ఎల్‌బిగా వెనుదిరిగాడు. ఆటముగిసే సమయానికి చటేశ్వర్ పుజారా (11 బ్యాటింగ్), పార్థివ్ పటేల్ (5బ్యాటింగ్) అజేయంగా కొనసాగుతున్నారు. నేడు లక్ష్యాన్ని ఛేదించకపోయినా.. భారత్ వికెట్లు కాపాడుకుంటే మ్యాచ్ డ్రా అయ్యే అవకాశమున్నది.

కోహ్లికి జరిమానా

మైదానంలో టీమ్ ఇండియా సారథి విరాట్ కోహ్లి దూకుడు అందరికీ తెలిసిందే. భావోద్వేగాల నియంత్రణలో అప్పుడప్పుడు పరుగుల యంత్రం విఫలమవుతుంటాడు. తాజా సెంచూరియన్ టెస్టులోనూ కోహ్లి సహనం కోల్పోయిన ఘటన చోటు చేసుకున్నది. ఔట్ ఫీల్డ్ బాలేదంటూ పలు మార్లు కోహ్లి అంపైర్ మైఖేల్‌కు ఫిర్యాదు చేశాడు. అయితే అంపైర్.. కోహ్లితో ఏకీభవించలేదు. దీంతో కోపగించిన కోహ్లి బంతిని నేలకేసి కొడుతూ అసహనాన్ని వ్యక్తపరిచాడు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఐసీసీ.. క్రమ శిక్షణా నియమావళి కోడ్ 2.1.1ను కోహ్లి ఉల్లంఘించినందున అతనికి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించింది.

బ్రాడ్‌మన్ రికార్డు సమం

ఆసీస్ మాజీ క్రికెటర్ డాన్ బ్రాడ్‌మన్ రికార్డును పరుగుల యంత్రం కోహ్లి సమం చేశాడు. సెంచూరియన్ టెస్టులో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో కోహ్లి 153 పరుగులు చేశాడు. టెస్టుల్లో ఇప్పటిదాకా తొమ్మిదిసార్లు విరాట్ 150కి పైగా పరుగులు చేశాడు. అందులో ఎనిమిది సార్లు కెప్టెన్‌గా ఈ ఘనత సాధించిన కోహ్లి.. డాన్ బ్రాడ్‌మన్ రికార్డు అందుకున్నాడు.

సాహా స్థానంలో దినేశ్ కార్తీక్

దక్షిణాఫ్రికాతో ఈ నెల 24 నుంచి జరుగనున్న చివరి టెస్టుకు దినేశ్ కార్తీక్ అందుబాటులో ఉండనున్నాడు. వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా ప్రాక్టీసు సెషన్‌లో గాయపడటంతో అతని స్థానంలో దినేశ్ కార్తీక్ జట్టులోకి రానున్నట్టు సెలక్షన్ కమిటీ తెలిపింది. ఈ విషయాన్ని బీసీసీఐ ట్వీటర్ ద్వారా వెల్లడించింది. బీసీసీఐ పిలుపుతో దినేశ్ దక్షిణాఫ్రికా బయలుదేరాడు.

స్కోరు వివరాలు :

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : 335/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : 307/10

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ : ఏడెన్ మార్క్‌రం ఎల్‌బి (బి) బుమ్రా 1, డీన్ ఎల్గార్ (సి) రాహుల్ (బి) షమి 61, హషీం ఆమ్లా ఎల్‌బి (బి) బుమ్రా 1, ఏబీ డివిలియర్స్ (సి) పార్థివ్ పటేల్ (బి) షమి 80, డుప్లెసిస్ (సి,బి) బుమ్రా 48, క్వింటన్ డికాక్ (సి) పార్థివ్ పటేల్ (బి) షమి 12, వెర్నన్ ఫిలాండర్ (సి) విజయ్ (బి) ఇషాంత్ 26, కేశవ్ మహరాజ్ (సి) పార్థివ్ పటేల్ (బి) ఇషాంత్ 6, కగిసో రబాడా (సి) కోహ్లి (బి) షమి 4, మోర్నీ మోర్కెల్ నాటౌట్ 10, లుంగిని ఎంగిడి (సి) విజయ్ (బి) అశ్విన్ 1, ఎక్స్‌ట్రాలు 8, **మొత్తం : (91.3 ఓవర్లలో 10 వికెట్లకు) 258.**

వికెట్ల పతనం : 1-1, 3-2, 3-144, 4-151, 5-163, 6-209, 7-215, 8-245, 9-245, 10-258.

బౌలింగ్ : రవిచంద్రన్ అశ్విన్ 29.3-6-78-1, జస్ప్రీత్ బుమ్రా 20-3-70-3, ఇషాంత్ శర్మ 17-3-40-2, మహమ్మద్ షమి 16-3-49-4, హార్దిక్ పాండ్య 9-1-14-0.

భారత్ రెండో ఇన్నింగ్స్ : మురళీ విజయ్ (బి) రబాడా 9, లోకేష్ రాహుల్ (సి) మహరాజ్ (బి) లుంగి ఎంగిడి 4, చటేశ్వర్ పుజారా బ్యాటింగ్ 11, విరాట్ కోహ్లి ఎల్‌బి (బి) లుంగి ఎంగిడి 5, పార్థివ్ పటేల్ బ్యాటింగ్ 5, ఎక్స్‌ట్రా 1, **మొత్తం : (23 ఓవర్లలో 3 వికెట్లకు) 35.**

వికెట్ల పతనం : 1-1, 2-16, 3-26.

బౌలింగ్ : వెర్నన్ ఫిలాండర్ 6-3-6-0, కగిసో రబాడా 5-2-9-1, లుంగిసాని ఎంగిడి 6-2-14-2, మోర్నీ మోర్కెల్ 5-3-4-0, కేశవ్ మహరాజ్ 1-0-1-0.

అనుకూల్ అదరహో

భారత్ చేతిలో పది వికెట్ల తేడాతో పపువా న్యూగినియా చిత్తు

- మెరిసిన శివం మావి, పృథ్వీ షా
- అండర్ 19 ప్రపంచ కప్



అనుకూల్ (5/14)

మౌంట్ మాంగనుయి : హాట్ ఫేవరెట్‌గా బరిలో దిగిన భారత అండర్ 19 కుర్రాళ్లు అదరగొట్టారు. ప్రపంచ కప్ గ్రూప్ దశ రెండో మ్యాచ్‌లో పసికూన పపువా న్యూగినియాపై పది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించారు. పూర్తి ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, స్పిన్నర్ అనుకూల్ సుధాకర్ రాయ్ (5/14) ఐదు వికెట్లతో చెలరేగాడు. ప్రత్యర్థి టాప్ ఆర్డర్‌ను కుప్ప కూల్చిన పేసర్ శివం మావి (2/16) భారత్‌కు శుభారంభాన్నివ్వగా, భారత్ దూకుడుకు అడ్డు లేకుండా పోయింది. మనోళ్ల బౌలింగ్ దెబ్బకు 64 పరుగులకే కుప్పకూలింది న్యూగినియా. పట్టుమని 22 ఓవర్లు కూడా ఆడలేదు. ఇక ఛేదనలో కుర్ర కెప్టెన్ పృథ్వీషా (57 నాటౌట్) అజేయ అర్థ శతకంతో భారత్ గెలుపును లాంఛనం చేశాడు. తాజా విజయంతో పృథ్వీ షా సేన గ్రూప్ బి లో అగ్రస్థానంలో ఉన్నది. శుక్రవారం యువ భారత్.. జింబాబ్వే అండర్ 19 జట్టుతో ఆఖరుదైన మూడో గ్రూప్ దశ మ్యాచ్ ఆడనున్నది.

ముగ్గురు అదరగొట్టారు : ప్రపంచ కప్‌లో భారత్ రెండో విజయం నమోదు చేయటంలో అనుకూల్ సుధాకర్ రాయ్, శివం మావి, పృథ్వీ షా.. ఈ ముగ్గురు కీలక పాత్ర పోషించారు. భారత్ టాస్ నెగ్గింది. కెప్టెన్ పృథ్వీ షా మరో ఆలోచనే లేకుండా ప్రత్యర్థులను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. న్యూగినియా ఓపెనర్ ఇగో మహురు (4)ను మూడో ఓవర్ చివరి బంతికే పెవీలియన్ చేర్చాడు పేసర్ శివం మావి. ఏడో ఓవర్ ఐదో బంతికి వన్ డౌన్‌లో వచ్చిన హీగి టువా (0)కు అదే బాట పట్టించాడు. తదుపరి బంతికే మరో ఓపెనర్ సిమోన్ ఆటాయి (13) రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆపై వచ్చిన బ్యాట్స్‌మెన్‌లో ఒవియా శామ్ (15), సినాకా అరువ (12) మినహా, ఇతర బ్యాట్స్‌మెన్ రెండంకెల స్కోరు చేయలేకపోయారు. న్యూగినియా కెప్టెన్ వాగి కరాహో (6) వికెట్‌ను ఆర్శ్‌దీప్ సింగ్ కూల్చాడు. 42 పరుగులకే నాల్గు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది న్యూగినియా. తొమ్మిదో ఓవర్‌లో బంతి అందుకున్న ఎడమ చేతి వాటం స్పిన్నర్ అనుకూల్ సుధాకర్ రాయ్ విజృంభించాడు. రాయ్ దూకుడుతో ఆఖరు నలుగురు బ్యాట్స్‌మెన్ ఒక్క పరుగూ నమోదు చేయలేకపోయారు. దీంతో ఆ జట్టు 21.5 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసింది. శివం మావి రెండో, అనుకూల్ రాయ్ ఐదు వికెట్లు పడగొట్టగా, నాగర్‌కోటి, ఆర్శ్‌దీప్‌లు చెరో వికెట్ తీసుకున్నారు. ఇక స్వల్ప లక్ష్య ఛేదనలో భారత్ చెమట చుక్క చిందించలేదు. కెప్టెన్ పృథ్వీ షా తానెదుర్కొన్న 39 బంతుల్లో 12 ఫోర్లతో విరుచుకుపడ్డాడు. సాధించిన 57 పరుగుల్లో 48 పరుగులు బౌండరీల ద్వారానే రాబట్టాడు. మరో ఎండ్‌లో మన్‌జోత్ కల్‌రా (9 నాటౌట్).. పృథ్వీతో పాటు అజేయంగా నిలిచాడు.



పృథ్వీషా (57 నాటౌట్)

స్కోరు వివరాలు :

పపువా న్యూగినియా ఇన్నింగ్స్ : సిమోన్ ఆటాయి రనౌట్ (నాగర్ కోటి) 13, ఇగో మహురు ఎల్‌బి (బి) శివం మావి 4, హీగి టువా (బి) శివం మావి 0, ఒవియా శామ్ (సి) శివం మావి (బి) అనుకూల్ రాయ్ 15, వాగి కరాహో (సి) ఆర్యన్ జుయాల్ (బి) ఆర్శ్‌దీప్ సింగ్ 6, సినాకా అరువ (బి) అనుకూల్ రాయ్ 12, కేవు టావు (సి) శుభ్‌మన్ గిల్ (బి) అనుకూల్ రాయ్ 2, లేకే మోరియా (బి) నాగర్ కోటి 0, జేమ్స్ టావు (బి) అనుకూల్ రాయ్ 0, బోగె అరవు నాటౌట్ 0, సెమో కామే (బి) అనుకూల్ రాయ్ 0, ఎక్స్‌ట్రాలు 12, **మొత్తం: (21.5 ఓవర్లలో 10వికెట్లకు) 64.**

వికెట్ల పతనం : 1-31, 2-26, 3-26, 4-42, 5-61, 6-62, 7-62, 8-63, 9-64, 10-64.

బౌలింగ్ : శివం మావి 5-0-16-2, కమలేష్ నాగర్‌కోటి 6-3-17-1, అనుకూల్ సుధాకర్ రాయ్ 6.5-2-14-5, ఆర్శ్‌దీప్ సింగ్ 3-0-10-1, శివ సింగ్ 1-0-1-0.

భారత్ ఇన్నింగ్స్ : పృథ్వీ షా నాటౌట్ 57, మన్‌జోత్ కల్‌రా నాటౌట్ 9, ఎక్స్‌ట్రా 1, **మొత్తం : (8 ఓవర్లలో వికెట్లు నష్టపోకుండా) 67.**

బౌలింగ్: సెమోకామే 3-0-27-0, జేమ్స్‌టావు 4-0-28-0, లేకే మోరియా 1-0-11-0.

ఫెడరర్ శుభారంభం

- నడాల్, జకోవిచ్, షరపోవా కూడా
- తొలి రౌండ్‌లో యుకీ ఔట్



రోజర్ ఫెడరర్

ఆస్ట్రేలియా ఓపెన్

మెల్‌బోర్న్ : సీజన్ తొలి గ్రాండ్ స్లామ్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్, స్విస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ శుభారంభం చేశాడు. తొలి రౌండ్ పోరులో అల్‌జాజ్ బెడెన్ (స్లోవేనియా)ను వరుస సెట్లలో 6-3, 6-4, 6-3తో మట్టి కరిపించాడు. రెండో రౌండ్‌లో జాన్ లెనార్డ్ (జర్మనీ)తో తలపడనున్నాడు. గతేడాది రన్నరప్ రఫెల్ నడాల్ (స్పెయిన్) 6-1, 6-1, 6-1తో విక్టర్ బర్గస్ (డొమినిక్ రిపబ్లిక్)ను సునాయసంగా ఓడించి బోణి చేశాడు. రెండో రౌండ్‌లో టాప్ సీడ్ నడాల్ లియోనార్డో మేయర్ (అర్జెంటీనా)తో తలపడనున్నాడు. 14వ సీడ్‌గా మెల్‌బోర్న్ బరిలో దిగిన సెర్బియా యోధుడు నొవాక్ జకోవిచ్ తొలి మ్యాచ్‌లో డొనాల్డ్ యంగ్ (అమెరికా)పై 6-1, 6-2, 6-4తో గెలుపొం దాడు. రెండో రౌండ్‌లో గేల్ మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)ను ఢీకొననున్నాడు. వీరే గాక మూడో సీడ్ గ్రిగర్ దిమిత్రోవ్, ఐదో సీడ్ డొమినిక్ థీమ్, డేవిడ్ గొఫిన్, శామ్ ఖుర్రేలు రెండో రౌండ్‌లో అడుగుపెట్టారు. భారత్ తరఫున ప్రధాన టోర్నీలో అడుగుపెట్టిన యుకీ బాంబ్రీకి నిరాశ ఎదురైంది. తొలి పోరులో యుకీ.. బాగ్దాటిస్ చేతిలో 6(4)-7(7), 6-4, 6-3తో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. మహిళల సింగిల్స్‌లో రష్యా సుందరి మరియా షరపోవా తొలి పోరులో 6-1, 6-4తో మరియా (జర్మనీ)పై గెలుపొందింది. టాప్ సీడ్ సిమోన హాలెప్, మూడో సీడ్ గార్బినె ముగురుజ, ఆరో సీడ్ కరోలినా ప్లిస్కోవాలు తొలి మ్యాచ్ విజయాలతో రెండో రౌండ్‌లో ప్రవేశించారు. వీనస్ విలియమ్స్, స్లోనె స్టీఫెన్స్, క్విటోవాలు తొలి రౌండ్ ఓటములతో ఇంటి ముఖం పట్టారు.



యుకీ బాంబ్రీ



భక్తులు భళా..రైతు డీలా

మేడారం జాతర తీరిది

- సాగు భూముల్లో ఇష్టమొచ్చినట్టు అధికారుల ఏర్పాట్లు
- నాలుగు వేల ఎకరాల్లో రూ.20 కోట్ల నష్టం
- చదును చేసుకునేందుకు అదనపు శ్రమ

మేడారం జాతర ! భక్తుల మదిలో ఆనందహేల!! కాని అదే సమయంలో స్థానిక రైతుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్న మోత!!! జౌను ఇది నిజం. ప్రతి ఏడాది మేడారం జాతర ముఖచిత్రమిదే. మేడారం జాతరకు వచ్చే కోటి మందికి పైగా భక్తులకు తగిన ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వం స్థానికుల భూములను ఉపయోగించుకొని పైసా కూడా నష్టపరిహారం ఇవ్వడంలేదు.అదేమని అడిగితే అసలు ఈ భూములు మీవి కావు పొమ్మంటున్నది? కనీసం నాశనం చేసిన భూములను బాగుచేసికూడా ఇవ్వడం లేదు. ఇదేం అన్యాయం!? ఈ వ్యవవహారంపై 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం...




మేడారం నుంచి పార్నంది వెంకటస్వామి

మేడారం జాతర సందర్భంగా ప్రతి యేడాదీ అక్కడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జాతర ఏర్పాట్ల కోసం అధికారులు పొలాలను ఉపయోగిస్తున్నారు. కానీ ఎలాంటి పరిహారం ఇవ్వకపోవడంతో పంట నష్టంతోపాటు, ఆ భూములను మళ్లీ సాగుకు అనువుగా చేసుకునేందుకు రైతులపై అదనపు భారం పడుతోంది.

మేడారం చుట్టూ రెడ్డిగూడెం, నార్లాపూర్, కొత్తూరు, కన్నెపల్లి, ఊరట్టం, ఎలిగడ్డ, పడిగాపూర్, వెంగళాపూర్, ప్రాజెక్టునగర్ గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో సుమారు రెండు వేల మంది రైతులకు చెందిన 6వేల ఎకరాల పొలాలు ఉన్నాయి. అయితే, ప్రతి ఏడాదీ జాతర సందర్భంగా పై గ్రామాల్లోని సుమారు నాలుగు వేల ఎకరాల్లో పంట నష్టం జరుగుతోంది. కొన్నిసార్లు వేసిన పంటలు ధ్వంసం అవుతుండటంతో.. కొందరు ఆ సమయానికి సాగు చేయకుండా వదిలేస్తున్నారు. ఇక్కడి రైతులు సాగు చేస్తున్న భూముల్లో కొన్ని పట్టా భూములు, ఉండగా కొన్ని ప్రభుత్వ భూములు ఉన్నాయి. ప్రతి రెండేళ్లకోసారి జాతర సందర్భంగా ఒక పంట నష్టపోతున్నారు. రైతుల భూముల్ని పూర్తిగా ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకొని కందకాలు తవ్విస్తోంది. నల్లాలు, మరుగుదొడ్ల నిర్మాణం, రోడ్లు వేయడం, ప్రభుత్వ పనులకు వినియోగించుకోవడం జరుగుతోంది. దీనివల్ల రైతులు నష్టపోతున్నందున పరిహారం చెల్లించాలని గతంలో ఎస్‌వి ఇందిర హైకోర్టులో కేసు వేశారు. కోర్టు రైతులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. పరిహారం ఇవ్వకపోగా, ఈ భూములపై 'మీకు హక్కుల్లేవ్..' అంటూ స్థానిక తహసీల్దార్, వీఆర్‌ఓలు రైతులను బెదిరిస్తున్న పరిస్థితి.

ఏర్పాట్లు సరే.. పరిహారమేది..

జాతరకు వచ్చిన వారికి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం ఏర్పాట్ల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. కానీ, భూముల్లో పంట నష్టపోతున్న రైతులకు మాత్రం పరిహారం ఇవ్వడం లేదు. నాకు జంపన్న వాగు ప్రాంతంలో మూడెకరాల భూమి ఉంది. బోర్లు వేసి పైపులైన్లు వేశాం. జాతర సందర్భంగా అన్నీ ధ్వంసం చేస్తున్నారు. కందకాలు తీస్తున్నారు. పశువులు అందులో పడి చనిపోతున్నాయి. పొలాల గట్లను చెడిపేస్తే మళ్లీ గట్లు వేస్తున్నాం. ఇలా అనేక ఇబ్బందులు పడుతున్నాం. అందువల్ల పరిహారం చెల్లించి తమని ఆదుకోవాలి.



రైతు పారెపల్లి నర్సింహ్మారెడ్డి

ప్రతిసారీ రూ.20 కోట్ల నష్టం

ఇక్కడి పొలాల్లో ఎకరాకు 40బస్తాల ధాన్యం దిగుబడి వస్తుంది. అంటే, జాతర వల్ల ఎకరాకు సుమారు 30 క్వింటాళ్ల ధాన్యానికి రూ.45వేల నష్టపోతున్నారు. దీంతో ప్రతి జాతర సమయంలో నాలుగు వేల ఎకరాలకు దాదాపు రూ.18 కోట్ల పంట నష్టపోతున్నారు. జాతర ముగిసాక ఆ భూముల్ని చదును చేసుకోవడానికి మరో రెండు కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇలా మేడారం రైతులు ప్రతి జాతర సందర్భంగా 20 కోట్ల రూపాయలు నష్టపోతున్నారు.

పరిహారం ఇవ్వాలి

కన్నెపల్లి-మేడారం-నార్లాపూర్ మూల మలుపు వద్ద నాకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. సర్వే నెంబర్ 42/25, 41/22. ఇది రిజిస్ట్రేషన్ భూమి. జాతర సందర్భంగా ఆభూమంతా పాడవుతున్నది. పంట వేస్తే సుమారు రెండున్నర లక్షల రూపాయల ఆదాయం వస్తది. పంటలు వేసినా అధికారులు ధ్వంసం చేస్తున్నారు. పరిహారం మాత్రం ఇవ్వడం లేదు.



రైతు కడారి రామస్వామి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.